తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
RNI NO.TELTEL / 2013 /50370
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 01.11.2026 | సంపుటి:13 సంచిక : 102 | పేజీలు :12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

పొట్టకూటి కోసం వచ్చి.. అండాల వ్యాపారానికి

బలైపోతున్న పేదింటి ఆడపిల్లలు

గర్ల్స్ హాస్టళ్లే అక్రమ అండాల సేకరణ కేంద్రాలు

పొట్టకూటి కోసం పల్లెల నుంచి పట్నానికి వస్తున్న పేదింటి ఆడపిల్లల నిస్సహాయతను కొందరు అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వచ్చి గర్ల్స్ హాస్టళ్లలో ఉంటున్న యువతులే లక్ష్యంగా సాగుతున్న అక్రమ మానవ అండాల (హ్యూమన్‌ఎగ్స్) సేకరణ వ్యవహారం మహిళల ఆరోగ్య భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హాస్టల్ బిల్లులు చెల్లించలేని ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని, అండాలు దానం చేస్తే డబ్బులు ఇస్తామంటూ యువతులను ప్రలోభపెట్టి, వారి అండాలను సేకరించి వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.



- హాస్టల్ బిల్లుల చెల్లింపు పేరుతో వల
- ఒక్కో అండానికి రూ.30 వేల ఆశ..
- హార్మోన్ల ఇంజెక్షన్లతో ఆరోగ్యంపై ముప్పు
- బేగంపేట, సరూర్‌నగర్‌లో పోలీసుల దాడులతో వెలుగులోకి వచ్చిన దందా

హైదరాబాద్(జనంసాక్షి): బేగంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ఓ గర్ల్స్ హాస్టల్‌తో పాటు సరూర్‌నగర్ పరిధిలో మరో కేంద్రంపై మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీమ్ , స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హాస్టళ్ల ముసుగులో అండాల సేకరణ కార్యకలాపాలు సాగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

హాస్టల్ బిల్లులే బలహీనతగా..

బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన యువతులు, తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద కుటుంబాల అమ్మాయిలను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న యువతులకు ఒక్కో అండానికి రూ.30 వేల వరకు చెల్లిస్తామంటూ ఆశ చూపినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరికి హాస్టల్ ఫీజులు, ఇతర ఖర్చుల పేరుతో ఈ ప్రక్రియకు అంగీకరించేలా ప్రలోభపెట్టినట్లు తెలుస్తోంది.

ఆరోగ్యంతో చెలగాటం..

వైద్యపరమైన పర్యవేక్షణ, చట్టబద్ధమైన అనుమతులు, అవసరమైన ఆరోగ్య భద్రతా ప్రమాణాలు లేకుండా అండాల సేకరణకు ప్రయత్నిస్తే మహిళల ప్రాణాలకు, ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం మిగతా 2లో..

హైదరాబాద్‌లో మహిళల అండాల విక్రయ ముఠా

గుట్టురట్టు

48 మంది మహిళలకు విముక్తి.. 8 మంది అరెస్ట్

హైదరాబాద్(జనంసాక్షి): బేగంపేట, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ప్రైవేటు వసతి గృహాల ముసుగులో సాగుతున్న మహిళల అండాల అక్రమ సేకరణ, విక్రయాల దందాను పోలీసులు గుట్టురట్టు చేశారు. బేగంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో ఉన్న బాలికల వసతి గృహంలో స్థానిక పోలీసులు, మల్కాజిగిరి ప్రత్యేక కార్యాచరణ బృందం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ ముఠా వివరాలను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి శనివారం మీడియాకు వెల్లడించారు. ఈ దందాలో ఇండోర్‌కు చెందిన అమిత్ శర్మ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు సీపీ తెలిపారు. బేగంపేటకు చెందిన నిఖత్ పర్వీన్ రిక్రూటర్‌గా, రెజిమెంటల్ మిగతా 2లో..

ఇస్రోకు మరో ఘన విజయం

జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ప్రయోగం విజయవంతం

- కక్ష్యలోకి మూడో స్వదేశీ అణు గడియారం
- నాలుగు ఉపగ్రహాలతో మళ్లీ నావిక్ సేవలు
- విజయంపై ప్రధాని మోదీ హర్షం

శ్రీహరికోట(జనంసాక్షి):ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఎన్‌వీఎస్-03 నిర్దేశిత ప్రవేశ కక్ష్యలోకి చేరుకుంది. ఈ ప్రయోగం సక్సెస్ కావడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక విజయాన్ని అందుకుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ ద్వారా నింగిలోకి పంపిన నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌వీఎస్-03 నిర్దేశిత ప్రవేశ కక్ష్యలోకి చేరుకుంది. నేవిగేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి చేర్చడంతో శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం భారత అంతరిక్ష పరిశోధన రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. శుక్రవారం మిగతా 2లో..

ఏపీకి మరో వాయు'గండం'

అప్రమత్తతపై సీఎం చంద్రబాబు సమీక్ష

వార్త 9 లో

మాక్ పార్లమెంట్

జ్ఞానేశ్‌పై అవిశ్వాస తీర్మానం

ప్రవేశపెట్టిన కాంగ్రెస్

- అధికారంలో కొనసాగేందుకు మోదీ ప్రభుత్వం అన్ని కుట్రలు చేస్తోంది
- సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని మలికార్జున ఖర్గే డిమాండ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్నారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దీనివల్ల దేశంలో సామాన్యుడి ఓటు హక్కు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను నిలిపివేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. శనివారం దిల్లీలోని ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన ప్రతిపక్ష ఇండీ కూటమి 'మాక్ పార్లమెంట్' సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మిగతా 2లో..

'ఢిల్లీ మార్చ్'కు అనుమతి లేదు

అందుకోసం ఎలాంటి దరఖాస్తు రాలేదన్న పోలీసులు 2 లో..

మియాపూర్ భూముల్ని కాపాడింది మేమే..

రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ : హరీశ్

హైదరాబాద్ (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మియాపూర్ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిపోనున్నారని దుయ్యబట్టారు. సీఎంకు అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని వ్యాఖ్యనించారు. మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికి చెందినవేనని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అబద్ధాలతో క్రెడిట్ చోరీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మియాపూర్ భూముల విషయంపై సుప్రీం కోర్టు జడ్జిమెంట్ మిగతా 2లో..

జాతీయ సమైక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలి

డీజీపీ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర అభ్యంతరాలకు

పరిష్కారం చూపండి

సాగునీటి లక్ష్యాలకు భంగం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించాలి

- వివిధ నీటిమట్టాల్లో ముంపు వివరాలతో సమగ్ర పటాలు సిద్ధం చేయాలి
- అధికారులకు ఆచరణాత్మక పరిష్కారాల రూపకల్పనపై దిశానిర్దేశం
- బ్యారేజీ అలైన్‌మెంట్లు, సాంకేతిక అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): ప్రతిపాదిత తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర వ్యక్తం చేస్తున్న ముంపు, పర్యావరణ సంబంధిత ఆందోళనలకు సాంకేతికంగా సమర్థమైన, ఆచరణసాధ్యమైన పరిష్కారాలు రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సాగునీటి లక్ష్యాలకు భంగం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే ఇంజినీరింగ్ మార్పులను పరిశీలించాలని సూచించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల జరిగిన చర్చలకు కొనసాగింపుగా శనివారం తుమ్మిడిహట్టి బ్యారేజీ సాంకేతిక అంశాలు, ప్రతిపాదిత అలైన్‌మెంట్లపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వివిధ జలాశయ నీటిమట్టాల వద్ద మిగతా 2లో..

తరగతి గదిలో ఉన్మాది వీరంగం

విద్యార్థినిపై రంపంతో దాడి

- దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినికీ గాయాలు
- అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో చోటు చేసుకున్న దారుణం
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు
- పోలీసుల అదుపులో నిందితుడు!

రాప్తాడు(జనంసాక్షి): అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో దారుణం చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ ఉన్మాది రంపంతో దాడి చేశాడు. దీంతో ఆమె ముఖం, తల, వీపు భాగాల్లో మిగతా 2లో..

క్రాప్ హాలిడే మేం ప్రకటించలేదు

ఆ ప్రచారం నమ్మొద్దు : మంత్రి తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిందని ప్రచారం జరగుతున్న వేళ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీనిపై క్లారిటీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి క్రాప్ హాలిడే ప్రకటన చేయలేదని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని రైతులు

యుద్ధం ముగించడంలో తొందరేంలేదు

ఇరాన్‌తో ఉద్రిక్తతలపై ట్రంప్ వ్యాఖ్యలు
యుద్ధానికి పెద్దగా ఖర్చు కూడా కాలేదని వెల్లడి

వాషింగ్టన్(జనంసాక్షి): ఇరాన్ యుద్ధం వల్ల అమెరికాపై పెద్దగా ఆర్థిక భారమేమీ పడలేదన్నట్టుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. వెనెజువెలా నుంచి భారీగా ముడి చమురును రవాణా చేశామని, దానితో వచ్చిన ఆదాయంతో ఆ యుద్ధం ఖర్చు అంతా భర్తీ అయిందని అధ్యక్షుడు మీడియాకు వెల్లడించారు. అంతేగాక, ఇరాన్‌తో యుద్ధం ముగించడంలో తొందరేంలేదని వ్యాఖ్యానించారు. టెహ్రాన్‌పై మరోసారి దాడులు జరగొచ్చని సంకేతాలు మిగతా 2లో..

నత్తలా నౌకను అతుక్కొని.. ఒక్కసారిగా పేలి..

భారతీయులున్న షిప్‌పై దాడిలో లింపెట్ మైన్స్..? 2లో..

మావోయిస్టులను నిర్మూలించి

ఆదివాసీ ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరించాం

- దేశ వ్యతిరేక శక్తులన్నీ ఏకమయ్యాయి
- దేశ విభజనకు కుట్ర చేస్తున్నాయి
- దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు
- విపక్షాల కుట్రలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలి:ప్రధాని మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని, విపక్షాల కుట్రలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే దిమాగీ నక్సల్స్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ సూచించారు. భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమై దేశంలో విభజనను ప్రోత్సహించాలని కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అబద్ధాలను, వదంతులను వ్యాప్తి చేస్తూ అస్థిరతను సృష్టించే పనిలో నిమగ్నమయ్యాయని మండిపడ్డారు. ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు ఘన నివాళి అర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న పటేల్ భారీ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ప్రధాని పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రతకు, భారతజాతి నిర్మాణానికి పటేల్ చేసిన సేవలను మిగతా 2లో..

ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా తెలంగాణ

తయారీ రంగానికి ప్రాధాన్యం... 7.7 శాతం వృద్ధి

ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లు, హార్డ్ వేర్ పార్కుల బలోపేతం

మివి మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మార్కెట్ అవసరాలకు మిగతా 2లో..

‘ఢిల్లీ మార్చ్’కు అనుమతి లేదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌- మింటో రోడ్ జంక్షన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు ఇండి కూటమి తలపెట్టనున్న మార్చ్‌కు అనుమతి లేదని పోలీసులు చెప్పారు.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి తలపెట్టనున్న భారీ ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు, పౌరులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు. శనివారం తన ‘ఎక్స్’ ఖాతాలో ర్యాలీకి సంబంధించిన వివరాలను ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు మింటో రోడ్- కన్నాట్ ప్లేస్ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే మార్చ్, రామ్‌లీలా మైదానం వరకు సాగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషన్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న తీరుపైనే ఈ నిరసన చేపడుతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు ప్రజలు ఢిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.మరోవైపు, రాహుల్ గాంధీ పోస్టుపై స్పందించిన ఢిల్లీ పోలీసులు, కన్నాట్ ప్లేస్ నుంచి మార్చ్ ప్రారంభించడానికి ఎటువంటి దరఖాస్తు అందలేదని పేర్కొన్నారు. అదే సమయంలో ఎంపీలు, రాజకీయ నాయకులు తమ ప్రైవేట్ వాహనాల్లో కాన్స్టిట్యూషన్ క్లబ్‌కు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లడానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. అలాగే, గతంలో నిరసనలకు వేదికైన జంతర్ మంతర్? ఎలాంటి కార్యక్రమాలు తలపెట్టరాదని ఇదివరకే ప్రకటించారు.

యుద్ధం ముగించడంలో తొందరేంలేదు

వెలువడుతోన్న తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే వెనెజువెలా చమురు వల్ల ఎంత ఆదాయం వచ్చిందో మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇక, ఈ యుద్ధంతో ఇప్పటివరకు అమెరికాకు సుమారు 47 బిలియన్ డాలర్ల ఖర్చు అయిందని అంచనా.మరోవైపు, అమెరికాతో చర్చలను ఇరాన్ కోరుకుంటోందని ట్రంప్ అన్నారు. ఆ దేశం అంతర్గతంగా ఎదుర్కొంటున్న సమస్యలే అందుకు కారణమని పేర్కొన్నారు. సైనికులు, పోలీసులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలోకి టెహ్రాన్ వెళ్లిపోయిందన్నారు.ఇదిలా ఉండగా.. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకోసం ఒక తాత్కాలిక ముసాయిదా రూపొందించినట్లు తెలుస్తోంది. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను మూడో దేశానికి తరలించడం లేదా దాని రేడియోధార్మికతను తగ్గించడం ఆ ముసాయిదా ప్రతిపాదనల్లో ఉంది. అలాగే ఈ చర్చల్లో భాగంగా ఒప్పందం కుదిరిన ఏడురోజుల్లో హర్మూజ్ జలసంధి పూర్తిగా తెరవాలి. ఇరాన్ తన అణు కార్యక్రమాలపై, సముద్ర భద్రతపై చర్యలు తీసుకుంటే.. దానికి ప్రతిగా టెహ్రాన్‌పై విధించిన ఆంక్షలను, దిగ్బంధాలను అమెరికా సడలిస్తుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఈ ఒప్పందం అమలయ్యేందుకు చైనా ఒక హామీదారుగా ఉంటుందని తెలుస్తోంది..

నత్తలా నౌకను అతుక్కొని..ఒక్కసారిగా పేలి..

టెహ్రాన్(జనంసాక్షి): ఒమన్ తీరంలో దుబాయ్‌కు చెందిన పనామా జెండాతో ఉన్న ఎం.టి. లూయిస్ నౌక ఇంజిన్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పుడు ఆ నౌకలో 27 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. మంటల్ని అదుపులోకి తేవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఈ అగ్ని ప్రమాదానికి లింపెట్ మైన్స్ కారణమని తెలుస్తోంది.ఒక చిన్న పడవలో వచ్చిన కొందరు చమురు ట్యాంకర్ ఇంజిన్ రూమ్ దిగువభాగంలో రెండు మైన్స్‌ను అమర్చి.. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఇంజిన్ రూమ్‌లో పేలుడు సంభవించింది. ఒమన్ తీరంలో జరిగిన ఈ దాడి ఇరాన్ పనేనని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యూఎస్-ఇరాన్ యుద్ధంలో లింపెట్ మైన్స్‌ను విజయవంతంగా వాడటం ఇదే తొలిసారి అని పేర్కొన్నాయి. లింపెట్ మైన్స్ నౌకాదళం ఉపయోగించే పేలుడు పదార్థాలు. ఈ మైన్స్‌ను శక్తిమంతమైన అయస్కాంతాల సహాయంతో నేరుగా నౌకలకు అంటిస్తారు. సముద్రతీరంలో బండరాళ్లను గట్టిగా అంటిపెట్టుకొని ఉండే లింపెట్ అనే సముద్రనత్తల పేరిట వీటికి ఆ పేరు వచ్చింది. ఈ మందుపాతరలు కూడా నత్తల వలే చిన్నగా, శంఖు ఆకారంలో ఉంటాయి. ఓడలను పూర్తిగా ముంచేయడం కంటే.. వాటిని ఎటూ కదలనీయకుండా నిలిపివేయడమే ఈ మైన్స్ ముఖ్య ఉద్దేశం. ఓడ ఇంజిన్ రూమ్ వెలుపలి భాగం, స్టీరింగ్ గేర్, ప్రొపెల్లర్లు ఉండే నౌక భాగాల వద్ద అమర్చుతారు.నౌకాదళానికి చెందిన ప్రత్యేక డైవర్లు రహస్యంగా శత్రునౌకల వద్దకు ఈదుకుంటూ వెళ్లి లేదా చిన్న బోట్ల సహాయంతో అక్కడకు చేరుకొని నౌకలకు అమరుస్తారు. రిమోట్ కంట్రోల్ ద్వారా లేదా అమర్చిన వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిన తర్వాత నిర్దేశించిన సమయానికి అవి పేలేలా రూపొందిస్తారు. పశ్చిమాసియాలో 2017లో వీటిని తొలిసారి ఉపయోగించారు. తర్వాత నుంచి ట్యాంకర్లను పేల్చేందుకు వాడుతున్నారు. హర్మూజ్ జలసంధి (రాబితీజీతిబి నీట ఊనీతీఎబీళి)లో తక్కువ ఖర్చుతో ఈ సాంకేతికతను ఉపయోగించి వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

పొట్టకూటి కోసం వచ్చి... అండాల వ్యాపారానికి
బలైపోతున్న పేదింటి ఆడపిల్లలు!

ఉంది. అండాల ఉత్పత్తిని పెంచేందుకు ఇచ్చే హార్మోనల్ ఇంజెక్షన్లు, వైద్య ప్రక్రియలు నిపుణుల పర్యవేక్షణలోనే జరగాలి. నిబంధనలను ఉల్లంఘించి ఇలాంటి ప్రక్రియలు నిర్వహించారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఫెర్టిలిటీ కేంద్రాలకు లింకులున్నాయా?

సేకరించిన అండాలను నగరంలోని ప్రైవేట్ ఫెర్టిలిటీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారా? ఈ వ్యవహారం వెనుక బ్రోకర్ల నెట్‌వర్క్ ఉందా? ఎవరెవరు డబ్బులు చెల్లిస్తున్నారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో దుర్గాప్రసాద్ అనే వ్యక్తితో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హాస్టళ్లలో ఉంటున్న యువతుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

కఠిన నియంత్రణ అవసరం..

సంతాన సాఫల్య వైద్య సేవలు అనేవి శాస్త్రీయమైన, చట్టబద్ధమైన వైద్య విధానంలో జరగాల్సినవి. మహిళల అంగీకారం, ఆరోగ్య భద్రత, చట్టపరమైన నిబంధనలు తప్పనిసరి. పేదరికాన్ని ఆసరాగా చేసుకుని మహిళల శరీరాన్ని వ్యాపారానికి ఉపయోగించుకునే ప్రయత్నాలు జరిగితే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలి. గర్ల్స్ హాస్టళ్ల నిర్వహణ, వైద్య కేంద్రాల అనుమతులు, అండాల సేకరణకు సంబంధించిన ప్రక్రియలపై అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలి. ఉపాధి కోసం నగరానికి వచ్చిన యువతులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

హైదరాబాద్‌లో మహిళల అండాల విక్రయ ముఠా గుట్టురట్టు

బజార్‌కు చెందిన రేష్మా ఖతూన్ ఐవీఎఫ్ ఏజెంట్‌గా వ్యవహరించినట్లు గుర్తించామన్నారు. దళారులు వివిధ రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకువచ్చారని, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ దందాలోకి చేర్చుకున్నారని వివరించారు.బేగంపేట, సరూర్‌నగర్ పోలీసులతో పాటు మల్కాజిగిరి ప్రత్యేక కార్యాచరణ బృందాలు ప్రకాశ్‌నగర్, బేగంపేట, ఎర్రగడ్డ, సరూర్‌నగర్, గోపాలపురం ప్రాంతాల్లో సంయుక్తంగా సోదాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 48 మంది మహిళలను గుర్తించి కాపాడినట్లు సీపీ తెలిపారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.హైదరాబాద్‌లో మహిళల అండాలను అక్రమంగా సేకరించి వాణిజ్య అవసరాల కోసం విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. నిందితులు మధ్యవర్తుల ద్వారా ఐవీఎఫ్ కేంద్రాలను సంప్రదించి, అండాల సేకరణకు ఒక్కో మహిళకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లిస్తామని ఆశ చూపినట్లు తెలిపారు. మహిళలకు హార్మోన్ ఇంజెక్షన్లు, మందులు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైందన్నారు. సంతాన సాఫల్య కేంద్రాలకు తీసుకెళ్లి పది రోజులపాటు అక్కడ ఉంచినట్లు పేర్కొన్నారు. ఐవీఎఫ్ కేంద్రాల నుంచి ఒక్కో అండానికి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు గుర్తించామన్నారు.ఈ వ్యవహారంలో వైద్యుల పర్యవేక్షణ, జీవ వైద్య వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించామని సీపీ తెలిపారు. మహిళలకు సంబంధించిన ఆధార్ కార్డులు, అఫిడవిట్లు సహా పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీలు, ఏజెంట్ల నెట్‌వర్క్, ఐవీఎఫ్ కేంద్రాలు, సహాయక పునరుత్పత్తి సాంకేతికత (ఏఆర్‌టీ) బ్యాంకులతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. మహిళలను బలవంతం చేశారా? మోసం చేశారా? అక్రమ రవాణా జరిగిందా? అనే కోణాల్లోనూ విచారణ కొనసాగుతోందని సీపీ సుమతి వివరించారు.

జాతీయ సమైక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలి

హైదరాబాద్(జనంసాక్షి):సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) కార్యక్రమాన్ని శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ (పిఅ ఎల్) గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. మల్టీ జోన్-ఎ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ (పిఅఎల్) గజరావు భూపాల్, మల్టీ జోన్-ఎ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తో పాటుగా ఏఐజీ (అడ్మిన్) అన్యోన్య, పలువురు పోలీసు అధికారులు, సీఏవోలు, ఏవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రాప్ హాలీడే మేం ప్రకటించలేదు

నమ్మొద్దని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న విపత్తు అని పేర్కొన్నారు. ఎల్‌నినో దృష్ట్యా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. ఆరు నెలలుగా ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని.. వారు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని చెప్పారు.

ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా తెలంగాణ

అనుగుణంగా, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకునేలా టెక్నాలజీ, ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలను అనుసంధానిస్తూ కాంప్రహెన్సివ్ ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్ ను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈ-సిటీలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మివి నూతన మ్యాను ఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో తయారీ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. 2025?26లో రాష్ట్ర తయారీ రంగం 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపు(జీఎస్ వీఏ)లో తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరిందన్నారు. తెలంగాణ రైజింగ్?2047 విజన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్ వేర్ పార్కులను మరింత బలోపేతం చేసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నామ న్నారు. చిప్ డిజైన్, సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలోనూ తెలంగాణను ముందంజలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. రీసెర్చ్, ప్రొడక్ట్ డిజైన్ నుంచి విడి భాగాలు, ఎండ్ ప్రొడక్ట్స్ తయారీ వరకు అన్ని కార్యకలాపాలు రాష్ట్రంలోనే జరిగేలా కంపెనీలను ప్రోత్సహిస్తున్నామ న్నారు. స్థానిక పరిశ్రమలను గ్లోబల్ సప్లై చైన్ తో అనుసంధానించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మివి సంస్థ ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు తదితర ఆడియో ఉత్పత్తులను తయారు చేస్తోందని వివరించారు. తాజాగా మివి వన్ 5జీ స్మార్ట్ ఫోన్‌తో మొబైల్ తయారీ రంగంలోకి కూడా అడుగు పెట్టిందన్నారు. టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ శాఖ సంయుక్త కార్య దర్శి అనుదీప్ దురిశెట్టి, మివి ప్రతినిధులు విశ్వనాథ్ కందుల, మిధుల దేవభక్తుని తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్‌పై అవిశ్వాస తీర్మానం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ‘బహిరంగ ప్రజా అభిశంసన’ తీర్మానం ప్రవేశపెట్టింది. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, సీఈసీ కుమార్‌పై ‘ఆరోపణలను’ సభలో చదివి వినిపించారు.జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని ఖర్గే ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేసి ఆయనను ఆ పదవిలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీఈసీని తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపాదనలు ప్రవేశపెట్టారని, కానీ తమ నోటీసులను స్వీకరించలేదని ఖర్గే చెప్పారు. అందువల్లే ఈ సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.’రాజ్యాంగబద్ధ సంస్థ గౌరవాన్ని కాపాడటానికే ఈరోజు ఈ ప్రతిపాదనను తీసుకువచ్చాం. సీఈసీపై మాకు ఎలాంటి వ్యక్తిగత విద్వేషం లేదు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. 2014 నుంచి అధికారంలో కొనసాగేందుకు మోదీ ప్రభుత్వం అన్ని కుట్రలు చేస్తోంది. 2023 చట్టం కల్పిస్తున్న రక్షణ కారణంగానే సీఈసీ ఓటు చోరీకి పాల్పడుతున్నారు. సర్ ప్రక్రియ ద్వారా దేశంలో ఉద్దేశపూర్వకంగానే 14 కోట్ల మంది ఓట్లను తొలగించారు. ఈ చట్టం ఆయనకు అన్ని విధాల చర్యల నుంచి రక్షణ కల్పిస్తోంది. 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేసి, వారిని సభా కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధించిన తర్వాత ఈ చట్టాన్ని ఆమోదించారు. అందుకే దీన్ని వెంటనే రద్దు చేయాలి. సర్ ప్రక్రియను నిలిపివేసి అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి. దేశంలో ఎన్నికలు ఏవైనా సరే వాటిని బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి. ఇవే ఇండీ కూటమి ప్రధాన డిమాండ్లు’ అని ఖర్గే అన్నారు. ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించి యువతకు, దేశ భవిష్యత్తును నిర్ణయించే హక్కును మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఇచ్చారని, కానీ ఆ హక్కును మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఆ హక్కును లాక్కుంటుందని ఆరోపించారు. రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేని రక్షణను 2023 చట్టం సీఈసీకి ఇస్తుందని అన్నారు. తాము చొరబాటుదారుల కోసం ఓటు హక్కులను కోరడం లేదని, కానీ భారత పౌరులందరి ఓటు హక్కును రక్షించాలని అన్నారు. కాగా, అంతకుముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఖర్గే నివాళులర్పించారు.

మియాపూర్ భూముల్ని కాపాడింది మేమే..

కాపీ కూడా ఇంకా రాకముందే ఆ భూములను అమ్ముకోవాలనే ఆతృత సీఎంలో కనిపించిందని ఆరోపించారు.కేసీఆర్ సీఎం అయ్యాక వైద్యనాథన్ అనే సీనియర్ అడ్వకేట్‌ను నియమించి భూములు ప్రభుత్వానికి దక్కేలా న్యాయపోరాటం చేసి కాపాడారని గుర్తు చేశారు. మంచిరేవులలో 142 ఎకరాలు కాపాడామని గొప్పలు చెప్పుకుంటే కాంగ్రెస్ ఆ భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ప్రయత్నించిందని పేర్కొన్నారు. మంచిరేవుల్లోని 10 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. భూపాలపల్లి భూములు, హయాత్‌నగర్‌లోని భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ అన్నిరకాలుగా కాపాడిందని ఆరోపించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లను రేవంత్ రెడ్డి అప్పుగా తెచ్చుకున్నారని వెల్లడించారు.

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర అభ్యంతరాలకు పరిష్కారం చూపండి

ప్రభావితమయ్యే భూముల విస్తీర్ణాన్ని సమగ్రంగా అంచనా వేయాలని స్పష్టం చేశారు.వాస్తవంగా ఎంత మేర ముంపు ఏర్పడుతుందో నిర్ధారించేందుకు వివరమైన పటాలు సిద్ధం చేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నదీగర్భ ప్రాంతాలు, అటవీ భూములు, పర్యావరణ సున్నిత మండలాలు, సంరక్షిత కోర్ ప్రాంతాలు, రెవెన్యూ భూములు, జనావాసాలను పటాల్లో స్పష్టంగా గుర్తించాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా మహారాష్ట్ర ఆందోళనలను పరిష్కరించే మార్గాలను పరిశీలించాలని పేర్కొన్నారు.నీటి నిల్వను, వినియోగాన్ని మెరుగుపరిచేందుకు తుమ్మిడిహట్టి బ్యారేజీ పూర్తిస్థాయి జలాశయ నీటిమట్టాన్ని 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. అక్టోబర్ 26న ముంబయిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో జరిపిన సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించిన విషయం విదితమే.సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో కూడిన సమగ్ర వ్యవస్థ ద్వారా 77 టీఎంసీల నీటిని మళ్లించి, ఏడు జిల్లాల పరిధిలోని 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రస్తుతం ప్రతిపాదిత 148 మీటర్ల నీటిమట్టం వద్ద నిల్వ సామర్థ్యం 2.182 టీఎంసీలు కాగా, 152 మీటర్లకు పెంచితే అది 5.697 టీఎంసీలకు చేరుతుంది. తద్వారా నీటి నిల్వ సామర్థ్యం రెట్టింపునకు మించి పెరుగుతుంది.ప్రతిపాదిత 152 మీటర్ల నీటిమట్టం వద్ద కూడా ముంపు పరిమితంగానే ఉంటుందని ప్రాజెక్టు అంచనాలు సూచిస్తున్నాయి. తెలంగాణ, మహారాష్ట్రల్లో పునరావాసం, పునఃస్థాపనకు సంబంధించిన అవసరాలను పరిష్కరించవచ్చని ఈ అంచనాలు పేర్కొంటున్నాయి.సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

మావోయిస్టులను నిర్మూలించి ఆదివాసీ ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరించాం

కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని తన సందేశంలో పేర్కొన్నారు.పటేల్‌కు నివాళులు అర్పించిన తర్వాత ఏక్తానగర్‌లో నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాయుధ దళాల పరేడ్ అట్టహాసంగా జరిగింది. దాదాపు 10 వేల మంది పోలీస్, పారామిలటరీ దళాలు ఈ కార్యక్రమంలో కవాతు నిర్వహించాయి. వాయుసేన నిర్వహించిన అద్భుతమైన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్ సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు, మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 4, 700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి.

ఇస్రోకు మరో ‘ఘన’ విజయం

నిర్ణీత సమయం రాత్రి 11.51 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. దాదాపు 24 గంటల కౌంట్‌డౌన్ అనంతరం ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. సుమారు 50 మీటర్ల ఎత్తున్న ఈ రాకెట్, దాదాపు 18 నిమిషాల ప్రయాణం తర్వాత తనలోని ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. రాకెట్‌లోని మూడు దశలూ నిర్దేశించిన విధంగా పనిచేశాయి. ముఖ్యంగా అత్యంత సంక్లిష్టమైన క్రయోజెనిక్ పైదశ కూడా విజయవంతంగా పనిచేయడంతో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి చేర్చడం సాధ్యమైంది.

నాలుగు ఉపగ్రహాలతో మళ్లీ నావిక్ సేవలు

భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్‌కు ఈ ప్రయోగం ఎంతో కీలకం. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలో పనిచేసే ఈ వ్యవస్థ, భారత్‌తో పాటు దేశ సరిహద్దుల నుంచి సుమారు 1,500 కిలోమీటర్ల పరిధి వరకు నావిగేషన్ సేవలను అందించగలదు. ఇప్పటికే కక్ష్యలో పనిచేస్తున్న మూడు ఉపగ్రహాలకు ఎన్‌వీఎస్-03 తోడవడంతో మొత్తం నాలుగు ఉపగ్రహాలతో నావిక్ వ్యవస్థ సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఎన్‌వీఎస్-03 ఉపగ్రహంలో స్వదేశీ రుబీడియం అణు గడియారాన్ని అమర్చారు. ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థలో కచ్చితమైన సమయ నిర్ధారణ అత్యంత కీలకం. ఈ ఉపగ్రహంలో స్వదేశీ సాంకేతికతతో పాటు విదేశాల నుంచి సేకరించిన అణు గడియారాలనూ వినియోగించారు. ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్లలో సంకేతాలను ప్రసారం చేసే సామర్థ్యం దీనికి ఉంది. 2,232 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం ప్రస్తుతం నిర్దేశిత ప్రవేశ కక్ష్యలోకి చేరింది.

రైళ్లు, వాహనాలు, నౌకల ట్రాకింగ్‌కు ఉపయోగం

ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం అందుబాటులోకి రావడంతో నావిక్ సేవలు మరింత బలోపేతం కానున్నాయి. రైళ్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, రహదారులపై ప్రయాణించే వాహనాల స్థానాన్ని గుర్తించడం, సముద్రంలో ప్రయాణించే నౌకల కదలికలను ట్రాక్ చేయడం వంటి అనేక పౌర అవసరాలకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. రవాణా రంగంతో పాటు భద్రత, విపత్తుల నిర్వహణ, ఇతర కీలక రంగాల్లోనూ ఉపగ్రహ నావిగేషన్ సేవలకు ప్రాధాన్యం ఉంది. విదేశీ నావిగేషన్ వ్యవస్థలపై ఆధారపడకుండా దేశీయంగా అభివృద్ధి చేసుకున్న సాంకేతికతను వినియోగించుకోవడం వ్యూహాత్మకంగా భారత్‌కు ప్రయోజనం చేకూర్చనుంది. అలాగే దేశవ్యాప్తంగా ప్రామాణిక సమయాన్ని అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ ‘ఒకే దేశం ఒకే సమయం’ ప్రాజెక్టులోనూ నావిక్ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది. భారత ప్రామాణిక కాలమానంను మరింత కచ్చితత్వంతో అందించేందుకు అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ఈ ఉపగ్రహాలు దోహదపడతాయి.

తరగతి గదిలో ఉన్మాది వీరంగం

తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. అప్రమత్తమైన సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రాణాపాయంలో ఉన్న బాలికను చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో పాఠశాలలో భయాందోళనలు నెలకొన్నాయి.

చంద్రబాబు తీవ్ర ఆవేదన

రాప్తాడు ఘటనపై ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితిపై ఆరా తీశారు. ఆమెకు అందుతున్న చికిత్స గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. చిన్నారి చెల్లిని తరగతి గదిలో రక్తపుమడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదన్నారు. ఉన్మాదులను ఉక్కు పాదంతో అణచివేస్తామన్నారు. ఆడపిల్లలు, మహిళలవైపు కన్నెత్తి చూడాలంటే భయపడేలా చేస్తామని, పిల్లల భద్రతకు విఘాతం కలిగిస్తే.. ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇలాంటి ఘటనలకు సమాజంలో చోటు లేదు: పవన్ కల్యాణ్

రాప్తాడు ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అమానవీయ ఘటనలకు సమాజంలో చోటు లేదన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలితోపాటు గాయపడిన మరో విద్యార్థిని కూడా మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. విద్యార్థిని కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. నిందితుడిని తక్షణం అరెస్టు చేసి, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని పోలీసుశాఖకు దిశానిర్దేశం చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన ఎమ్మెల్యే సునీత

బాధిత బాలికకు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహిస్తున్నారు. ఆస్పత్రికి చేరుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత వైద్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు. బాధిత కుటుంబాన్ని సీఎం పరామర్శించి.. భరోసా ఇచ్చారు.

స్పందించిన ఏపీ మహిళా కమిషన్..

రాప్తాడు ఘటనను ఏపీ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి ఘటనపై మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ స్పందించారు. దాడిని అడ్డుకునే క్రమంలో గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపైనా ఆరా తీశారు. విద్యార్థినులిద్దరికీ అందుతున్న వైద్యంపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

రాప్తాడు ఘటన.. పోలీసుల అదుపులో నిందితుడు!

రాప్తాడు(జనంసాక్షి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాప్తాడు ఘటనలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘటన అనంతరం ధర్మవరం వైపు పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. నిందితుడిని ధర్మవరం మండలానికి చెందిన యువకుడిగా గుర్తించారు. అతడు బాలికకు సమీప బంధువు అవుతాడని స్థానికులు చెబుతున్నారు.మరోవైపు దాడి జరిగిన తరగతి గదిని ఫోరెన్సిక్ బృందం పరిశీలించింది. ఘటనాస్థలిలో దాడికి ఉపయోగించిన రంపం మెషీన్‌ను స్వాధీనం చేసుకుంది. అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై ఉన్మాది రంపంతో దారుణంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ బాలిక అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

చనిపోయిన వారి ఓట్లు తొలగిస్తే దుష్ప్రచారామా?

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): దేశంలో 13కోట్ల మంది ఓట్లను తొలగించారని చెబుతున్న కాంగ్రెస్.. వాస్తవాలు ఎందుకు చెప్పడంలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. అందులో 2.8 కోట్ల మంది ఓటర్లు చనిపోయారు, వాటిని తొలగించాలా?వద్దా? అని ప్రశ్నించారు. దేశంలో 6.30 కోట్ల ఓటర్లు శాశ్వతంగా వలస వెళ్లారని, ఎక్కడున్నారో తెలియదని.. వాళ్లకు ఎన్నికల సంఘం నోటీసులిచ్చినా స్పందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే 6.30 కోట్ల ఓటర్ల ఆచూకీ కనిపెట్టి ఆధారాలు సమర్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన వాళ్లను, దొంగ ఓట్లను, ఆచూకీ లేని వలస ఓట్లను ఓటర్ జాబితాలో చేర్చాలని కాంగ్రెస్ ధర్నాలు చేస్తోందా? అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. పాతబస్తీ, మహేశ్వరం నియోజకవర్గాల్లో 2014కు ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ సహా విదేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వేల మంది ఓట్లున్నాయని, వాటిని తొలగించాలా? వద్దా? ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 2004లో చనిపోతే ఆయన ఓటు ఇంకా ఉందని, ఆ ఓటును తొలగించాలా వద్దా అని మరో కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఓడిపోతే ఈవీఎంలపైనా విష ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని దుయ్యబట్టారు.

తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో రేపటి నుంచి 4వ తేదీ వరకు వర్షాలు కురవనున్నట్లు చెప్పింది. ఇవాళ సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్‌తోపాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. నవంబర్ 2, 3 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది.

గురుకులం విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫినాయిల్ సేవించి అస్వస్థత
- ఉపాధ్యాయురాలు మందలించడంతో ఘటన
- ఆస్పత్రికి తరలింపు...

నారాయణఖేడ్: అక్టోబర్ 31 (జనం సాక్షి) : హిందీ ఉపాధ్యాయురాలు దండించడంతో విద్యార్థి ఫినాయిల్ సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన ఖేడ్ మండలం జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు.. పెద్దశంకరం పేటకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంను ఖేడ్ పట్టణ శివారులో నిర్వహిస్తున్నరు. ఇందులో పదవ తరగతి చదువుతున్న హర్షిత్ గౌడ్, తండ్రి లాలా గౌడ్ కామారెడ్డి జిల్లా వర్ని మండలం సంగోజిపేట గ్రామానికి చెందిన హర్షత్ గౌడ్ తండ్రి లాలగౌడ్ అనే విద్యార్థి ఐదవ తరగతిలో మహాత్మా జ్యోతిరావు పూలే లో అడ్మిషన్ తీసుకున్నారు. మొబైల్ ఫోన్ పాఠశాలకు తీసుకు రావడంతో గమనించి హిందీ ఉపాధ్యాయురాలు సంగీత సదరు విద్యార్థిని దండించింది. ఫోన్ లాక్కొని పాఠశాలలో డిపాజిట్ చేసింది. విషయం కుటుంబీకులు చెబుతానని హెచ్చరించడంతో ఆందోళనకు గురైన విద్యార్థి శుక్రవారం సాయంత్రం మరుగుదొడ్డిలో ఉన్న ఫినాయిల్ సేవించి అస్వస్థతకు గురయ్యాడు. విషయం గమనించిన విద్యార్థులు ప్రిన్సిపాల్, అధ్యాపకులు సమాచారం అందించంతో హుటాహుటిన ఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ రాజేశం గురుకులాన్ని సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థి పరిస్థితి గూర్చి అడిగి తెలుసుకున్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ప్రిన్సిపాల్ ప్రతిభ మాట్లాడుతూ విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయురాలు మందలించిన విషయం తెలీదని పేర్కొన్నారు. హిందీ ఉపాధ్యాయురాలు సంగీత గతంలో వార్డెన్ గా పనిచేసే అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఉపాధ్యాయురాలు విద్యార్థులతో పాటు తోటి ఉపాధ్యాయురాలను ప్రిన్సిపాల్‌ను కూడా లెక్కచేయడం లేదని స్థానికులు తెలిపారు. విద్యార్థికి ఏ విధంగా మందలించారో తెలియదు. మందలిస్తే విద్యార్థి ఫినాయిల్ తాగే వాడు కాదని స్థానికులు వాపోయారు. గతంలో కూడా విద్యార్థులను బెదిరించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ఉపాధ్యాయురాలు తన ప్రవర్తన మార్చుకుంటే విద్యార్థులు చదువుకునే పరిస్థితి ఉందని స్థానికులు వాపోయారు. పలువురు సంఘ నాయకులు చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ తో మాట్లాడి గురుకులాల్లో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు.

ములుగు మున్సిపాలిటీలో పన్నుల మోత

- ఆందోళనలో వ్యాపారులు..
- అఖిలపక్షం ఆధ్వర్యంలో కమిషనర్ కార్యాలయం ముట్టడి

ములుగు ప్రతినిధి, అక్టోబర్ 31(జనంసాక్షి) : ములుగు మున్సిపాలిటీ పరిధిలో అడ్డగోలుగా పన్నులు పెంచడంతో సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ అఖిల పక్షం ఆధ్వర్యంలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శనివారం ప్రజలు, వ్యాపారులు కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు.

భువన సర్వే పేరుతో దోపిడీ

అధికారులు భువన సర్వే పేరుతో ఇష్టారీతిగా సర్వే చేసి పన్నులు విధిస్తున్నారని ఆరోపించారు. స్క్వేర్ ఫీట్ కు 20 పైసల నుంచి 1.75% కి పెంచామని కాగితాల్లో చూపుతూ, వాస్తవంలో వందల్లో ఉన్న పన్నులను వేలల్లోకి, వేలల్లో ఉన్నవాటిని లక్షల్లోకి పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. రూ 500 - 1000 కట్టే సాధారణ ఇళ్లకు రూ 10 వేల నుంచి రూ 30 వేల వరకు పన్ను వేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. అలాగే రూ 10 వేలు ఉన్న సాధన, మిరాకిల్, సన్ రైజర్స్, అరవింద స్కూళ్లకు రూ.4 లక్షల నుంచి రూ 8 లక్షల వరకు, గతంలో రూ 50 వేలు ఉన్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ కు ఏకంగా రూ.10 లక్షలకు పైగా పన్ను వేయడంతో చిన్న వ్యాపారాలు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కమిషనర్ పరార్.. ప్రజల ఆగ్రహం

ఆందోళన సమయానికి కమిషనర్ కార్యాలయంలో లేకపోవడంతో ప్రజలు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టీపీఓ కిరణ్, మేనేజర్ రాజేందర్ లను నిలదీసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం కమిషనర్ తో మాట్లాడి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా వెనుదిరిగారు. రూ 100 పన్నును రూ150 చేస్తే భరిస్తామని, కానీ రూ 100 ఉన్నదాన్ని రూ 1000 చేయడం దోపిడీయేనని, ఇలాంటి అక్రమ పన్నులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పన్నుల పెంపుతో నష్టపోతున్న నూతన గృహ నిర్మాణదారులు, చిన్నా, పెద్ద వ్యాపారస్తులు, మున్సిపల్ వేసే ఇంటి పన్నుల బాధితులందరూ సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు మున్సిపాలిటీ కమిషనర్ తో జరిగే సమావేశానికి తరలిరావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.

భూములమ్మి రాష్ట్రాన్ని నడుపుతారా?

- సీఎం రేవంత్ రెడ్డిపై డీకే అరుణ

హైదరాబాద్ (జనంసాక్షి) : భూములు అమ్మి రాష్ట్రాన్ని నడుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం ఆయన చేతకానితనానికి నిదర్శనమని బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. ఢిల్లీకి మూటలు పంపడం ఆపేస్తే రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు సరిపోతాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ.. ఓటు చోరీ పేరుతో తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

ఓటు చోరీ జరిగి ఉంటే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేదని డీకే అరుణ అన్నారు. డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించకూడదా? అని ప్రశ్నించారు. దేశంలో అరాచకం సృష్టించేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశ విచ్ఛిన్నకర శక్తులు యువతను రెచ్చగొడుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొడంగల్ నియోజకవర్గంతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లా మొత్తాన్ని అభివృద్ధి చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. స్థానికుడు కాకపోయినా రేవంత్ రెడ్డిని కొడంగల్ ప్రజలు గెలిపించారని గుర్తుచేశారు. అయితే నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ పేరుతో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటివరకు పరిహారం అందలేదని విమర్శించారు. బాధితులకు వెంటనే పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. గత రెండేళ్లలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు కేటాయించినట్లు ఎంపీ వివరించారు. అమృత్ పథకం కింద రూ.2.22 కోట్లు, ఎంపీ నిధుల నుంచి రూ.1.45 కోట్లతో రోడ్లు, కమ్యూనిటీ హాల్, హైమాస్ట్ లైట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద రూ.79.50 లక్షలు, ఉపాధి హామీ పథకం కింద రూ.69.75 లక్షలు, వీబీ-జీ రామ్ జీ కింద రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని డీకే అరుణ కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నీటి అప్రోచ్‌ను నార్లాపూర్‌కు మార్చడం ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాంతానికి అన్యాయం చేసిందని ఆరోపించారు. మొదటి డీపీఆర్‌లో పేర్కొన్న జూరాల నీటి అప్రోచ్‌తోనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును ఆలస్యం చేయకుండా పూర్తి చేసి ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు అందించాలని కోరారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే పాలమూరు జిల్లాకు అన్యాయం చేసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి చరిత్రలో మిగిలిపోతారని వ్యాఖ్యానించారు.

సింగరేణిలో అడ్డగోలుగా అక్రమాల పర్వం?

- కార్యక్రమాల నిర్వహణలో అంచనాలకు మించి ఖర్చులు..
- పనుల కేటాయింపుల్లో పైరవీల రాజ్యం..
- పనుల పేరిట కమీషన్ల దందా..?
- తెరవెనుక అవినీతి మంత్రం..
- తెర ముందు అమాయక నటన..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): బొగ్గు ఉత్పత్తితో దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థలో అక్రమాలు, అవినీతి ఆరోపణలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, సామాజిక బాధ్యత పేరుతో చేపడుతున్న కార్యక్రమాలు, పనుల నిర్వహణలో అసలు ఖర్చులకు, లెక్కల్లో చూపిస్తున్న ఖర్చులకు పొంతన ఉంటోందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా అంచనాలకు మించి ఖర్చులు చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, పనుల కేటాయింపుల్లోనూ పారదర్శకత కరువైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సింగరేణి పరిధిలో అధికారికంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలు, సమావేశాలు, వేడుకలు, ఇతర కార్యక్రమాల కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా తక్కువ వ్యయంతో పూర్తయ్యే కార్యక్రమాలకు సైతం భారీ అంచనాలు రూపొందించడం, ఖర్చుల పేరుతో అదనపు బిల్లులు సమర్పించడం వెనుక అసలు కథ ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతి కార్యక్రమానికి సంబంధించిన బడ్జెట్, ఖర్చుల వివరాలు బహిర్గతం చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. సింగరేణిలో వివిధ పనులు, ఉద్యోగాలు దక్కించుకోవాలంటే నిబంధనలు, నాణ్యత, అర్హతలకంటే పైరవీలకే ప్రాధాన్యత లభిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హత కలిగిన వారికి కాకుండా పలుకుబడి ఉన్నవారికే పనులు దక్కుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనుల కేటాయింపులు, వర్క్ ఆర్డర్ల జారీలో పారదర్శకత ఎంతవరకు పాటిస్తున్నారో ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

పనుల మంజూరు నుంచి బిల్లుల చెల్లింపుల వరకు ఎక్కడెక్కడ ఎలాంటి వ్యవహారాలు సాగుతున్నాయనే అంశంపై అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పనులు, పదవులు దక్కించుకోవడానికి కమీషన్లు చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలు చర్చకు వస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? తెరవెనుక ఎవరెవరి పాత్ర ఉంది? అన్నది సమగ్ర విచారణతోనే తేలాల్సి ఉంది. బయటకు మాత్రం నిబంధనలు, పారదర్శకత, సంస్థ ప్రయోజనాల గురించి మాట్లాడుతున్న కొందరు.. తెరవెనుక మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు తమకేమీ తెలియనట్లు వ్యవహరించడం, అంతర్గతంగా జరిగే వ్యవహారాలపై మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. సంస్థ నిధులు ప్రజాధనంతో సమానమైన బాధ్యతతో వినియోగించాల్సి ఉండగా, వాటి వినియోగంపై పర్యవేక్షణ ఎంతవరకు జరుగుతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్న ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గత కొంతకాలంగా నిర్వహించిన కార్యక్రమాల ఖర్చులు, కేటాయించిన పనులు, టెండర్ల వివరాలు, చేసిన చెల్లింపులు, బిల్లుల ఆడిట్, క్వార్టర్ల కేటాయింపు, ఉద్యోగ నియామకాలు, పరిహారం చెల్లింపులు తదితర విషయాలపై సమగ్ర పరిశీలన జరిపితే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. అవసరమైతే విజిలెన్స్ విచారణ చేపట్టి బాధ్యులెవరైనా ఉంటే చర్యలు తీసుకోవాలి. కార్మికుల కష్టంతో నడుస్తున్న సింగరేణి సంస్థలో అవినీతికి, అక్రమాలకు తావులేకుండా పారదర్శక పాలన అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది. అసలు ప్రశ్న ఒక్కటే.. సింగరేణి నిధులు సంస్థ అభివృద్ధికి ఖర్చవుతున్నాయా? లేక కొందరి జేబులు నింపుతున్నాయా?

నవంబర్ 3న నిర్మల్‌లో బీజేపీ మహా పాదయాత్ర..

- ఉన్నతాధికారులతో ఏర్పాట్ల స్థల పరిశీలన
- బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 31,(జనంసాక్షి) : ఎస్ఐఆర్ పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా నవంబర్ 3న నిర్మల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ గారు హాజరుకానున్న నేపథ్యంలో, హెలిప్యాడ్ ఏర్పాట్ల కోసం బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇతర సౌకర్యాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, తక్కల రమణారెడ్డి, జమాల్, మార గంగారెడ్డి, సాదం అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, కరీపే విలాస్, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, జింక సురేందర్, సూరజ్ నాయక్, బీజేపీ నాయకులు కందుల హరీష్, భరత్, వెంకటేష్, ప్రమోద్, ఉదయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు యువతి ధర్నా

పాలకుర్తి, అక్టోబరు 31(జనంసాక్షి) ప్రేమించి పెళ్లి చేసుకొని తనను ఇంటికి తీసుకువెళ్లడం లేదంటూ యువతి ప్రియుడి ఇంటి ముందు ధర్నా చేసిన ఘటన శనివారం మండలంలోని శాతాపురంలో చోటు చేసుకుంది. బాదితురాలి వివరాల మేరకు.. మండలంలోని శాతాపురం గ్రామానికి చెందిన గిద్దెల దివ్య పాలకుర్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేసే క్రమంలో అదే గ్రామానికి చెందిన గన్న అరవింద్ అనే యువకుడు కాపు సామాజిక వర్గానికి చెందిన వాడని, ప్రేమ పేరుతో యువతికి దగ్గరయ్యాడు. వీరిద్దరివి వేర్వేరు కులాలు, తదనంతరం జనగామలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నూ ఆ యువతి పని చేసింది. ప్రేమ వ్యవహారం గ్రామంలో తెలుస్తుందనే ఉద్దేశ్యంతో యువకుడు సదరు యువతితో హైదరాబాద్ కు మకాం మార్చాడు. యువతిని ప్రేమ పేరుతో లొంగదీసుకొని గుట్టుచప్పుడు కాకుండా వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం దివ్యకు ఐదు నెలల గర్భవతి, తాజాగా దసరా పండుగకు ఇద్దరు కలిసి శాతాపురం గ్రామానికి వచ్చారు. తదనంతరం మనసు మార్చుకున్న ఆ యువకుడు యువతిని గ్రామంలోనే వదిలేసి చెప్పా పెట్టకుండా హైదరాబాద్ కు వెళ్లిపోయాడు. అందోళన చెందిన యువతి ప్రియుడికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. తనను వదిలించుకోవడానికి తనతో మాట్లాడడం లేదని గ్రహించిన భాదితురాలు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం యువకుడి ఇంటి ముందు బైఠాయించింది. తనను అత్తగారింటికి తీసుకెళ్లే వరకు తనతో పాటు కలిసి ఉండే వరకు దర్నా విరమించేది లేదని భీష్మించుకు కూర్చుంది. దీంతో శాతాపురంలో యువకుడు ఇంటి పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. తాను దళిత సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని కావడంతో ఆ యవకుడు తనని తిరస్కరిస్తున్నాడని. దీనితో వారి కుటుంబ సభ్యుల ఒత్తిడి ఉందని తెలిపారు. తనను యువకుడితో కలిసి జీవనం సాగించేలా చూడాలని, తన కడుపులో ఉన్న బిడ్డను కాపాడాలని, యువతి కోరింది. ఎంతకి ధర్నా విరమించకపోవడంతో ఎస్సై సృజన్ కుమార్ రంగంలోకి దిగి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించిది.

పారిశ్రామిక ప్రగతి.. నైపుణ్య యువతే కీలకం

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- రూ.4 వేల కోట్లతో 65 ఐటీఐలు ఏటీసీలుగా మార్పు
- వచ్చే ఏడాది మరో 54 ప్రారంభం
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ.. ఉపాధి కల్పనపై దృష్టి

హైదరాబాద్ (జనంసాక్షి) : దేశ ఆర్థిక ప్రగతికి పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు కీలకమని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. శనివారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశం ఏటా 8 శాతం స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధిస్తేనే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని పేర్కొన్నారు. ఇందుకు పరిశోధన, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణతో ఉద్యోగ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం దాదాపు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పించామని, వచ్చే ఏడాది మరో 54 కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, వారి అవసరాలకు అనుగుణంగా కోర్సులు, పాఠ్యప్రణాళిక రూపొం దిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సంస్థలు, పరిశ్రమల మధ్య నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతోందని, ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకునేలా యువతకు సాంకేతిక నైపుణ్యాలతోపాటు స్థానిక భాష, పని సంస్కృతి, క్రమశిక్షణపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. విదేశీ ఉద్యోగాల ద్వారా లభించే ఆదాయం, స్వదేశానికి పంపే నగదు దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదపడతాయని వివరించారు. ఆర్థిక వృద్ధి అంటే కేవలం జీడీపీ పెరగడం మాత్రమే కాదని, ప్రజల ఆదాయాలు, ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వానికి మరిన్ని నిధులు అందుబాటులోకి రావడమని మంత్రి పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా మానవ వనరుల అభివృద్ధికి సేవలందిస్తున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థను అభినందించారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కమలాపూర్ అక్టోబర్ 31(జనం సాక్షి) : కమలాపూర్ మండలం అంబాల గ్రామ శివారులోని వాగు వద్ద గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో కమలాపూర్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అంబాల గ్రామానికి కూకట్ల అజయ్,గూడూరు గ్రామానికి చెందిన పాక రాజు అను ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తూ దొరకడంతో వారిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు గంజాయి ఎక్కడి నుండి తీసుకువచ్చారు,దాని సరఫరా వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నవీన్ తెలిపారు. యువత గంజాయి,ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు అక్రమ విక్రయాలు, సరఫరా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత కాపాడుకునే ప్రయత్నం లో సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి మత్తులో యువత ఏం చేస్తున్నారో వారికే అర్థం కాని పరిస్థితి లో ఉంటున్నారని,ఈ దేశానికి యువకులే భవిష్యత్తు పునాదులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు నుంచి వెంబడించి మరీ దోపిడీ..

రూ.1.70 లక్షలతో ఉడాయించిన దుండగులు!

గద్వాల (జనంసాక్షి) : బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకుని నగదు డ్రా చేసిన తండ్రీకొడుకులను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లక్ష్యంగా చేసుకున్నారు. మాటల్లో పెట్టి దృష్టి మళ్లించి రూ.1.70 లక్షల నగదును చాకచక్యంగా అపహరించారు. గద్వాల కొత్త బస్టాండ్ వద్ద జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితుల వివరాల ప్రకారం.. రాముడు, ఆయన కుమారుడు వెంకటేష్ శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో గద్వాల గాంధీ చౌక్‌లోని యూనియన్ బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రూ.1.70 లక్షల నగదును డ్రా చేసి బైక్‌పై బయలుదేరారు. అయితే అప్పటికే బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు బ్యాంకు నుంచే వారిని వెంబడించినట్లు బాధితులు అనుమానిస్తున్నారు. రాజీవ్ మార్గ్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలోనూ వారు తమను అనుసరించినట్లు తెలిపారు.

చివరకు కొత్త బస్టాండ్ ముందు తండ్రీకొడుకులు బైక్ ఆపారు. అదే సమయంలో ఓ వ్యక్తి రాముడి వద్దకు వచ్చి కళ్యాణ మండపం ఎక్కడుందని అడుగుతూ మాటల్లో పెట్టాడు. మరోవైపు వెంకటేష్ కరెంట్ వైర్ కోసం వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన నిందితులు బైక్‌పై ఉంచిన రూ.1.70 లక్షల నగదు కవర్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. తిరిగి వచ్చి చూడగా నగదు కనిపించకపోవడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
1 నవంబర్ 2026

సంపాదకీయం

జనంసాక్షి

రక్షకుడే రాక్షసుడైతే?

"పోలీసులు ప్రజాసేవకులు" అని ఎంత గొంతు చించుకున్నా జనం నమ్మకపోవడానికి సినిమాలు కారణం కాదు. గోవాలో బయటపడిన ఈ ఘటనలాంటివే కారణం. సైబర్ మోసానికి గురైన 16 ఏళ్ల బాలిక న్యాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్‌ను ఆశ్రయిస్తే, ఆ ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన ఇన్స్పెక్టర్ వికాస్ దేకర్ విచారణ పేరుతో ఆమెను రాత్రివేళ క్రైమ్ బ్రాంచ్ కార్యాలయానికి పిలిపించారు. అక్కడ ఆయన తనపై రెండుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారని ఆ బాలిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నేరస్తుల నుంచి పిల్లలను కాపాడాల్సిన చోటే, ఆ పిల్లకు నేరం ఎదురైందన్నది ఈ కేసు సారాంశం.

తెలంగాణ పల్లెల్లో ఒక జానపద పాట తరతరాలుగా వినిపిస్తోంది. యదార్థ ఘటన ఆధారంగా పుట్టిన ఆ పాట జనం గుండెల్లోకి చొచ్చుకుపోయింది. "ఖాకీ బాటలోళ్లు, కనికరమేలనోళ్లు" అంటూ, "రక్షక భటులమంటూ భక్షక బాటలో వచ్చి" అంటూ పోలీసుల తీరును ఆ పాట నిలదీస్తుంది. సినిమా చూసి ఇంటికి తిరిగొస్తున్న ఆలుమగలకు ఎదురైన దారుణాన్ని కళ్లకు కట్టిన ఆ పాటను జనం నోటినోటా పాడుకున్నారంటే, పోలీసులపై వారి మనసులో గూడుకట్టుకున్న ఆగ్రహం ఎంతటిదో అర్థమవుతుంది. ఇది ఏ సినిమా రచయితా కల్పించిన అపనమ్మకం కాదు, ప్రజలు తమ అనుభవంతో రాసుకున్న పాట. ఇప్పుడు గోవా ఘటన ఆ పాటలోని మాటలనే మళ్లీ గుర్తుచేస్తోంది.

ఇది బాలిక ఒక్కరి మాటే కాదు. పోలీసులు పరిశీలించిన సీసీటీవీ ఫుటేజీ లో ఒక మహిళ ఆ బాలికను ఇన్స్పెక్టర్ గదిలోకి తీసుకెళ్లడం కనిపించింది. అందుకే ఆ మహిళపైనా కేసు నమోదైంది. అంతకంటే దారుణం, ఇన్స్పెక్టర్ క్యాబిన్‌లో ని కెమెరాలను వస్త్రంతో కప్పి ఉంచినట్లు అధికారులే గుర్తించడం. నిజాయితీగా విచారణ చేసే అధికారికి కెమెరాలు కప్పాల్సిన అవసరం ఏముంటుంది? చట్టబద్ధమైన విచారణకు సాక్ష్యం కావాలి, దాక్కోవడానికి చీకటి కాదు. రాత్రివేళ ఒక మైనర్ బాలికను ఒంటరిగా కార్యాలయానికి పిలవడం, గదిలోకి తీసుకెళ్లడానికి ఒక మహిళ సాయం, కెమెరాలకు అడ్డంగా గుడ్డ. ఇవన్నీ ఒకే దిశలో చూపుతున్న సంకేతాలు.

ఇది ఒక వ్యక్తి దుర్మార్గం మాత్రమే కాదు, వ్యవస్థ వైఫల్యం కూడా. రాత్రివేళ ఒక మైనర్ బాలికను విచారణకు పిలవడానికి నిబంధనలు అనుమతిస్తాయా? అనుమతిం చకపోతే ఎవరూ ఎందుకు ఆపలేదు? ఇన్స్పెక్టర్ గది కెమెరాలు కప్పి ఉన్నా పైఅధికా రులకు ఎందుకు తెలియలేదు? చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన బాధితురాలికే రక్షణ లేకపోతే, ఏ ఆశతో సామాన్యుడు స్టేషన్ మెట్లెక్కాలి? పోలీస్ స్టేషన్ అంటే భరోసా అనే భావన పోయి, భయం మిగిలిందంటే, దానికి బాధ్యత వహించాల్సింది ప్రజలు కాదు, ఇలాంటి వారిని పట్టించుకోని శాఖే.

ఇలాంటి కేసుల్లో శాఖ తరచూ చేసే తప్పు తమ వారిని కాపాడుకునే ప్రయత్నం. "ఒక్కడి తప్పు" అని కొట్టిపారేసి, బదిలీతోనో సస్పెన్షన్‌తోనో సరిపెట్టి, కేసును నీరుగార్చడం మనం చాలాసార్లు చూశాం. ఈసారి అలా జరగకూడదు. నిందితుడిని సర్వీసు నుంచి తక్షణం దూరం పెట్టడమే కాదు, దర్యాప్తు స్వతంత్రంగా, శాఖ ప్రభా వం లేకుండా సాగాలి. కెమెరాలు కప్పడంలో ఎవరెవరి హస్తం ఉంది, ఈ ఉదంతం బయటకు రాకుండా ఎవరైనా ప్రయత్నించారా అన్నది కూడా తేల్చాలి. ఆధారాలు మాయం చేసే ప్రయత్నం జరిగిందని తేలితే ఆ నేరానికి కూడా శిక్ష పడాలి.

ఆ బాలిక గుర్తింపు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపడకూడదు. ఆమెకు పూర్తి రక్షణ, కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందాలి. కేసు ఏళ్ల తరబడి సాగి, బాధితురాలే విసిగిపోయి వెనక్కి తగ్గే పరిస్థితి రాకుండా ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరగాలి. చట్టం ముందు ఎవరైనా సమానమే అని నిరూపించాల్సిన సమయం ఇదే. యూనిఫాం వేసుకున్నవాడైతే ఎక్కువ శిక్ష పడాలి, తక్కువ కాదు. ఎందుకంటే అతడు చేసింది నేరం మాత్రమే కాదు, ప్రజలు పోలీసులపై పెట్టుకున్న నమ్మకానికి చేసిన ద్రోహం.

సినిమాల్లో విలన్ పోలీసును చివరికి హీరో శిక్షిస్తాడు. నిజజీవితంలో ఆ పని కోర్టులు, దర్యాప్తు సంస్థలు, శాఖే చేయాలి. అది చేయలేకపోతే, "చట్టం ఉన్నవాళ్లకే చుట్టం" అన్న నానుడికి ఈ శాఖే రుజువు అవుతుంది.

నక్సల్బరీ నుంచి నేటివరకు...

భారత విప్లవోద్యమ చరిత్రలో కామ్రేడ్ స్వదేశ్ భట్టాచార్య (శంభూజీ)

నక్సల్బరీ ఒక తిరుగుబాటు మాత్రమే కాదు.. ఒక తరం జీవితాలను మార్చిన రాజకీయ పిలుపు. ఆ పిలుపుతో మొదలైన ప్రయాణంలో కొందరు అమరులయ్యారు.. మరికొందరు విప్లవోద్యమ నిర్మాణానికే తమ జీవితాలను అంకితం చేశారు. అలాంటి చారిత్రక తరానికి చెందిన నాయకుడు కామ్రేడ్ స్వదేశ్ భట్టాచార్య (శంభూజీ). పార్టీ విచ్ఛిన్నమైన సంక్షోభ కాలం నుంచి పునర్నిర్మాణం, రాజకీయ పునఃపరిశీలన, ప్రజా ఉద్యమాల విస్తరణ వరకు ఐదు దశాబ్దాలకు పైగా సాగిన ఆయన ప్రస్థానం ఒక వ్యక్తి జీవిత చరిత్ర మాత్రమే కాదు.. భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్లు, నేర్చుకున్న పాఠాలు, సాధించిన సంస్థాగత పరిణామాలకు సజీవ సాక్ష్యం. నక్సల్బరీ నుంచి నేటి వరకు సాగిన ఆ ప్రయాణాన్ని, అందులో శంభూజీ పాత్రను చరిత్ర వెలుగులోకి తెచ్చే ప్రయత్నమే ఈ వ్యాసం.

భారత కమ్యూనిస్టు విప్లవోద్యమ చరిత్రలో కొన్ని పేర్లు వ్యక్తిగత జీవితాలకే పరిమితం కావు. అవి ఒక చారిత్రక కాలాన్ని, రాజకీయ పరిణామాలను, సంస్థాగత నిర్మాణం కోసం సాగిన సుదీర్ఘ పోరాటా న్ని గుర్తుచేస్తాయి. కామ్రేడ్ స్వదేశ్ భట్టాచార్య అలాంటి నాయకుల్లో ఒకరు. పార్టీ శ్రేణుల్లో శంభూజీగా పరిచితులైన ఆయన ప్రస్థానం నక్సల్బరీ ఉద్యమ ప్రభావంతో మొదలై, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పునర్నిర్మాణం, విస్తరణ, రాజకీయ పరిణామాలతో ముడిపడి కొనసాగింది. ఐదు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో భాగస్వామి గా ఉంటూ కేంద్ర కమిటీ కీలక నేతగా, కేంద్ర నియంత్రణ కమిషన్ ఛైర్మన్ గా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఆయన రాజకీయ జీవితాన్ని పరిశీలిం చడం అంటే నక్సల్బరీ నుంచి నేటి వరకు భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం సాగించిన ప్రయాణంలోని కీలక ఘట్టాలను అర్థం చేసుకోవడం.

1967 మేలో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ ప్రాంతంలో పేద రైతులు, వ్యవసాయ కార్మికులు భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగించిన తిరుగుబాటు భారత రాజకీయాల్లో కొత్త చైతన్యాన్ని రగిలించింది. భూమి, భుక్తి, గౌరవం కోసం సాగిన ఆ పోరాటం గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాలేదు. విద్యార్థులు, యువకులు, మేధావులు, కార్మికుల్లోనూ తీవ్ర ప్రభావం చూపింది. భారత సమాజంలోని వర్గ దోపిడీ, భూస్వామ్య ఆధిపత్యం, రాజ్య స్వభావం, విప్లవ మార్గం వంటి ప్రశ్నలపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ రాజకీయ తరంగం నుంచి 1969 ఏప్రిల్ 22న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఆవిర్భవించింది. చారు మజుందార్ నాయకత్వంలో ప్రారంభమైన ఈ ప్రయాణం వేలాది మంది యువతను విప్లవ రాజకీయాల వైపు నడిపించింది.

స్వదేశ్ భట్టాచార్య రాజకీయ ప్రస్థానం కూడా ఈ చారిత్రక వాతా వరణంలోనే రూపుదిద్దుకుంది. ఆయన 1999 జనవరిలో కామ్రేడ్ వినోద్ మిశ్రాకు నివాళిగా రాసిన స్మృతివ్యాసం ఈ విషయంలో ఒక ముఖ్యమైన ఆధారం. అందులో 1968లో దుర్గాపూర్ రీజినల్ ఇంజి నీరింగ్ కాలేజీ నుంచి నక్సల్బరీ పిలుపుకు స్పందిస్తూ ప్రారంభమైన రాజకీయ ప్రయాణాన్ని ప్రస్తావించారు. ఆ కాలంలో దుర్గాపూర్ కళాశాల విద్యార్థుల్లో నక్సల్బరీ ప్రభావం పెరుగుతున్నది. ఉన్నత విద్య, ఉద్యోగ భవిష్యత్తు వైపు సాగాల్సిన యువతలో ఒక వర్గం సమాజ మార్పు కోసం తమ జీవితాలను అంకితం చేయాలనే ఆలోచనతో ముందుకొచ్చింది. వినోద్ మిశ్రా విద్యార్థి జీవితాన్ని గుర్తుచేస్తూ స్వదేశ్ భట్టాచార్య రాసిన వివరాలు ఆ కాలపు విద్యార్థి రాజకీయ వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి.

1972 నాటికి సీపీఐ (ఎంఎల్) తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. చారు మజుందార్ సహా అనేకమంది నాయకులు రాజ్య అణచివేతకు బలయ్యారు. కేంద్ర నాయకత్వం దాదాపుగా విచ్ఛిన్నమైంది. వివిధ ప్రాంతాల్లోని పార్టీ శక్తులు చెదిరిపోయాయి. రాజకీయ పంథా విషయంలోనూ తీవ్ర గందరగోళం నెలకొంది. ఇది ఒక సంస్థాగత సంక్షోభం మాత్రమే కాదు, భారత కమ్యూనిస్టు విప్లవోద్యమ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలకమైన దశ. చెల్లాచెదురైన శక్తులను తిరిగి సమీకరించడం, కొనసాగుతున్న పోరాటాలను సమన్వయం చేయడం, పార్టీ రాజకీయ ఉనికిని నిలబెట్టడం అప్పటి విప్లవకారుల ముందున్న పెద్ద సవాలు.

1974 జూలై 28న చారు మజుందార్ రెండో వర్ధంతి సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీని పునర్వ్యవస్థీకరించారు. ముగ్గురు సభ్యులతో ఏర్పడిన ఆ కమిటీలో కామ్రేడ్ జౌహర్ ప్రధాన కార్యదర్శిగా, కామ్రేడ్ వినోద్ మిశ్రా, కామ్రేడ్ రఘు (స్వదేశ్ భట్టాచార్య) సభ్యులుగా ఉన్నారు. పార్టీ చరిత్రలో ఈ ఘట్టం అత్యంత కీలకమైనది. బీహార్‌లోని భోజ్‌పూర్, పాట్నా ప్రాంతాల్లో రైతాంగ పోరాటా లు బలపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో పార్టీని నిలబెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నా యి. ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతాలు, ఢిల్లీ తదితర ప్రాంతాల్లోనూ విప్లవ శక్తులను సమీకరించే కృషి జరుగుతున్నది. ఈ విభిన్న ప్రాంతాల్లోని పార్టీ శక్తులకు రాజకీయ దిశానిర్దే శం చేయడం, సమన్వయం కల్పించడం ఆ ముగ్గురు సభ్యుల కేంద్ర కమిటీ బాధ్యతగా మారి ంది. అందులో స్వదేశ్ భట్టాచార్య భాగస్వామ్యం ఆయన రాజకీయ జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి.

1975 నవంబరులో భోజ్‌పూర్‌లో శత్రు దాడిని ఎదుర్కొంటూ కామ్రేడ్ జౌహర్ అమరులయ్యారు. పార్టీ మరోసారి నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఈ పరిస్థితుల్లో కామ్రేడ్ వినోద్ మిశ్రా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. 1976 ఫిబ్రవరిలో బీహార్‌లోని గయా జిల్లాలో రెండో పార్టీ మహాసభ జరిగింది. ఈ మహాసభ 11 మంది సభ్యులతో కేంద్ర కమిటీని ఎన్నుకుంది. వినోద్ మిశ్రా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పార్టీని తిరిగి సమీకరించడానికి, గత అనుభవాలను సమీక్షించడానికి, రాజకీయ ఆచరణలో మార్పులు తీసుకురావడానికి ఈ మహాసభ ఒక వేదికగా నిలిచింది. వినోద్ మిశ్రా నాయకత్వంలో పార్టీ తన గత రాజకీయ ఆచరణను విమర్శనాత్మకంగా సమీక్షించుకోవడం ప్రారంభించింది. 1978లో సరిదిద్దుకునే ఉద్యమం చేపట్టింది. గతంలో అనుసరించి న పంథాలోని పరిమితులను గుర్తించడం, ప్రజా ఉద్యమాల నుంచి నేర్చుకోవడం, ప్రజల విస్తృత భాగస్వామ్యానికి అవసరమైన మార్పులు చేయడం ఈ ప్రక్రియలో భాగమయ్యాయి. 1979 జూలైలో భోజ్‌పూర్‌లో జరిగిన ప్రత్యేక పార్టీ సమావేశం బహిరంగ ప్రజా కార్యకలాపాలను ప్రారంభించాలని, ప్రజా సంఘాలను నిర్మించాలని నిర్ణయించింది. విప్లవ రాజకీయాలు ప్రజల విస్తృత భాగస్వామ్యంతోనే బలపడతాయనే అవగాహనకు ఈ నిర్ణయం సంస్థాగత రూపం ఇచ్చింది. పార్టీ పునర్నిర్మాణంలో స్వదేశ్ భట్టాచార్య వంటి నాయకుల పాత్రను ఈ పరిణామాల నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి.

1980వ దశకంలో పార్టీ రాజకీయ, సంస్థాగత విస్తరణకు ప్రాధాన్యత పెరిగింది. 1982లో ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్ (ఐపీఎఫ్) ఏర్పాటుతో ప్రజాస్వామిక, ప్రజా ఉద్యమాల రంగంలో విస్తృత రాజకీయ వేదికను నిర్మించే ప్రయత్నం మొదలైంది. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, సామాజికంగా అణచివేయబడిన వర్గాల సమస్యలను ప్రజా ఉద్యమాలతో అనుసంధానించేందుకు కృషి జరిగింది. పార్టీ అఖిల భారత స్థాయిలో విస్తరిస్తున్న క్రమంలో రాజకీయ సమన్వయం, సంస్థాగత నిర్మాణం, ప్రజా సంఘాల అభివృద్ధి కీలకంగా మారాయి.

1982 డిసెంబర్ 26 నుంచి 30 వరకు బీహార్‌లోని గిరిడీ ప్రాంతంలో మూడో పార్టీ మహాసభ జరిగింది. పార్టీ రాజకీయ, సంస్థాగత పునర్నిర్మాణంలో ఇది మరో ముఖ్యమైన మలుపు. మహాసభ పార్టీ కార్యక్రమం, వ్యవసాయ కార్యక్రమం, రాజ్యాంగం వంటి పత్రాలపై చర్చించి ఆమోదించింది. డిసెంబర్ 31న సమావేశమైన కొత్త కేంద్ర కమిటీ తొలి ప్లీనరీ సమావేశం పొలిట్‌బ్యూరోను ఎన్నుకుంది. కామ్రేడ్ వినోద్ మిశ్రాను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది.

1988 జనవరి 1 నుంచి 5 వరకు బీహార్‌లోని హజారీబాగ్ జిల్లాలో నాలుగో పార్టీ మహాసభ జరిగింది. దేశంలోని 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రతినిధులు పాల్గొన్న ఈ మహాసభ పార్టీ రాజకీయ దిశలో కీలకమైన మార్పులకు వేదికైంది. గత రాజకీయ అంచనాల్లోని కొన్ని పొరపాట్లను సమీక్షిస్తూ, ఇతర వామపక్ష పార్టీలతో సంబంధాలు, విస్తృత వామపక్ష – ప్రజాస్వామిక ఐక్యత వంటి అంశాలపై కొత్త దృక్పథాన్ని ముందుకు తెచ్చింది. ఈ మహాసభ 21 మంది సభ్యులతో కేంద్ర కమిటీని ఎన్నుకుంది. అనంతరం జరిగిన కేంద్ర కమిటీ తొలి ప్లీనరీ సమావేశం వినోద్ మిశ్రాను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుని, ఏడు మంది సభ్యులతో పొలిట్‌బ్యూరోను ఏర్పాటు చేసింది. కేంద్ర నియంత్రణ కమిషన్‌ను కూడా ఎన్నుకుంది. ఆ కమిషన్ తొలి సమావేశం కామ్రేడ్ స్వదేశ్ భట్టాచార్యను అధ్యక్షుడిగా ఎన్నుకుంది. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం, సంస్థాగత క్రమశిక్షణ, నిర్ణయాల అమలు, అంతర్గత వ్యవహారాల పర్యవేక్షణలో ఈ కమిషన్‌కు ప్రత్యేక బాధ్యత ఉంటుంది. ఈ బాధ్యతను స్వదేశ్ భట్టాచార్యకు అప్పగించడం ఆయనపై పార్టీ ఉంచిన విశ్వాసాన్ని తెలియజేస్తుంది.

1990 జూలైలో ఢిల్లీలో జరిగిన ప్రత్యేక అఖిల భారత పార్టీ సమావేశం అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ వైఖరిని సమీక్షించింది. సోవియట్ యూనియన్, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై పార్టీ తన రాజకీయ అవగాహనను స్పష్టం చేసింది. ఈ దశలోనూ పార్టీ కేంద్ర నాయకత్వంలో స్వదేశ్ భట్టాచార్య కొనసాగారు. ఆయన రాజకీయ ప్రయాణాన్ని కేవలం పదవుల పరంపరగా చూడలేం. పార్టీ ఎదుర్కొన్న సంక్షోభాలు, ఆత్మవిమర్శ, పునర్నిర్మాణం, విస్తరణ వంటి ప్రతి దశలోనూ ఆయన భాగస్వామ్యం ఒక నిరంతర రాజకీయ అనుభవానికి ప్రతీక.

1998 డిసెంబరులో కామ్రేడ్ వినోద్ మిశ్రా మరణం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌కు తీరని లోటు. దాదాపు రెండు దశాబ్దాల పాటు పార్టీని పునర్నిర్మాణం, విస్తరణ దిశగా నడిపించిన నాయకుడి మరణం తర్వాత నాయకత్వ బాధ్యతలను కొనసాగించడం పార్టీ ముందున్న సవాలుగా మారింది. కేంద్ర కమిటీ కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్యను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. ఈ నాయకత్వ మార్పు సమయంలో స్వదేశ్ భట్టాచార్య పార్టీ అగ్ర నాయకత్వంలో కొనసాగారు. ఆయనకు ఉన్న సుదీర్ఘ సంస్థాగత అనుభవం కొత్త నాయకత్వానికి ఒక చారిత్రక అనుసంధానంగా నిలిచింది.

2002 నవంబరులో పాట్నాలో జరిగిన పార్టీ ఏడో మహాసభ సందర్భంగా స్వదేశ్ భట్టాచార్య పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, సంస్థాగత వ్యవహారాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకుడిగా వార్తల్లో ప్రస్తావించబడ్డారు. నవంబర్ 20న ప్రచురితమైన 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వార్తలో దేశంలోని వామపక్ష, ప్రజాస్వామిక శక్తుల సమాఖ్య నిర్మాణంపై ఆయన పార్టీ వైఖరిని వివరించినట్లు నమోదైంది. ఇది ఆయన సంస్థాగత బాధ్యతలతోపాటు రాజకీయ చర్చల్లోనూ చురుకుగా పాల్గొన్నారని తెలియజేస్తుంది.

2012 జూలై 28న ఢిల్లీలో సీపీఐ (ఎంఎల్) కేంద్ర కార్యాలయం 'చారు భవన్' ప్రారంభోత్సవం జరిగింది. చారు మజుందార్ 40వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన అర్ధవిగ్రహాన్ని స్వదేశ్ భట్టాచార్య ఆవిష్కరించారు. 1974 జూలై 28న పునర్వ్యవస్థీకరించిన ముగ్గురు సభ్యుల కేంద్ర కమిటీలో అప్పటికి జీవించి ఉన్న ఏకైక సభ్యుడిగా ఆయనను పార్టీ గుర్తించింది. జౌహర్, వినోద్ మిశ్రాలతో కలిసి పార్టీని పునర్నిర్మించే బాధ్యతలో భాగస్వామిగా ఉన్న నాయకుడు నాలుగు దశాబ్దాల తర్వాత చారు మజుందార్ స్మారక కార్యక్రమంలో పాల్గొనడం ఒక చారిత్రక కొనసాగింపుకు ప్రతీకగా నిలిచింది. 2023లో వినోద్ మిశ్రా 25వ వర్ధంతి సందర్భంగా పాట్నాలో జరిగిన సంస్మరణ సభలోనూ స్వదేశ్ భట్టాచార్య పాల్గొన్నారు. 1974 కేంద్ర కమిటీలో జౌహర్, వినోద్ మిశ్రాలతో కలిసి పనిచేసిన నాయకుడిగా ఆయనను ఆ సభలో ప్రత్యేకంగా గుర్తించారు.

నేటి భారతదేశంలో వర్గ దోపిడీ, భూస్వామ్య ఆధిపత్యం, కుల వివక్ష, కార్పొరేట్ దోపిడీ, మతతత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి సవాళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో విప్లవోద్యమం తన చారిత్రక అనుభవాలను విమర్శనాత్మకంగా సమీక్షించుకుంటూ, నూతన తరాల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉంది. గతాన్ని గౌరవించడం అంటే గతాన్ని కీర్తిస్తూ ఆగిపోవడం కాదు. ఆ అనుభవాల నుంచి నేర్చుకుని వర్తమాన సమస్యలను ఎదుర్కొంటూ భవిష్యత్తు సమాజ నిర్మాణం కోసం ప్రజలతో కలిసి పనిచేయడం.నక్సల్బరీ పిలుపుతో మొదలైన రాజకీయ ప్రయాణంలో ఒక తరం విప్లవకారులు తమ జీవితాలను ప్రజల విముక్తి కోసం అంకితం చేశారు. కొందరు అమరులయ్యారు. మరికొందరు పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల కొనసాగింపులో జీవితాంతం నిమగ్నమయ్యారు. కామ్రేడ్ స్వదేశ్ భట్టాచార్య (శంభూజీ) ఆ చారిత్రక తరానికి చెందిన నాయకుడు. ఆయన ప్రస్థానం ఒక వ్యక్తి రాజకీయ జీవితాన్ని మాత్రమే కాదు, భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్లు, సాధించిన మార్పులు, కొనసాగిస్తున్న పోరాటాల చరిత్రను కూడా మన ముందుంచుతుంది. కామ్రేడ్ స్వదేశ్ భట్టాచార్యకు విప్లవ జోహార్లు! నక్సల్బరీ విప్లవ వారసత్వానికి జోహార్లు!

- మామిండ్ల రమేష్ రాజా
తెలంగాణ కార్యదర్శి,
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్
78932 30218

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యమే కీలకం



ఆ సమస్యకు పరిష్కారం ఏమిటనే విషయంలో అందరికీ ఒకే అభిప్రాయం ఉండకపోవచ్చు. అయినప్పటికీ సమస్యను గుర్తిం చడం, దానిపై చర్చించడం, పరిష్కార మార్గాలను అన్వేషించ డం అనే ఉమ్మడి లక్ష్యం వారిని కలుపుతుంది. ప్రజాస్వామ్య ఉద్యమాలకు ఈ లక్షణం అత్యంత అవసరం. ఎందుకంటే ప్రజాస్వామ్యం అనేది ముందుగానే నిర్ణయించిన సమాధానా లను ప్రచారం చేయడం కాదు; సమాజం ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమిష్టిగా సమాధానాలను వెతకడం.

ఈ తరహా ఉద్యమాల్లో వ్యక్తుల మధ్య ఏర్పడే ఆత్మీయత కూడా విశేషమైనది. రాజకీయ అభిప్రాయాలు వేరుగా ఉన్నప్పటికీ పరస్పరం మాట్లాడుకోవడం, ఒకరి అనుభవాలను మరొకరు వినడం, భిన్నమైన ఆలోచనలను గౌరవించడం ప్రజాస్వామ్య సంస్కృతికి పునాది వేస్తాయి. ఉద్యమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఒకే రాజకీయ పార్టీకి చెందినవారై ఉండాల్సిన అవసరం లేదు. ఒకే సిద్ధాంతాన్ని అనుసరించాల్సిన అవసరమూ లేదు. ఒక సామాజిక సమస్యపై ఉమ్మడి ఆందోళన వారిని కలిపినప్పుడు, ఆ వేదిక ప్రజాస్వామ్యానికి కొత్త అర్థాన్ని అందిస్తుంది. ఇక్కడ నాయకత్వం కంటే భాగస్వామ్యం, ఆదేశాల కంటే సంభాషణ, విధేయత కంటే ఆలోచనా స్వేచ్ఛ ప్రాధాన్యం పొందుతాయి.

ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకోవడంలో భాష పాత్ర కూడా చాలా కీలకమైనది. రాజకీయ పరిభాషలోని క్లిష్టమైన పదాలు, సిద్ధాంత గ్రంథాల్లోని నిర్వచనాలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని వివరించలేవు. సాధారణ ప్రజలు తమ రోజువారీ జీవితంలో ఉపయోగించే భాషలో ప్రజాస్వామ్యం వ్యక్తమవుతుంది. ఒక ప్రశ్నలో, ఒక నిరసన నినాదంలో, ఒక సంభాషణలో, ఒక చిన్న వ్యాఖ్యలో, కొన్నిసార్లు ఒక మౌన నిరసనలో కూడా ప్రజాస్వామ్య భావన ప్రతిఫలిస్తుంది. ప్రజాస్వామ్యానికి ఒకే అర్థం ఉండదు. సమాజంలోని వివిధ వర్గాలకు, వయసులకు, అనుభవాలకు అనుగుణంగా దాని అర్థాలు మారుతూ ఉంటాయి. ఈ బహుళార్థక స్వభావమే ప్రజాస్వామ్యానికి అసలైన ప్రత్యేకత.

మాట్లాడే హక్కుతోపాటు మౌనంగా ఉండే హక్కు కూడా ప్రజాస్వామ్యంలో భాగమే. శరీర భాష, ముఖ కవళికలు, సంజ్ఞ లు, సామూహిక ప్రదర్శనలు వంటి అంశాలు కూడా రాజకీయ భావాలను వ్యక్తీకరించగలవు. ఒక వ్యక్తి మాటలతో చెప్పలేని నిరసనను అతని మౌనం వ్యక్తం చేయవచ్చు. ఒక సమూహం యొక్క కదలికలు, నృత్యం, కళారూపాలు కూడా సామాజిక సందేశాన్ని అందించగలవు. అందువల్ల ప్రజాస్వామ్య సంభాషణ ను కేవలం ప్రసంగాలు, ప్రకటనలు, రాజకీయ నినాదాలకే పరిమితం చేయకూడదు. సమాజంలోని వివిధ వ్యక్తీకరణ రూపాలకు సమానమైన ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థి ఉద్యమాలు ఈ విషయంలో ఒక కొత్త ప్రయోగాన్ని ముందుకు తీసుకొచ్చాయి. రాజకీయ నిరసనను కేవలం ఆగ్రహం, వ్యతిరేకత, నినాదాల రూపంలో కాకుండా కళాత్మకమైన, సృజనాత్మకమైన వ్యక్తీకరణగా కూడా మలచవచ్చని అవి సూచిస్తున్నాయి. ఒక రాజకీయ ర్యాలీ నృత్యరూపంలో వ్యక్తమవ డం, ఒక సిద్ధాంతపరమైన చర్చ సాధారణ సంభాషణగా మారడం, ఒక సామాజిక సమస్య కళారూపాల ద్వారా ప్రజల్లోకి వెళ్లడం వంటి పరిణామాలు రాజకీయ వ్యక్తీకరణకు కొత్త మార్గాలను తెరుస్తాయి. రాజకీయాల్లో సృజనాత్మకతకు స్థానం కల్పించినప్పుడు ప్రజాస్వామ్యం మరింత ప్రజలకు చేరువవుతుంది.

ప్రజాస్వామ్యాన్ని కేవలం రాజ్యాంగం, ఎన్నికలు, చట్టాలు, శాస నసభలు, ప్రభుత్వ సంస్థల ద్వారా మాత్రమే అర్థం చేసుకోవడం అసంపూర్ణమైన దృక్పథం. ఈ వ్యవస్థలు ప్రజాస్వామ్యానికి అధికారిక నిర్మాణాన్ని కల్పిస్తాయి. కానీ వాటిని సజీవంగా ఉంచేది ప్రజల మధ్య ఉండే విశ్వాసం, పరస్పర గౌరవం, సహనం, సహజీవనం, అహింస వంటి సామాజిక విలువలు. ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడవచ్చు. కానీ ప్రజల మధ్య నమ్మకం లేకపోతే ఆ వ్యవస్థ బలహీనమవుతుంది. చట్టపరమైన హక్కులు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకునే స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం తన ప్రయోజనాన్ని కోల్పోతుంది.

ఈ సందర్భంలో రెండు విలువలు అత్యంత ప్రాధాన్యమైనవి. మొదటిది ఆత్మీయత, రెండవది అహింస. ఆత్మీయత అనేది భిన్నమైన వ్యక్తులను ఒక సామాజిక సంబంధంలోకి తీసుకు వస్తుంది. అహింస అనేది విభేదాలను హింసకు దారితీయ కుండా పరిష్కరించుకునే మార్గాన్ని చూపిస్తుంది. ఒకరి అభిప్రా యాన్ని మరొకరు అంగీకరించకపోయినా, వారి హక్కును గౌరవించడం ప్రజాస్వామ్య పరిణతి. రాజకీయంగా విభేదించి నంత మాత్రాన వ్యక్తిగత శత్రుత్వాన్ని పెంచుకోవాల్సిన అవస రం లేదు. ఈ సంస్కారం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం.

ప్రజాస్వామ్యంలో చర్చావేదికల ప్రాధాన్యం కూడా ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి. ఒకప్పుడు గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాలు స్వేచ్ఛాయుతమైన చర్చలకు వేదికలుగా ఉండేవి. ప్రజలు సామాజిక సమస్యలపై మాట్లాడేవారు. తమ అనుభవాలను పంచుకునేవారు. అధికారు లను ప్రశ్నించేవారు. అభిప్రాయ భేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకునేవారు. ఇటువంటి అనధికారిక చర్చావేదికలు ప్రజాస్వామ్యానికి సామాజిక పునాదులుగా పనిచేశాయి. అయితే సమకాలీన రాజకీయ సంస్కృతిలో చర్చ స్థానంలో ప్రచారం, ప్రశ్నల స్థానంలో ఆరోపణలు, వాదనల స్థానంలో వ్యక్తిగత విమర్శలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో విద్యార్థి ఉద్యమాలు స్వేచ్ఛాయుతమైన రాజకీయ చర్చల అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాయి.

ప్రజాస్వామ్యం అనేది కేవలం ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం కాదు. ప్రజలు తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో భాగస్వాములు కావడం కూడా. ఒక విద్యార్థి విద్యా విధానంపై ప్రశ్నించడం, ఒక రైతు వ్యవసాయ విధానాన్ని విమర్శించడం, ఒక కార్మికుడు తన హక్కుల కోసం గొంతెత్తడం, ఒక పౌరుడు పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమించడం ఇవన్నీ ప్రజాస్వా మ్య భాగస్వామ్యానికి ఉదాహరణలు. ఈ భాగస్వామ్యాన్ని రాజకీయ వ్యతిరేకతగా మాత్రమే చూడటం ప్రజాస్వామ్య పరిధిని కుదించడం అవుతుంది.

ప్రజాస్వామ్యానికి మరో ముఖ్యమైన లక్షణం నిజాయితీ, విశ్వసనీయత. రాజకీయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉన్నప్పు డే వారు ప్రజాస్వామ్య ప్రక్రియల్లో చురుకుగా పాల్గొంటారు. ప్రభుత్వాలు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. రాజకీయ పార్టీలు తమ విధానాలను సమర్థించుకోవాలి. ప్రజా సంస్థలు పారదర్శకంగా పనిచేయాలి. పౌరులు తమ హక్కులతోపాటు బాధ్యతలను కూడా గుర్తించాలి. ఈ పరస్పర జవాబుదారీతనం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది.

విద్యార్థి ఉద్యమాల నుంచి నేర్చుకోవాల్సిన మరో అంశం సాధారణ జీవిత అనుభవాల ప్రాధాన్యం. ప్రజాస్వామ్యంపై చర్చలు కేవలం విశ్వవిద్యాలయాల తరగతి గదుల్లోనో, రాజకీ య వేదికలపైనో జరగాల్సిన అవసరం లేదు. ప్రజల రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలే ప్రజాస్వామ్య అధ్యయనానికి ప్రధాన ఆధారాలు. తాగునీరు, విద్య, ఉపాధి, వైద్యం, వ్యవసాయం, సామాజిక న్యాయం, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలపై ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాలు ప్రజాస్వామ్య ఆలోచనలను నిర్మిస్తాయి. ప్రజల అనుభవాలను రాజకీయ చర్చల్లోకి తీసుకురావడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత వాస్తవికంగా మారుతుంది.

అందువల్ల మెజారిటీ ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యామ్నాయం మరొక ఆధిపత్య భావజాలం కాదు. దానికి నిజమైన ప్రత్యామ్నాయం భిన్నత్వాన్ని గౌరవించే ప్రజాస్వామ్య సంస్కృతి. ఒకే ఆలోచనను సమాజంపై రుద్దడం కాకుండా అనేక ఆలోచనలకు అవకాశం కల్పించడం, ఒకే రాజకీయ కథనాన్ని ప్రోత్సహించడం కాకుండా వివిధ సామాజిక అనుభవాలకు వేదిక కల్పించడం, ప్రశ్నలను అణచివేయడం కాకుండా వాటిని ప్రజాస్వామ్య సంభాషణలో భాగం చేయడం అవసరం. ప్రజాస్వామ్యం నిరంతరం నేర్చుకునే, మార్పులను స్వీకరించే, తనను తాను సరిదిద్దుకునే వ్యవస్థగా ఉండాలి.

నిజానికి ప్రజాస్వామ్యానికి అత్యంత పెద్ద ప్రమాదం కేవలం అధికార కేంద్రీకరణలోనే లేదు. ప్రజలు ప్రశ్నించడం మానేయడంలో, భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి భయపడటంలో, రాజకీయ చర్చలు ఒకే మూసలోకి పరిమితం కావడంలో కూడా ఉంది. ప్రజాస్వామ్యం జీవించి ఉండాలంటే పౌరులు ఆలోచించాలి, ప్రశ్నించాలి, చర్చించాలి, విభేదించాలి. విద్యార్థి ఉద్యమాలు ఈ ప్రాథమిక ప్రజాస్వామిక లక్షణాలను తిరిగి గుర్తుచేస్తున్నాయి.

ప్రజాస్వామ్యాన్ని కాపాడటం అంటే కేవలం ఎన్నికల ప్రక్రియను నిర్వహించడం కాదు. ప్రజల ఆలోచనా స్వేచ్ఛను, వ్యక్తీకరణ హక్కును, భిన్నత్వాన్ని, సామాజిక గౌరవాన్ని పరిరక్షించడం. మెజారిటీకి అధికారం ఉండవచ్చు, కానీ ప్రజాస్వామ్యానికి ఆత్మ మాత్రం సమాజంలోని ప్రతి వ్యక్తి గౌరవంలో ఉంటుంది. ప్రశ్నించే విద్యార్థి, భిన్నంగా ఆలోచించే పౌరుడు, తన హక్కుల కోసం నిలబడే సామాన్యుడు, ఇతరుల అభిప్రాయాలను వినే సమాజం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. ప్రజాస్వామ్యం అనేది ఒకసారి నిర్మించి వదిలేసే రాజకీయ కట్టడం కాదు. ప్రతి తరం తన అనుభవాలతో, ఆలోచనలతో, పోరాటాలతో నిరంతరం పునర్నిర్మించుకోవాల్సిన సామాజిక విలువ. ఆ పునర్నిర్మాణంలో విద్యార్థి ఉద్యమాలు, స్వేచ్ఛాయుతమైన సంభాషణలు, అహింసాయుతమైన నిరసనలు, భిన్నత్వాన్ని గౌరవించే సంస్కృతి కీలక పాత్ర పోషిస్తాయి.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

సాయినాథ్ ఇండస్ట్రీస్‌లో 9 కోట్ల ధాన్యం మాయం

- కేసు నమోదు చేసిన పోలీసులు

తూప్రాన్, అక్టోబర్ 31 (జనం సాక్షి) : మండలంలోని ఘణపూర్ గ్రామ శివారులో గ ల సాయినాథ్ ఇండస్ట్రీస్‌లో మరి తొమ్మిది కోట్ల విలువ గల వరి ధాన్యం షార్టేజ్ గుర్తింపు సుమారు రూ.9 కోట్ల విలువ గల ధాన్యం షార్టేజ్ వున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు. గణపూర్ గ్రామంలోని సాయినాథ్ ఇండస్ట్రీస్‌పై సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో సుమారు 3,620 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం (ఖుఎంఎ) షార్టేజ్ ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ షార్టేజ్ అయిన వరి ధాన్యం విలువ సుమారు రూ.9 కోట్ల వరకు ఉంటుందని విజిలెన్స్ అధికారులు అంచనా వేయడం జరిగింది. ఈ విషయమై మెదక్ సివిల్ సప్లైస్ అసిస్టెంట్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుప్రాన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

కరువు మండలాలు డిక్లేర్ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కౌల్చారం, అక్టోబర్ 31(జనం సాక్షి) : కరువు మండలాల డిక్లరేషన్ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దాంతో జిల్లా రహితంగానికి నష్టం వాటిల్లుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. కౌల్చారం మండలంలోని చిన్నగనాపూర్ గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్థానిక సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి సొసైటీ చైర్మన్ మంద నాగులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో కేవలం మనోహరాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి 20 మండలాలను కరువు మండలాలుగా డిక్లేర్ చేయలేదని అన్నారు. కౌడిపల్లి నర్సాపూర్ చిలాప్చేడ్ మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ కేవలం ఒకే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో వివక్ష ఎందుకన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. కరువు మండలాలుగా ప్రకటించడంతో రైతంగానికి సబ్సిడీపై విత్తనాలు పశుగ్రాసం వస్తుందన్నారు. ఉపాధి హామీ పని లభిస్తుందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు వస్తాయన్నారు. ప్రభుత్వం వరిపంటలు సాగు చేయవద్దని క్రాప్ హాలిడే ప్రకటించడంతో రైతాంగం ఏ విధంగా జీవిస్తారని అన్నారు. ప్రతి రైతుకు ఎకరాకు 30 వేల రూపాయలు ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, ఉప సర్పంచ్, తహసిల్దార్ శ్రీనివాస్ చారి, సి డి సి మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ పిల్లల రాజాగౌడ్, సొసైటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి,బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, సొసైటీ డైరెక్టర్ పుల్లబోయిన మల్లేష్, సీఈఓ చందాపురం సత్యనారాయణ రెడ్డి, తమ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

తార్నాక సేవా 25 ప్రచార సామగ్రి తొలగింపుపై అభ్యంతరం

- జీహెచ్ఎంసీ అధికారులు నిబంధనలపై స్పష్టత ఇవ్వాలి

సికింద్రాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి) : తార్నాకలో ప్రజల కోసం చేపడుతున్న తార్నాక సేవా 25 సామాజిక కార్యక్రమాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, కటౌట్లను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించడంపై మహంకాళి జిల్లా ఇంటెలెక్చువల్ సెల్ ఇన్‌చార్జ్ శ్రీరామ్ వెంకట్ ప్రశ్నించారు. దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన కటౌట్లను సైతం తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన నిలదీశారు. ఏ నిబంధనల ప్రకారం ఈ చర్యలు చేపట్టారో అధికారులు వెల్లడించాలని కోరారు. తార్నాక ప్రజల భాగస్వామ్యంతో 25 సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల సమాచారాన్ని చేరవేసేందుకు ఏర్పాటు చేసిన ప్రచార సామగ్రిని తొలగించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తార్నాక ప్రాంతంలో ఉన్న రాజకీయ, వాణిజ్య ప్రకటనలకూ ఇదే నిబంధనలు వర్తింపజేస్తున్నారా అని ప్రశ్నించారు. అనుమతులు తప్పనిసరి అయితే వాటిని పొందేందుకు అవసరమైన మార్గదర్శకాలు, సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలను గౌరవిస్తామని, అయితే అధికారుల చర్యల్లో పారదర్శకతతో పాటు సమానత్వం ఉండాలని పేర్కొన్నారు. కటౌట్లు, ఫ్లెక్సీలు తొలగించినా ప్రజాసేవా కార్యక్రమాలు నిలిచిపోవని, తార్నాక అభివృద్ధి కోసం తమ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని శ్రీరామ్ వెంకట్ స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణ, భద్రతే లక్ష్యం

జడ్చర్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి) : నేరాల నియంత్రణ, ప్రజల భద్రతతో పాటు పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ తెలిపారు. శనివారం జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచారం గ్రామంలో పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు గ్రామంలోని 200కు పైగా ఇళ్లను సందర్శించి నివాసితుల వివరాలు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన వాహన పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై దాడులు చేసి 36 బీర్ బాటిళ్లను పట్టుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ ముందస్తు చర్యల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో నేరాలను అరికట్టి సురక్షిత వాతావరణం కల్పిస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ వాడాలని స్పష్టం చేశారు. గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు క్లిక్ చేయవద్దని, ఓటీపీలు పంచుకోవద్దని కోరారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణరెడ్డి, జడ్చర్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

- జస్టిస్ జి. రాధారాణి
- న్యాయవ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్లు తొలగినప్పుడే అందరికీ సమాన న్యాయం
- ఐలు రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

హయత్‌నగర్, అక్టోబర్ 31 (జనం సాక్షి) : ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) రంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు ఎల్బీనగర్‌లోని మహాత్మా గాంధీ లా కళాశాల ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు అబ్బగాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ జస్టిస్ జి. రాధారాణి, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి కరణ్ కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి హనుమంతరావు, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యురాలు సి.హెచ్. శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ జి. రాధారాణి మాట్లాడుతూ సమాజంలో అన్యాయానికి గురవుతున్న వారికి న్యాయవాదులు అండగా నిలవాలని, ఎల్లప్పుడూ న్యాయం వైపు ఉండాలని పిలుపునిచ్చారు. న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లినప్పుడు కొందరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించడంతో పాటు దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

యువ న్యాయవాదులు రాజ్యాంగ సూత్రాలను దృష్టిలో పెట్టుకొని తమ వాదనలు వినిపించాలని, న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమాజంలో మంచి మార్పు రావాలంటే ముందుగా మనలో మనం మార్పు తెచ్చుకోవాలని, సమాజ మార్పు కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్లు తొలగినప్పుడే ప్రతి ఒక్కరికీ సమానమైన న్యాయం అందుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో పాలకులు ఓటర్లను శాసించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. దేశంలో అధికారికంగా ప్రకటించిన ఎమర్జెన్సీ కంటే ప్రకటించని ఎమర్జెన్సీ పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

యువత శాంతియుతంగా తమ నిరసనలను వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

ఐలు రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు బి. శివకుమార్ గౌడ్, అధ్యక్షుడు కే. అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు: ప్రభాకర్ గౌడ్, చాముండరి కుమారి, బి. చంద్రశేఖర్ ఆజాద్, ప్రధాన కార్యదర్శి: అబ్బగాని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు: శ్రీ రామాంజనేయులు, మంజుల దేవి, బి. శ్రీదేవి, కోశాధికారి టి. సంధ్యారాణి వీరితో పాటు కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఐలు రంగారెడ్డి జిల్లా నాయకులు, న్యాయవాదులు, యువ న్యాయవాదులు, న్యాయ కళాశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

- మతిస్థిమితం సరిగ్గా లేక దారుణానికి ఒడిగట్టిన తల్లి
- చింతకుంట గ్రామంలో దారుణ ఘటన
- ధరూర్ పోలీసుల కేసు నమోదు

వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జనం సాక్షి) : వికారాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సెలవుల కోసం సొంత గ్రామానికి వచ్చి ఇద్దరు పిల్లలను దారుణంగా హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధారూర్ మండలం చింతకుంట గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. చింతకుంట గ్రామానికి చెందిన భూపతి రెడ్డి దంపతులు పిల్లల చదువు కోసం వికారాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. ఆదివారం సెలవు కావడంతో శనివారం రోజున తన ఇద్దరు పిల్లలతో స్వగ్రామానికి చేరుకున్నారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో భూపతిరెడ్డి భార్య వాసవి(55) వేదార్షి రెడ్డి (5)సాహర్ష రెడ్డి(3) ఇద్దరు పిల్లలను చంపి తాను ఇంట్లోనే ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. 2017లో చేవెళ్ల మండలం మడికట్టు గ్రామానికి చెందిన వాసవితో మండలం చింతకుంట గ్రామానికి చెందిన భూపతిరెడ్డికి వివాహం జరిగింది. ఈ విషయం తెలియగానే గ్రామస్తులు కుటుంబ సభ్యులు ధరూర్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ధారూర్ సిఐ ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. వృత్తి రీత్యా తాండూర్ లో అధ్యాపకులుగా భూపతి రెడ్డి పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం భూపతి రెడ్డి భార్య వాసవి కొంతకాలంగా మతిస్థిమితం తప్పి వింతగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. అదే క్రమంలో తన ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. కానీ దారూర్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మూడు శవాలను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆత్మహత్యలపై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి.

కరెంట్ షాక్‌తో ఐదేళ్ల చిన్నారి మృతి

- పండుగ వేళ కన్నీరుమున్నీరైన కుటుంబం

మల్కాజిగిరి, అక్టోబర్ 31 (జనం సాక్షి) : పండుగ పూట బంధువుల ఇంటికి వచ్చిన ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్ తగిలి ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కీసరకు చెందిన రాజశేఖర్, అమ్మవారి పండుగ నిమిత్తం శుక్రవారం రాత్రి ఉప్పర్‌గూడలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాత్రి స్థానిక కమ్యూనిటీ హాల్ పైభాగంలో ఏర్పాటు చేసిన షామియానా వద్ద ఆయన కుమార్తె వైశాలి (5) ఆడుకుంటోంది. అక్కడ లైటింగ్ కోసం అమర్చిన వైర్ల ద్వారా చిన్నారికి ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలింది.దీంతో ఒక్కసారిగా కుప్పకూలిన వైశాలిని కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని అంకుర్ ఆసుపత్రికి తరలించారు. కాగా, చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళ్లముందే కుమార్తె ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తండ్రి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- నషా ముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ బ్యూరో, అక్టోబర్ 31 (జనం సాక్షి) : మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు, విద్యార్థుల విద్యాభ్యాసం, కుటుంబ వ్యవస్థ మరియు సమాజంపై తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలలనీ,మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి అవసరమైన వైద్య సేవలు, కౌన్సెలింగ్ మరియు పునరావాస సహాయం అందించాలన్నారు. పిల్లలు, కౌమారదశ యువతలో మాదకద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన కల్పించాలినీ, ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టిన కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్య సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ అహ్మద్ , మున్సిపల్ కమిషనర్ నవీన్ డి సి ఆర్ బి డి ఎస్ పి వెంకటేశ్వర రావు, జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, డి ఐ ఈ ఓ మాధవి, శ్రీనివాస్ రావు ఎడి, డీఈవో ,సీడీపీవో లు, హుస్సేన్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, ఏ ఆర్ ఈ ఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సునీత రాకేష్, ఇర్కా విజన్ ఎన్జీవో ప్రతినిధి ఆభరణ తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో వరుస బ్రెయిన్ స్ట్రోక్ ఘటనలు

బీపీ విషయంలో నిర్లక్ష్యం వద్దు..

సికింద్రాబాద్ బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్

సికింద్రాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి) : తార్నాక ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న మూడు బ్రెయిన్ స్ట్రోక్ ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయని మహంకాళి జిల్లా సికింద్రాబాద్ బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్ అన్నారు. ముఖ్యంగా అధిక రక్తపోటు (బీపీ) విషయంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తాజాగా తార్నాకకు చెందిన కిషోర్ మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని, ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసినట్లు తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గుండె సంబంధిత సమస్యలు, ధూమపానం, ఊబకాయం వంటి అంశాలు బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతాయని వివరించారు. బీపీ ఉన్నవారు కొన్ని రోజులు మందులు వాడి సాధారణ స్థాయికి వచ్చిందని భావించి వైద్యుల సలహా లేకుండా మధ్యలోనే ఆపకూడదని హెచ్చరించారు. ముఖం ఒకవైపు వాలిపోవడం, చేతులు లేదా కాళ్లు అకస్మాత్తుగా బలహీనపడటం, మాట తడబడటం, చూపు మందగించడం, సమతుల్యత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలని సూచించారు. తార్నాక లోని అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తార్నాక సేవ 25 కార్యక్రమంలో భాగంగా వ్యాధుల ముందస్తు గుర్తింపు, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామని శ్రీరామ్ వెంకట్ తెలిపారు.

వెంగళ్‌రావు నగర్‌లో వరుస చోరీలు..

- పోలీసులపై తలసాని ఆగ్రహం
- దొంగలను పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలి

సికింద్రాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి) : ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పోలీసు అధికారులను ఆదేశించారు. రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని వెంగళ్‌రావు నగర్‌లో ఇటీవల మూడు ఇళ్లలో వరుసగా చోరీలు జరగడంతో బాధితులను పరామర్శించి, ఘటనలపై అధికారులతో సమీక్షించారు. చోరీ బాధితులు రెండు రోజుల క్రితం ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో శనివారం పోలీసు, జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్ వర్క్స్ తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన బస్తీలో పర్యటించారు. చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలు లక్ష్మి తన బిడ్డ వివాహం కోసం ఇంట్లో దాచిన రూ.6 లక్షల నగదు, రెండు తులాల బంగారం, 30 తులాల వెండి చోరీకి గురైనట్లు తెలిపింది. కుటుంబ సభ్యులు తిరుపతికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు వివరించింది. మరో బాధితురాలు పద్మ తన భూమిని విక్రయించి వచ్చిన డబ్బుతో కొనుగోలు చేసిన 10 తులాల బంగారం, 50 తులాల వెండి ఈ నెల 27న చోరీకి గురైనట్లు వాపోయింది. రాంచందర్ ఇంట్లో జరిగిన చోరీలో నాలుగు తులాల వెండి, అర తులం బంగారం, రూ.21 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు వివరించాడు.

వెంగళ్‌రావు నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై వచ్చి అర్ధరాత్రి వరకు ఉంటున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బస్తీలో రాత్రివేళల్లో వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.

స్పందించిన తలసాని ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. రాత్రివేళల్లో ప్రతిరోజూ తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించాలని, రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను గుర్తించి విచారించాలని సూచించారు.

కష్టపడి సంపాదించిన సొత్తు చోరీకి గురైతే బాధితుల ఆవేదన

వర్ణనాతీతమని అన్నారు. బస్తీలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మూడు, నాలుగు రోజుల్లో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. బస్తీలో చీకటిగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏసీపీ శ్రీధర్, సీఐ సురేష్, ఎస్ఐలు గంగాధర్ తదితర పోలీసు అధికారులు, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, గాయత్రి, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
01 నవంబర్ 2026

అయ్యవారిపల్లి భూ వివాదంలో తహసీల్దార్ సునీత సస్పెన్షన్

- **రూ.4 కోట్ల భూ వ్యవహారంలో జనం సాక్షి ఎఫెక్ట్**
- **సర్వే నంబర్ 115లో అక్రమ భూ రికార్డుల మార్పులపై కలెక్టర్ కొరడా**
- **విచారణ నివేదిక ఆధారంగా చర్యలు..**
- **జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉత్తర్వులు**
- **13 ఎకరాల 17 గుంటల భూమి వ్యవహారంలో రెవెన్యూ అధికారుల విధులపై ప్రశ్నలు**

రూ.4 కోట్ల భూమి బదలాయింపుపై అనుమానాలు!

ఉప్పునుంతల, అక్టోబర్ 31 (జనం సాక్షి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల రెవెన్యూ శాఖలో సంచలనం సృష్టించిన అయ్యవారిపల్లి భూ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ కీలక చర్యలు చేపట్టారు. సుమారు రూ.4 కోట్ల విలువైన భూమికి సంబంధించిన రికార్డుల మార్పులు, అక్రమ నమోదుల వ్యవహారంలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు విచారణలో తేలడంతో ఉప్పునుంతల తహసీల్దార్ అద్దంకి సునీతను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొద్ది రోజులుగా జనం సాక్షి సహా పలు పత్రికల్లో వెలుగుచూసిన ఈ భూ వ్యవహారం చివరకు రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారుల చర్యలకు దారితీసింది.

వెలుగులోకి వచ్చిన భూ వ్యవహారం..

ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 115లో 13 ఎకరాల 17 గుంటల భూమి రికార్డుల మార్పులు, ఇతరుల పేర్లపై నమోదైనట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. సుమారు రూ.4 కోట్ల విలువైన ఈ భూమికి సంబంధించిన పాత రికార్డులు, కొత్త రెవెన్యూ రికార్డుల మధ్య వ్యత్యాసాలు ఉండటంతో భూమి అసలు యజమానులు ఎవరు? రికార్డుల్లో మార్పులు ఎలా జరిగాయి? అనే ప్రశ్నలు తలెత్తాయి.

ఈ వ్యవహారంపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలను పరిగణనలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాప్రాను విచారణ అధికారిగా నియమించడంతో ఆమె క్షేత్రస్థాయిలో, రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.

పాత రికార్డుల పరిశీలనలో కీలక అంశాలు..

విచారణలో భాగంగా పాత రెవెన్యూ రికార్డులు, పహాణీలు, ఖాస్రా, ఆర్ఓఆర్ రికార్డులు, భూ భారతి పోర్టల్‌లో నమోదైన దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన ఎన్‌కంబరెన్స్ వివరాలను అధికారులు పరిశీలించారు.

విచారణ నివేదిక ప్రకారం సర్వే నంబర్ 115లో మొత్తం 18 ఎకరాల 17 గుంటల భూమి ఉన్నట్లు పాత ఖాస్రా రికార్డుల్లో నమోదై ఉంది. 1971-72 నుంచి 1976-77 వరకు ఉన్న పాత పహాణీలు, ఐబీ రిజిస్టర్ ప్రకారం ఈ భూమి ద్యాప రామిరెడ్డి పేరుపై ఉన్నట్లు గుర్తించారు.

అయితే నూతన ఆర్ఓఆర్ రికార్డుల ప్రకారం 13 ఎకరాల 17 గుంటల భూమి సర్వే నంబర్ 115/ఏలో ద్యాప రామిరెడ్డి పేరుపై, మిగిలిన ఐదు ఎకరాల భూమి సర్వే నంబర్ 115/ఏఏలో పి. యాదమ్మ పేరుపై నమోదై ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.

భూ భారతి పోర్టల్ ద్వారా దాఖలైన పేర్ల మార్పు, సర్వే నంబర్ల ఉపవిభాగాల నమోదుకు సంబంధించిన దరఖాస్తులు, వాటికి జతచేసిన పత్రాలు, డిజిటల్ సంతకాల ప్రక్రియను సైతం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని నమోదులు అసలు రెవెన్యూ రికార్డులతో సరిపోలడం లేదని, సంబంధిత పత్రాల పరిశీలన, ధ్రువీకరణలో లోపాలు ఉన్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు.

విధుల నిర్వహణలో వైఫల్యం.. సస్పెన్షన్ వేటు!

ఈ వ్యవహారంలో అప్పట్లో చారకొండ తహసీల్దార్‌గా పనిచేసిన ఎ. సునీత, ప్రస్తుతం డిప్యుటేషన్‌పై ఉప్పునుంతల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె తనకు అప్పగించిన చట్టబద్ధమైన విధులను సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమైనట్లు విచారణ నివేదికలో పేర్కొనడంతో జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ చర్యలు చేపట్టారు.

తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) నిబంధనలు 1991లోని రూల్ 8(1)(ఎ) ప్రకారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణా విచారణ పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జనం సాక్షి కథనాలతో కదిలిన యంత్రాంగం!

అయ్యవారిపల్లి భూముల వ్యవహారంలో పాత రికార్డులు, కొత్త రికార్డుల మధ్య వ్యత్యాసాలు, కోట్లాది రూపాయల విలువైన భూమి నమోదులపై జనం సాక్షి గతంలో ప్రత్యేక కథనాలను ప్రచురించింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కథనాల ద్వారా ప్రశ్నించింది. తాజాగా జిల్లా కలెక్టర్ విచారణ నివేదిక ఆధారంగా తహసీల్దార్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడంతో ఈ వ్యవహారం మరోసారి జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

అయితే ఈ భూమికి సంబంధించిన రికార్డుల మార్పుల వెనుక ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది? సంబంధిత దరఖాస్తులు, పత్రాలను ఎవరు పరిశీలించారు? భవిష్యత్తులో ఈ భూమి అసలు హక్కుదారులకు న్యాయం జరుగుతుందా? అనే ప్రశ్నలకు పూర్తిస్థాయి విచారణలో సమాధానాలు రావాల్సి ఉంది. కోట్లాది రూపాయల విలువైన భూముల విషయంలో రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఎంత పారదర్శకంగా ఉండాలనే అంశాన్ని ఈ ఉదంతం మరోసారి గుర్తుచేస్తోంది.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించండి

- **ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్‌చెరు, అక్టోబర్ 31 (జనం సాక్షి) : పటాన్చెరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో మరిన్ని ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం పటాన్చెరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావులు హాజరై..ఆసుపత్రిని ప్రారంభించి, అందుబాటులోకి తీసుకువచ్చిన ఆధునిక వైద్య సదుపాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పటాన్చెరు పారిశ్రామికంగా, జనాభా పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. వైద్య సేవలు కేవలం ఆర్థిక స్థోమత కలిగిన వారికే పరిమితం కాకుండా పేదలకు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రి యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలతో పాటు పేదలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వెంకట్ ఆలపాటి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్, అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, పృథ్వీరాజ్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలి

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జనం సాక్షి) : ప్రజలకు పారదర్శ కంగా సేవలు అందించాలని జిల్లా ఎస్పి వినీత్ అన్నారు. నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా నారాయణపేట సబ్ డివిజ నల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, కార్యాలయం లోని రికార్డులు, రిజిస్టర్లు, పెండింగ్ ఫైళ్లు, కేసుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు పూర్తి పారదర్శకత, క్రమశిక్షణ,జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్ర ణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి కేసులో నిష్పక్షపా తంగా, నాణ్యతతో దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా పక్కాఆధారాలు సేకరించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశిం చారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును ప్రాధాన్యతతో చేపట్టి, నిర్ణీత 60 రోజుల గడువులోపు చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో,వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, మల్లేష్, బాలరాజు, స్టాఫ్ పాల్గొన్నారు.

జీవో తెస్తే రూ.25 కోట్ల డీడీ ఇస్తా..

- **మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సవాల్**

జడ్చర్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి) : జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి వ్యవహారంతో పాటు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, బిఆర్ఎస్ మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల పర్వం ముదిరింది. శనివారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ భవనాలను ముందే కూల్చవద్దని ఆయన హితవు పలికారు. సదరు స్థలాన్ని వైద్య శాఖకు కేటాయిస్తూ ప్రభుత్వం నుండి అధికారికంగా జీవో తీసుకువస్తే, శ్వేత ఫౌండేషన్ ద్వారా తాము రూ.25 కోట్ల డీడీ డిపాజిట్ చేయడానికి సిద్ధమని, ఆ తర్వాతే భవనాలు కూల్చాలని లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. ఆసుపత్రిలో సరైన వైద్యులు, సిబ్బంది లేకపోవడం వల్లే రోగుల సంఖ్య తగ్గుతోందని, ఎమ్మెల్యే బాధ్యతను విస్మరించి ప్రైవేట్ ఆసుపత్రులకు లాభం చేకూర్చేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. భూముల సేకరణ మరియు రంగారెడ్డిగూడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల స్థలాల కేటాయింపు అంతా చట్టబద్ధంగా రెవెన్యూ అధికారుల సమక్షంలో, భూ యజమానులకు డబ్బులు చెల్లించి రిలింక్విష్మెంట్ పద్ధతిలోనే జరిగిందని రికార్డులను ప్రస్తావించారు. గత ఎన్నికల్లో సొంత పార్టీ అభ్యర్థి మల్లు రవిని ఓడించేందుకు అనిరుధ్ రెడ్డి తనను హోటల్‌లో కలిశారని, వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఎమ్మెల్యే దేనని ఆరోపించారు. తనపై అసత్య విమర్శలు ఆపాలని హితవు పలికిన లక్ష్మారెడ్డి, చేతనైతే ఇద్దరం తమ పదవులకు రాజీనామా చేసి, ఏ పార్టీ బీ-ఫారం లేకుండా జడ్చర్ల బరిలో స్వతంత్ర అభ్యర్థులుగా తలపడదామని ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల్లో సింహభాగం తమ హయాంలోనే జరిగాయని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా ప్రజలకు పారదర్శక సేవలందించాలి

- **లంచం తీసుకోవడమే కాదు.. ఇవ్వడం కూడా నేరమే**
- **అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**
- **అవినీతి ఫిర్యాదులకు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064**

వనపర్తి, అక్టోబర్ 31 (జనం సాక్షి) : ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి దూరంగా ఉంటూ నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు నిస్వార్థంగా, పారదర్శకమైన సేవలందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సూచించారు. లంచం తీసుకోవడమే కాకుండా ఇవ్వడం కూడా చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026లో భాగంగా శనివారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. జిలానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతను గుర్తించి, నైతిక విలువలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. అవినీతికి అలవాటు పడితే అది వ్యసనంగా మారడమే కాకుండా, నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల ప్రతిష్ఠను కూడా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని పిలుపునిచ్చారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. జిలానీ మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అవినీతి నిరోధక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు నైతిక విలువలను పాటిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా లేదా అక్రమాలకు పాల్పడినట్లు తెలిసినా ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అవినీతి నిర్మూలన ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా బాధ్యతగా ముందుకు వచ్చి అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామిరెడ్డి, జెడ్పీ సీఈవో యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గద్వాల, అక్టోబర్ 31 (జనం సాక్షి) : హమాలీ, అసంఘటిత, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరి కోసం ప్రభుత్వం తక్షణమే ఒక సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం గద్వాలలోని లారీ, హమాలీ అడ్డా వద్ద ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక రంగంలో దశాబ్దాలుగా సేవలందిస్తున్నప్పటికీ, అసంఘటిత రంగ కార్మికులకు సరైన గుర్తింపు, భద్రత కరువయ్యాయని ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి కింది చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. గుర్తింపు కార్డుల జారీని, హమాలీ, కాంట్రాక్ట్ కార్మికులందరికీ ప్రభుత్వమే అధికారిక గుర్తింపు కార్డులు ఇవ్వాలని,కనీస వేతనాలు,ఉద్యోగ భద్రతను, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు, ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సామాజిక భద్రతను,కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటూ సామాజిక భద్రతా పథకాలను విస్తరించాలి. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఐటీయూసీ నాయకులు, పెద్ద సంఖ్యలో లారీ కార్మికులు, హమాలీలు పాల్గొన్నారు.

మెదక్‌ను కరువు జిల్లాగా ప్రకటించాల్సిందే..!

మెదక్, అక్టోబర్ 31 (జనం సాక్షి) : మెదక్ జిల్లాలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, వర్షాభావం, పంటల నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మెదక్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై మెదక్ సిటీజన్స్ ఫోరం, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(హెచ్143), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐజేయూ)రైతు స్వరాజ్య వేదిక, మెదక్ స్టడీ సర్కిల్ లు సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం లో వక్తలు మాట్లాడారు. సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి, టిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ అజయ్, సిపిఎం నేత మల్లేశం, బిఆర్ఎస్ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మానవ హక్కుల వేదిక నేత హైమద్ లు మాట్లాడుతూ కరువు పరిస్థితుల నిర్ధారణలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తీవ్ర అసంతృప్తి గా ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా మండలాలను ప్రాతిపదికగా తీసుకొని కరువు పరిస్థితులను అంచనా వేయడం వల్ల వాస్తవ పంట నష్టం వెలుగులోకి రావడం లేదని వారు అభిప్రాయపడ్డారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రామంలో పంటల సాగు, వర్షపాతం, దిగుబడి, నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను నిర్ధారించే విషయంలో ప్రభుత్వ విధానాల్లో శాస్త్రీయత లోపించిందన్నారు. ఒకే మండలంలో కొన్ని గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతింటే, మరికొన్ని గ్రామాల్లో పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. అలాంటప్పుడు మండలాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి కరువు తీవ్రతను నిర్ణయించడం వల్ల నష్టపోయిన రైతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలవారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి వాస్తవ పరిస్థితుల ఆధారంగా పంట నష్టాన్ని నిర్ధారించాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిధిలో మంజీరా నది ప్రవహిస్తున్నప్పటికీ మెదక్ రైతాంగానికి సాగునీటి కష్టాలు తప్పడం లేదని సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. మంజీరా జలాలను జిల్లాలోని వ్యవసాయ అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ కేటాయించాలని కోరారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సాగునీటి వనరులున్న ప్రాంతంలోనే రైతులు వర్షాధార వ్యవసాయంపై ఆధారపడాల్సిన పరిస్థితి మారాలని అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తగిన పరిష్కారాలు లభించడం లేదని వక్తలు విమర్శించారు. పంట నష్టాలు, సాగునీటి కొరత, కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు రైతులకు మేలు చేసే విధంగా ఉండాలని, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించరాదని హితవు పలికారు. మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం, కరువు సహాయక చర్యలు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకుంటే రైతులు, ప్రజాసంఘాలు, వివిధ వర్గాలను కలుపుకొని దశలవారీగా

ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సమావేశంలో పాల్గొన్న వక్తలు హెచ్చరించారు.

మెదక్ రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, కరువు సమస్యను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా రైతులకు ఆచరణాత్మకంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతంగానికి సంబందించిన 27 తీర్మాణాలను రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మైసయ్య యాదవ్, మెదక్ సిటీజన్స్ ఫోరం నాయకులు పిడి ఆనందం, భాగయ్య, బిసి సంఘం నేత బాలరాజ్ గౌడ్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (హెచ్ 143)జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు)మెంగర్తి సుధాకర్, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి లతో పాటు ఆయా పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కబ్జాలపై కన్నెత్తి చూడని అధికారులు

- సోషల్ మీడియాలో వైరల్ చేస్తే గాని స్పందించరా?

బెల్లంపల్లి, అక్టోబర్ 31, (జనంసాక్షి) : బెల్లంపల్లి పట్టణం 363 హై వే రోడ్డు పక్కన విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణల నేపథ్యంలో సోషల్ మీడియాలో కబ్జా పర్వం వైరల్ కావడంతో ఎట్టకేలకు అధికారులు దిగి వచ్చారు. వివరాల్లోకి వెళితే బెల్లంపల్లి పట్టణం కన్నాల ఫ్లైఓవర్ బ్రిడ్జి ఆనుకుని 363 హైవే రోడ్డు ఉంది. పక్కనే శివాంజనేయ విగ్రహం ఉంది. విగ్రహానికి ఆనుకొని కబ్జాల పర్వం మొదలైంది. అధికార పార్టీ నాయకులకు మామూళ్లు ఇచ్చుకొని అడ్డగోలుగా కబ్జాలకు పాల్పడుతున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈవిషయాన్ని అమెరికాలో ఉంటున్న తోడే వెంకటకృష్ణ రెడ్డి అనే టెక్కి స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో కబ్జా చేస్తున్న ఫోటోలను వైరల్ చేశాడు. అంతే కాకుండా స్థానిక అధికార పార్టీ నాయకునికి పెద్దమొత్తంలో ముడుపులు ముట్టాయని ఆరోపణలు చేయడం సంచలనం రేపింది. హైవే రోడ్డును ఆనుకొని కబ్జా చేస్తున్నా పట్టించుకోని సంబంధిత అధికారులు వాట్సాప్ గ్రూపుల్లో కబ్జా విషయం వైరల్ కావడంతో స్పందించారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ సంఘటన స్థలానికి చేరుకొని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు.

వాట్సాప్ లో వైరల్ అయితే గాని పట్టించుకోరా?

ప్రభుత్వ భూముల కబ్జాలను ఉక్కుపాదంతో అణిచి వేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల పన్నులతో ప్రతి నెల ఒకటో తేదీన ఠంచనుగా జీతాలు తీసుకుంటున్న అధికారులు విధుల నిర్వహణలో మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు. అందరి దృష్టికి వస్తే తప్ప చర్యలు తీసుకోవడం లేదని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త సీసాలో పాత సారా?

బెల్లంపల్లి నియోజకవర్గ పాలన కొత్త సీసాలో పాత సారా చందంగా మారిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల కబ్జా, అవినీతి, బందుప్రీతి రాజ్యమేలుతున్నాయని కాంగ్రెస్ కు పట్టం కడితే పాలన వచ్చిన మార్పేమి లేదని కొత్త సీసాలో పాత సారా చందంగా మారిందని అంటున్నారు. అప్పుడు బిఆర్ఎస్ లో చక్రం తిప్పిన నాయకులే కాంగ్రెస్ చేరి చక్రం తిప్పుతూ కబ్జాలు, అవినీతి, బందుప్రీతికి ప్రాముఖ్యం ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు తమ పంథా మార్చుకొని ప్రజా సేవే లక్ష్యంగా పని చేయాలని కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా అగ్రిస్టాక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి) : రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని జిల్లా స్థాయి అగ్రిస్టాక్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయంతో, సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశిం చారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అగ్రిస్టాక్ టాస్క్ ఫోర్స్ కమిటీతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో డిజిటల్ విధానాలను అమలు చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అర్హులైన రైతులందరికీ పారదర్శకంగా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సమాచారం, గణాంకాల నిర్వహణ ఎంతో కీలకమని, అందువల్ల వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, ఖచ్చితత్వంతో డేటాను నిర్వహించాలని సూచించారు. అగ్రిస్టాక్ ద్వారా వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఉద్యానవన శాఖ అధికారి రమణ, డీఆర్డీఓ విజయలక్ష్మి, సీపీఓ గంగారెడ్డి, డీసీఎస్ఓ రాజేందర్, డీవీఏహెచ్ఓ సురేష్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఎల్డీఎం రామ్ గోపాల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫామ్‌లోకి చొరబడిన భారీ కొండచిలువ

- 10 కోళ్లు మింగివేత!.. గోలేటిలో ఘటన..

రెబ్బెన, అక్టోబర్ 30 (జనంసాక్షి): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటిలో భారీ కొండచిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన సుల్వ రాజనర్సు పెంచుకుంటున్న కోళ్ల ఫామ్‌లోకి గత రాత్రి చొరబడిన కొండచిలువ సుమారు 10 కోళ్లను మింగినట్లు సమాచారం. డ్వాక్రా గ్రూపు ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకంలో పొందిన 25 కోడి పిల్లలను రాజనర్సు పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో రాత్రివేళ కోళ్ల ఫామ్‌లోకి ప్రవేశించిన భారీ కొండచిలువ కోళ్లపై దాడి చేసి సుమారు 10 కోళ్లను మింగినట్లు తెలిసింది. అనంతరం కదలలేని స్థితిలో అదే ఫామ్‌లో పడుకుని ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కోళ్ల పెంపకంపై ఆధారపడుతున్న బాధితుడికి ఈ ఘటనతో నష్టం వాటిల్లింది. కొండచిలువ ఫామ్‌లో ఉండటంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నారు. పామును సురక్షితంగా తరలించేందుకు సంబంధిత అటవీశాఖ అధికారుల సహాయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 31 (జనంసాక్షి) : దేశంలోని ప్రజలందరి ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యత దినోత్సవం అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో హాజరై వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుమారి గ్రామానికి ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణాధికారుల బృందం

నెరడిగొండ అక్టోబర్31 (జనంసాక్షి): మండల పరిధిలోని కుమారి గ్రామానికి ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణాదికారుల బృందం శనివారం రోజున చేరుకున్నారు.అక్టోబర్ 31నుండి నవంబర్ 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు వీరు ఈ గ్రామంలో పర్యటించి, ప్రభుత్వ శాఖల పనితీరుతో పాటు సంక్షేమ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న ,ఉప సర్పంచ్ ఆడేపు రవిల అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, పారిశుధ్య నిర్వహణను అధికారుల బృందం పరిశీలించనుంది. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏ మేరకు చేరుతున్నాయి? వారి జీవన ప్రమాణాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయి? గ్రామానికి ఇంకా ఎలాంటి పథకాలు, మౌలిక వసతులు అవసరమనే అంశాలపై ప్రజలతో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించనున్నారు. ఈ ఐదు రోజుల అధ్యయనం అనంతరం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు శిక్షణాధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నశిక్షణాధికారులు మనీషా నహోరా (ఐపీఎస్), ప్రద్యుమన్ సింగ్ బిట్టు (ఐఎఫ్ఎస్), అక్షయ్ కుమార్ శర్మ (ఐఎస్ఎస్), అనురాగ్ విమల్ వర్మ (ఐఎస్-ఎస్), మోహిత్ అగర్వాల్ (ఐఎఫ్ఎస్) పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు ఎంపీడీవో ఎం గంగసాగార్ రెడ్డి, డిపిఎం (డిఆర్డిఏ) కె వెంకటసాయి ప్రసాద్, ఏపీఎం జి. వెంకట్ రెడ్డి, ఏఈవో స్రవంతి, పంచాయతీ కార్యదర్శి దత్తహరి,గ్రామ వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్డీఓ కార్యాలయానికి స్థల గుర్తింపు వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): నూతన ఆర్డీఓ కార్యాలయ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ జీవో 76, జీవో 59 దరఖాస్తులు, హైకోర్టు కేసులు, పట్టభద్రుల ఓటరు నమోదు, ఆర్ అండ్ ఆర్, గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ పురోగతిని సమీక్షించారు. జీవో 59 దరఖాస్తుల విచారణకు మండలాల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి చెక్‌లిస్ట్ ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలని, హైకోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ భవేశ్ మిశ్రాకు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల సంఘీభావం

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి) : భైంసా పురపాలక సంఘ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ అమలుపై నిర్వహించిన సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాపై పలువురు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం టీజీఈజేఈసీ, పెన్షనర్ల సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో నిజాయితీ, నిబద్ధత కలిగిన ఐఏఎస్ అధికారిగా గుర్తింపు పొందిన కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న అధికారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. భైంసా పట్టణ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న కలెక్టర్‌కు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలు ఎల్లవేళలా అండగా ఉంటాయని స్పష్టం చేశారు. కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించినా, అనుచిత వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఈసీ గౌరవాధ్యక్షుడు ఎం.సి. లింగన్న, ఛైర్మన్ వి. ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పి.సి. రెడ్డి, టీజీవో ప్రధాన కార్యదర్శి రమేష్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి రవికుమార్, పెన్షనర్ల సంఘం నాయకులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒమన్ జైలు నుంచి కార్మికుడి విడుదలకు ఎమ్మెల్యే చొరవ

నిర్మల్ రూరల్, అక్టోబర్ 31 (జనంసాక్షి) : ఒమన్ దేశంలో చిక్కుకున్న నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్‌కు చెందిన గుమ్ముల సాయన్నను స్వదేశానికి రప్పించేందుకు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఉపాధి కోసం ఒమన్ వెళ్లిన సాయన్న అక్కడి కార్మిక శాఖ అధికారుల అదుపులోకి వెళ్లి రువీ జైలులో ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపారు. తెలంగాణ సీఎస్ కార్యాలయం ద్వారా కేంద్ర విదేశాంగ శాఖ, మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయానికి సమాచారం పంపించి సాయన్నను సురక్షితంగా స్వదేశానికి రప్పించాలని కోరారు. ఎమ్మెల్యే చొరవపై బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కరువుపై పాలకులకు శాస్త్రీయమైన అంచనా ఉందా?

- వరంగల్ జిల్లాను అత్యంత కరువు జిల్లాగా ప్రకటించాలి
- తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని నవంబర్ 4న కలెక్టరేట్ వద్ద ధర్నా

వరంగల్ ప్రతినిధి అక్టోబర్ 31 (జనంసాక్షి): ప్రభుత్వం కరువుపై శాస్త్రీయంగా అంచనా వేయకుండా అశాస్త్రీయంగా కరువు మండలాలను ప్రకటించి పెరుగుతున్న కరవు తీవ్రతతో అల్లాడుతున్న జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. శనివారం ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 365 కరువు మండలాలను ప్రకటించి 111 మాత్రమే అత్యంత కరువు మండలాలుగా ప్రకటించడం దారుణం అన్నారు. వరంగల్ జిల్లాలో 13 మండలాల్లో కరువు తీవ్రత పెరుగుతున్నట్లు అధికారుల గణాంకాలే తెలియజేస్తున్నప్పటికీ కేవలం ఎనిమిది మండలాలను మాత్రమే స్వల్ప తీవ్రత కరువు మండలాలుగా ప్రకటించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసినప్పటికీ పంటలు ఎండిపోయి దిగుబడి తగ్గి పెట్టుబడి సైతం రాని స్థితి నెలకొన్నదని మరోవైపు వ్యవసాయ కూలీలకు కార్మికులకు పని లేక ఇబ్బందులు పడుతున్న స్థితిలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వరంగల్ జిల్లాను అత్యంత కరువు ప్రాంతంగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ క్రమంలో నవంబర్ 4న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా కరువును శాస్త్రీయంగా అంచనా వేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను కూలీలను ఆదుకునే విధంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోనె కుమారస్వామి కన్నం వెంకన్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాలోతు సాగర్ నర్ర ప్రతాప్ కుసుంబా బాబురావు భాష పాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కూల్చిన ఇండ్ల సామాగ్రి దొంగల పాలు

మల్హర్,అక్టోబర్ 31(జనంసాక్షి) : మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామపంచాయతీ పరిధిలో ఆమ్లెట్ విలేజైన సత్రాజ్ పల్లి గ్రామంలో అక్టోబర్ 10న అర్ధరాత్రి రెవిన్యూ, సింగరేణి, ఫారెస్ట్ అధికారులు అక్రమంగా ఎలాంటి సమాచారం లేకుండా దాదాపు 370 గృహాలను కూల్చిన అధికారులు, బాధిత నిర్వాసితులైన గడ్డం తిరుపతి యాదవ్, చొప్పరి సారయ్య, చిగురు తిరుపతి, సంపత్, రమేష్, సుకరి చంద్రయ్య, ప్రశాంత్ తదితరులు తమ ఇండ్లను కూల్చిన అధికారులు వారే రక్షణగా ఉండాల్సిందిగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూల్చిన ఇండ్లలోని కర్రలు, తలుపులు, కిటికీలు అన్ని దొంగల పాలవుతున్నాయని నిర్వాసితులు ఆపోయారు. దీనికి బాధ్యులైన అధికారులపై ఉన్నత న్యాయస్థానంలో న్యాయ పోరాటం చేయనున్న మనీ బాధితులు గడ్డం తిరుపతి యాదవ్ అన్నారు. కూల్చిన ఇండ్లపై త్వరలో ఎస్టిమేషన్ వేసి న్యాయ ప్రక్రియ మొదలు పెడతామని తెలిపారు.

మంచిర్యాలలో ఆకస్మిక తనిఖీలు..

- గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు:
- గంజాయి సేవించే, సరఫరా చేసే యువకులకు అర్ధరాత్రి సీపీ కౌన్సెలింగ్
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 31 (జనంసాక్షి) : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం అర్ధరాత్రి మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీ,వికాస్ నగర్ ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి తనిఖీలు నిర్వహించారు. గతంలో గంజాయి సేవించడం,సరఫరా చేయడం వంటి నేరాలకు పాల్పడి కేసులు నమోదైన యువకుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి, గంజాయి వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ,సామాజిక దుష్పరిణామాలను వివరించారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఇతరులను కూడా వాటి వినియోగానికి ప్రోత్సహించవద్దని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, గంజాయి సేవించడం వల్ల మొదట నష్టపోయేది వారేనని,వారి ఆరోగ్యంతో పాటు కుటుంబ గౌరవం, భవిష్యత్తు కూడా దెబ్బతింటాయని తెలిపారు.కొద్దిపాటి డబ్బు కోసం గంజాయిని సరఫరా చేస్తూ ఇతర యువత జీవితాలను నాశనం చేయడం సరికాదన్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి యువతకు సరఫరా చేసే వ్యక్తులను గుర్తించి,వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటిసారి గంజాయి వినియోగానికి పాల్పడిన యువకుల్లో మార్పు తీసుకురావడానికి పోలీస్ శాఖ తరపున కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు,అవసరమైన వారికి డీ-అడిక్షన్ సహాయం అందిస్తామని తెలిపారు.అయితే యువతను గంజాయి వ్యసనానికి ప్రోత్సహించే, సరఫరా చేసే వ్యక్తులపై ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి మత్తులో రోడ్లపై గొడవలు చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం వల్ల ప్రజల్లో భయాందోళనలు ఏర్పడతాయని, ముఖ్యంగా చిన్నారులపై ప్రతికూల ప్రభావం పడుతుందని సీపీ పేర్కొన్నారు. యువకులు తమ ప్రవర్తనను మార్చుకుని కుటుంబ సభ్యులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. యువతకు మంచి భవిష్యత్తు కల్పించేందుకు పోలీస్ శాఖ సహకరిస్తుందని సీపీ తెలిపారు.ఉపాధి, నైపుణ్య శిక్షణ, డీ-అడిక్షన్ వంటి అవసరాల్లో తగిన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. గంజాయి వినియోగం, సరఫరాపై నిరంతర నిఘా కొనసాగించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి సీపీ ఆదేశించారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గంజాయి సరఫరా మూలాలను గుర్తించి అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మంచిర్యాల పట్టణ ఎస్సైలు ఆది మధుసూదన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
01 నవంబర్ 2026

నల్లగొండ క్లాక్ టవర్‌కు మహర్ధశ..

- **సుందరీకరణకు రూ.197.44 కోట్ల నిధులు:**
- **ఆధునిక హంగులతో క్లాక్ టవర్ సెంటర్ అభివృద్ధి..**
- **కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక**
- **సుందరీకరణ నమూనాను ఆవిష్కరించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి**

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 31 (జనం సాక్షి) : నల్లగొండ నగర అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది.నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన క్లాక్ టవర్ సెంటర్‌కు మహర్దశ పట్టనుంది. క్లాక్ టవర్ సెంటర్‌ను ఆధునిక హంగులతో సుందరీకరించి,అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.197.44 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్‌తో పాటు పలు ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో క్లాక్ టవర్ సెంటర్ అభివృద్ధి నమూనా మోడల్‌ను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, కార్పొరేటర్లతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నల్లగొండ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు రూ.197.44 కోట్లు మంజూరు కావడం నగర చరిత్రలో కీలక పరిణామమని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.138.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.59.23 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. క్లాక్ టవర్ సెంటర్‌లోని పాత ఆర్ అండ్ బి కార్యాలయ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్ నిర్మించడంతో పాటు క్లాక్ టవర్ పరిసరాలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర ప్రజలకు మెరుగైన షాపింగ్, వినోద సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, స్థానిక వ్యాపారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు. వాణిజ్య కార్యకలాపాలు పెరిగి నగర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్లగొండ పట్టణంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మేయర్ తెలిపారు. పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు, సాగర్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు లైన్ల రహదారి విస్తరణకు రూ.20 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రూ.100 కోట్లతో సయ్యద్ లతీఫుల్లా ఖాద్రి గుట్ట, బ్రహ్మంగారి గుట్టలకు ఘాట్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ అభివృద్ధి పనులు పూర్తయితే నల్లగొండ నగరం పర్యాటక, ఆధ్యాత్మిక, వాణిజ్య రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నల్లగొండ మున్సిపల్ పాలకవర్గం, నగర ప్రజల తరపున మేయర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, కార్పొరేటర్లు కేసాని వేణుగోపాల్ రెడ్డి, గుమ్ముల జానకి మోహన్ రెడ్డి, ఇబ్రహీం, ఆలకుంట్ల నాగరాజు, అబ్బగోని కవితా రమేష్ గౌడ్, బొజ్జ శంకర్, ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, ఇటికాల మంగమ్మ శ్రీనివాస్, పెరిక స్వాతి, ఆలకుంట్ల ఝాన్సీ, అల్లి సుభాష్ యాదవ్, రేగట్టే అండాలు, పున్న జ్ఞానేశ్వరి, పాలకూరి సుమలత, గోగుల గణేష్, వజ్జ సంతోషిని, గుండెబోయిన పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ విద్యార్థిని ఆత్మహత్య

- **ప్రేమ పేరుతో వేధింపులు**

కామేపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) : ప్రేమ పేరుతో వేధించడమే కాకుండా,పెళ్లి చేసుకోవాలంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చి మానసిక హింసకు గురిచేయడంతో తట్టుకోలేక ఓ పారామెడికల్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న తీవ్ర విషాద సంఘటన మండలంలోని కొత్త లింగాల గ్రామంలో చోటు చేసుకుంది. కామేపల్లి ఎస్సై శ్రీకాంత్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని కొత్త లింగాల గ్రామానికి చెందిన యువతి (21) ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ మొదటి సంవత్సరం చదువుతుంది. అదే కళాశాలలో అదే కోర్సు ప్రథమ సంవత్సరం చదువుతున్న ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ అనాస్ అనే విద్యార్థి కొంతకాలంగా ఆ విద్యార్థిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు తనను పెళ్లి చేసుకోవాలని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాడు. ఈ నేపద్యంలో అక్టోబర్ 23వ తేదీన ఏవిధంగానైనా తనను పెళ్లి చేసుకోవాలని సయ్యద్ అనాస్ ఆ విద్యార్థినిపై తీవ్ర ఒత్తిడి చేసి ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి, మానసిక క్షోభకు గురైన ఆ యువతి అక్టోబర్ 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు (పేస్ట్) తినేసింది. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపి.శ్రీకాంత్ విలేకరులకు తెలిపారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగిపై కత్తితో దాడి

వైరా, అక్టోబర్ 31 (జనం సాక్షి) : వైరా పట్టణంలోని బి.పి. అగ్రహారం ప్రాంతంలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగుల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ఒక ఉద్యోగిని పై మరో ఉద్యోగి కత్తితో దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి. తేజ శ్రీ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. అదే బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పిల్లి ప్రదీప్‌తో గత కొంతకాలంగా పరిచయం ఉంది. అయితే గత కొన్ని రోజులుగా ప్రదీప్ ప్రవర్తనలో మార్పు రావడంతో తనకు దూరంగా ఉండాలని తేజ సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 31వ తేదీ మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో తేజ విధుల్లో ఉండగా ప్రదీప్ కూరగాయలు కోసే కత్తితో ఒక్కసారిగా దాడికి ప్రయత్నించినట్లు ఈ క్రమంలో అడ్డుకునే ప్రయత్నం చేయగా తేజ శ్రీ కుడిచేతి వేలికి, ఎడమ చేతికి గాయాలయ్యాయని, కుడి చెంపపై కూడా గాయమైందని తెలిపారు. బ్యాంకు బ్రాంచ్ మేనేజర్, హబ్ మేనేజర్ అక్కడికి చేరుకుని తనను రక్షించారని, అనంతరం గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఫిర్యాది పేర్కొని . తనను చంపేస్తానని ప్రదీప్ బెదిరించినట్లు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ ఎస్ ఐ పుష్పాల రామారావు తెలిపారు.

అక్టోబర్ నెలలో 113 శాతం ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా

మణుగూరు, అక్టోబర్ 31 (జనంసాక్షి) : అక్టోబర్ నెలలో ఎల్‌నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదు కావడంతో బొగ్గు ఉత్పత్తి పెరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పేర్కొన్నారు.శనివారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఉత్పత్తి ఉత్పాదకత పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... అక్టోబర్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 8 లక్షల 78 వేల 500 టన్నులకు గాను 9 లక్షల 94 వేల 738 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడమైనది. అక్టోబర్ నెలలో సాధించిన ఉత్పత్తి 113 శాతం. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 31 అక్టోబర్, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 53 లక్షల 46 వేల 500 టన్నుల లక్ష్యానికి గాను 71 లక్షల 74 వేల 380 టన్నులు సాధించడం జరిగింది అనగా 134 శాతం సాధించడం జరిగింది. అక్టోబర్ నెలలో మణుగూరు ఏరియా 9 లక్షల 60 వేల 638 టన్నులను రవాణా చేయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 31 అక్టోబర్, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ గా 71 లక్షల 98 వేల 109 టన్నులు రవాణా చేయడం జరిగింది. ఆగస్టు నెలలో ఓవర్ బర్డెన్ మన డిపార్ట్ మెంటల్ గా 13 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 83 శాతం తో 10 లక్షల 79 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 31 అక్టోబర్, 2026 వరకు 77 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 64 లక్షల 10 వేల క్యూబిక్ మీటర్ల అనగా 83 శాతం తీయడం జరిగింది.
పదవి విరమణ/మెడికల్ డెత్ అయిన ఉద్యోగులకు ఈ క్రింది విధంగా చెల్లింపులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్సు టీఎం డి వెంకట రామారావు , ఏటిఎం (ఐఈడి) సిహెచ్.రాంబాబు , ఏజిఎం (ఏర్పనల్) ఎస్. రమేశ్ , పీకే ఓసి 4 ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, ఈ ఈ. ఈ. శ్రీనివాస్, శ్రీనివాస్, డిటిఎం (సర్వే) ఎల్. దయాకర్ , డివై, సీఎంఓ డా. జ్యోతిర్మాయి, సీనియర్ ఎస్టేట్స్ అధికారిని కె. స్వప్ప , పర్యావరణ అధికారి జె. శ్రీనివాస్ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్ , డివై. పిఎం బి. శ్యామ్ ప్రసాద్, ఎక్సిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకులతో వన్యప్రాణుల వేటకు యత్నం

- **ముగ్గురు నిందితుల అరెస్ట్**
- **రెండు నాటు తుపాకులు, మందుగుండు సామగ్రి స్వాధీనం**

దమ్మపేట, అక్టోబర్ 31 (జనం సాక్షి) : దమ్మపేట మండలం చెన్నువారిగూడెం గ్రామ శివారు ప్రాంతంలో నాటు తుపాకులతో అడవి జంతువులను వేటాడేందుకు వెళు న్న ముగ్గురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు నాటు తుపాకులు, గన్‌పౌడర్,ఇనుప గుండ్లు సహా ఇతర మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.కారం నాగేంద్రబాబు(34),కారం చిట్టిబాబు(27), మోడియం సురేంద్రబాబు(25).అనే ముగ్గురు వ్యక్తులు గత కొంతకాలంగా తమ వద్ద ఉన్న నాటు తుపాకులతో సమీప అటవీ ప్రాంతాల్లో అడవి జంతువులను వేటాడుతున్నట్లు గుర్తించారు.ఈ క్రమంలో చెన్నువారిగూడెం గ్రామ శివారు ప్రాంతంలో వారిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుంచి రెండు నాటు తుపాకులు,సుమారు 100 గ్రాముల నల్లటి గన్‌పౌడర్,37 చిన్న ఇనుప గుండ్లు, ఇతర మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించి మరో వ్యక్తి పెనుబల్లి శ్రీను ఇప్పటికే దమ్మపేట పోలీస్

స్టేషన్‌లో నమోదైన మరో కేసులో అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

వన్యప్రాణుల వేటకు పాల్పడితే కఠిన చర్యలు

అడవి జంతువులను వేటాడటం,వాటి మాంసాన్ని అక్రమంగా విక్రయించడం చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేశారు.వన్యప్రాణులకు హాని కలిగించే అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అటవీ సంపద,వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు పోలీసు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.ఈ చర్యల్లో అశ్వారావుపేట సీఐ నాగరాజు,దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నవ జాత శిశువు లభ్యం

పాపన్నపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి) : ఓ నవ జాత శిశువు లభ్యమైన ఘటన మెదక్ జిల్లాలో వెలుగు చూసింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. పోడ్చన్ పల్లి తాండా వద్ద ఇండ్ల వెనక గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగ శిశువును శనివారం ఉదయం వదిలి వెళ్లగా తండా వాసులు గమనించి పోలీసులకు, ఐసీడీఎస్,సీడబ్ల్యూసీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు,పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని పసిబిడ్డను అక్కడి నుంచి మెదక్ లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ లోని ప్రభుత్వ నిలోఫర్ ఆస్పత్రికీ తరలించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కేసు నమోదైంది.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

- **శిథిలావస్థకు చేరిన భవనం..**
- **విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కరువు**
- **పాఠశాలను పరిశీలించి విద్యార్థినులను పరామర్శించిన సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**
- **మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేయాలి**

బోనకల్, అక్టోబర్ 31 (జనం సాక్షి) : ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో అపరిశుభ్రత, భవన నిర్వహణ లోపాలు ఒకవైపు ఉంటే.. మరోవైపు శిథిలావస్థకు చేరిన భవనం విద్యార్థినుల ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. పాఠశాలలోని తొమ్మిదో తరగతి గదిలో శనివారం స్లాబ్ పెచ్చులు ఊడి పడటంతో ఇద్దరు విద్యార్థినులు గాయపడిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో పూజిత, కీర్తన అనే ఇద్దరు విద్యార్థినులకు గాయాలయ్యాయి. దీంతో తోటి విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ప్రమాదకరంగా మారిన పాఠశాల భవనం
పాఠశాల భవనాన్ని పరిశీలిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. తరగతి గదుల పైకప్పుల నుంచి సిమెంట్ పెచ్చులు పెద్ద ఎత్తున ఊడిపోవడంతో పాటు లోపల ఉన్న ఇనుప చువ్వలు సైతం బయటకు కనిపిస్తున్నాయి. పైకప్పు పలుచోట్ల పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరినట్లు ఫొటోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. వరండా పైకప్పుపై కూడా పొడవైన పగుళ్లు ఏర్పడి పెచ్చులు ఊడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థినులు ప్రతిరోజూ తరగతి గదుల్లో చదువుకోవాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థినులకు గాయాలైన విషయం తెలుసుకున్న బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ గురుకుల పాఠశాలకు చేరుకుని గాయపడిన విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం పాఠశాల భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. భవనం పైకప్పుల పరిస్థితి, పెచ్చులు ఊడిపడుతున్న ప్రాంతాలను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థినులు చదువుకునే తరగతి గదుల్లోనే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. చిన్నారులకు మరోసారి ఇలాంటి ప్రమాదం జరగకుండా

అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. తదుపరి క్లాసులు భవనం మరమ్మతులు చేపట్టే వరకు విద్యాభ్యాసం ఆగకుండా వేరే చోట విద్యార్థులకు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేయాలి

పాఠశాల భవనం పరిస్థితిని ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న తరగతి గదులకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సర్పంచ్ కోరారు. విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

657 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

- **వారం రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించాలి**
- **100రోజుల్లో పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి) : అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 319 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 657 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.శనివారం సూర్యాపేటలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.పట్టాలు పొందిన లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, 100 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. బేస్‌మెంట్, లింటెల్, రూఫ్ లెవల్ దశల్లో నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు.ప్రతి దశలో నిర్మాణ ఫొటోలను అధికారులకు అందజేయాలని సూచించారు.వచ్చే

జనవరి 26 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని కోరారు.ఇందుకు జిల్లా యంత్రాంగం, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.ఇళ్ల మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, అవకతవకలను సహించబోమని హెచ్చరించారు.

పేదల సొంతింటి కల నిజం చేస్తాం

ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.సూర్యాపేట మున్సిపాలిటీకి 657 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో పథకం అమలవుతోందని చెప్పారు.గతంలో మాజీ మంత్రి దివంగత దామోదర్ రెడ్డి హయాంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న వారు ఇప్పటికీ సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు.ప్రస్తుతం ఇళ్లు మంజూరైన వారు కూడా నాణ్యమైన ఇళ్లు నిర్మించుకుని కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఇళ్ల నిర్మాణాలతో మేస్త్రీలు, కూలీలు, పెయింటర్లు, నిర్మాణ సామాగ్రి వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని తెలిపారు.సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం సుమారు 3100 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, అర్హులకు త్వరలో పెన్షన్లు అందిస్తామని వెల్లడించారు. అర్హులైన పేదలు, వృద్ధులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, హౌసింగ్ పిడి జబ్బర్ మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్ల, ఎఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్, వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకి సత్వరమే న్యాయం అందాలి

తెలంగాణ రాష్ట్ర గౌరవ హై కోర్టు జడ్జి గాడి ప్రవీణ్ కుమార్

మెదక్ బ్యూరో, అక్టోబర్ 31 (జనం సాక్షి) : కక్షిదారులకి సత్వరమే న్యాయం అందలనీ తెలంగాణ రాష్ట్ర గౌరవ హై కోర్టు జడ్జి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం నర్సాపూర్ లో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నర్సాపూర్ కోర్టు ప్రాంగణానికి చేరుకున్న గౌరవ హైకోర్టు జడ్జికి పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.కోర్టు ప్రాంగణంలో గౌరవ హైకోర్టు జడ్జి మొక్కను నాటి , నీళ్లు పోశారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ హైకోర్టు జడ్జి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... కక్షిదారులకి సత్వరమే న్యాయం అందాలన్నారు. ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి మెదక్ జిల్లా న్యాయమూర్తి నీలిమ మాట్లాడుతూ.. నర్సాపూర్ పరిసర ప్రాంత ప్రజలకు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి త్రాగునీటి ఇబ్బంది తీర్చాలని, కక్షిదారులకు మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా అతి తక్కువ ధరలో భోజనం ఏర్పాటు చేయించాలని జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గౌరవ హైకోర్టు జడ్జి ప్రవీణ్ కుమార్‌ని జిల్లా జడ్జీలు, బారసోసియేషన్ సభ్యులు మెమెంటో అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో .జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ , ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, శుభవల్లి అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి మెదక్, రూబీనా ఫాతిమా సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అతరిటీ మెదక్ , శ్రీ సాయి ప్రభాకర్ మెదక్ మొబైల్ కోర్ట్, సుచరిత జూనియర్ సివిల్ జడ్జి అల్లదుర్గ, హేమలత జూనియర్ సివిల్ జడ్జి నర్సాపూర్ ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ,బార్ మెంబర్స్ , వివిధ అడ్వకేట్ బార్ అసోసియేషన్స్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
ఆదివారం 01.11.2026

సురక్షిత్ బచ్చన్ అభియాన్‌పై అవగాహన

పెద్దపల్లి,అక్టోబర్ 31(జనంసాక్షి) :
సురక్షిత్ బచ్చన్ అభియాన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శనివారం అదనపు జిల్లా న్యాయమూర్తి స్వప్న రాణి అధ్యక్షతన నిమ్మనపల్లిలోని పల్లవి స్కూలులో పోక్సో చట్టం 2012 మరియు బాలల హక్కుల పరిరక్షణ వేధింపుల నివారణ లక్ష్యంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ అవగాహన సదస్సులో విద్యార్థులకు ఫోక్సో చట్టం, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతఅలాగే బాలలపై జరిగే లైంగిక వేధింపులు నివారణ మరియు అందుబాటులో ఉన్న బాల బాలికలకు రక్షణ వ్యవస్థ గురించి చాలా సులభంగా అర్థమయ్యే రీతిగా వివరించారు బాల బాలికలకు ఎదురయ్యే వేధింపులను అరికట్టడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాఠశాల యజమాన్యాలు మరియు పోలీసు ఎంతో కీలకమని తెలిపారు అలాగే బాల బాలికలు ఏదైనా వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులకు గాని స్కూల్లో ఉన్న ఉపాధ్యాయులకు గాని దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో గాని లేదా నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వచ్చి సమస్యలను వివరిస్తే న్యాయ సేవ ద్వారా సహాయము అందిస్తామని తెలిపారు. అలాగే బాలల కొరకు 1098, న్యాయం సహాయం కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తెలుపగలరని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిజ కోహిర్కర్, కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పెద్దపెల్లి, శ్రీనివాస్, సంకీర్తన లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు, నరేష్ కల్చరల్ సెక్రెటరీ, శరత్, ఝూన్సీ మహిళా న్యాయవాదుల విభాగం పెద్దపల్లి పాల్గొన్నారు.రమా,కల్పన,శ్యామల,డిసిపిఓ సిబ్బంది,శోభారాణి స్కూల్ కరస్పాండెంట్ వాణి ప్రిన్సిపల్ మరియు టీచర్లు పాల్గొన్నారు.

నవంబరు 3న నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఫ్లాట్లకు లాటరీ

హైదరాబాద్(జనంసాక్షి):
కోర్ అర్బన్‌లోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల కేటాయింపు కోసం నవంబరు 3న డ్రా తీయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. ముషీరాబాద్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్లలో ఫ్లాట్లకు డ్రా తీయనున్నారు. గతంలో 16 నియోజకవర్గాల్లో కేటాయించిన ఫ్లాట్లలో వివిధ కారణాలతో రద్దయిన వాటికి నవంబరు 4న మాప్ అప్ (చివరి దశ) లాటరీ తీయనున్నట్లు తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తుల్లో ఆయా నియోజకవర్గాల్లోనే లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో కొందరిని అనర్హులుగా గుర్తించగా.. మరికొందరు డబ్బులు చెల్లించలేదు. వివిధ కారణాలతో గతంలో కేటాయించిన ఇళ్లను రద్దు చేసి.. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి నవంబరు 4న లాటరీ ద్వారా కేటాయించనున్నారు. రెండు లాటరీల ప్రక్రియలు ఆన్‌లైన్‌లో ఉంటాయని తెలి పింది.

నీటిని పొదుపును పాటించాలి

అందుబాటులో ఉన్న నీటి వనరులను తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం : కలెక్టర్ ఇలా త్రిపాఠి,

ఆర్‌ఓబీల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలి:ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):
ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు నీటి పొదుపును పాటించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్విండ్ సూచించారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే మాధవనగర్, అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయించాలని, రానున్న నాలుగైదు నెలల్లో వీటిని అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యా లయాల సముదాయం సమావేశ మందిరంలో శనివా రం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమ న్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. అంతకుముందు గత సమావేశంలో చేసిన తీర్మానాలపై చేపట్టిన చర్యల గురించి అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ విషయమై ప్రజల్లో, రైతులలో విస్తృత స్థాయి లో అవగాహన కల్పించాలన్నారు. కాగా, మాధవనగర్, అర్సపల్లి ఆర్.ఓ.బీల నిర్మాణాలలో ఎనలేని తాత్సారం జరుగుతోందని ఎం.పీ సంబంధిత అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. మైల్ స్టోన్ ప్రకారం నిర్విరామంగా పనులు జరిపిస్తూ నాలుగైదు నెలలలో పూర్తి చేయించాలని, మరోమారు గడువు పొడిగింపుకు ఉండకూడదని ఆర్ అండ్ బీ, రైల్వే అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను కూడా వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా మెరుగుదల పనులను, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుండి కేటాయించబడిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ, నిర్దేశిత గడువులోగా ప్రజోపయోగ పనులు పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నిధులను విద్యార్థులకు అందించారా అని ఎం.పీ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే విద్యార్థుల బ్యాంకు ఖాతాలలో నేరుగా ఉపకార వేతనాలను జమ చేయించామని సంక్షేమ శాఖల అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు. కాగా, డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలకు జిల్లా యంత్రాంగం చొరవతో ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాను వేదికగా ఎంపిక చేయడం పట్ల ఎం.పీ అర్వింద్ హర్షం వెలిబుచ్చారు. క్రీడా పోటీల విజయవంతానికి, జిల్లాలో క్రీడా సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి పూర్తి స్థాయిలో సహకారం అందేలా కృషి చేస్తానని అన్నారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎల్ నినో ప్రభావం గురించి వివరిస్తూ, అధికార యంత్రాంగం తరపున చేపడుతున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. అదృష్టవశాత్తు ఖరీఫ్ సీజన్ లో వాతావరణ పరిస్థితులు అనుకూ లించడంతో జిల్లా రైతాంగం గట్టెక్కగలిగారని అన్నారు. అయితే ప్రస్తుతం యాసంగిలో మాత్రం పంటలకు సాగునీరు అందించే పరిస్థితి లేదని, ఈ మేరకు ప్రభుత్వం కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. వర్షాభావం, ఇతర పరిస్థితులను పరిగణలోకి తీసుకుని జిల్లాలోని 18 మండలాలలో సాధారణ కరువు నెలకొని ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రబీలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, పప్పు దినుసులు వంటి ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రైతులకు రాయితీపై ఆరుతడి పంటల విత్తనాలు అందిస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో వీటిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే జూన్, జూలై మాసాల వరకు కూడా వర్షాలు కురిసే పరిస్థితి లేనందున ప్రస్తుతం జలాశయాల్లో నిలువ ఉన్న నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ స్పష్టం చేశారు. గత ఏడాది శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇదే సమయానికి 80 టీ.ఎం.సీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 35 టీ.ఎం.సీలకే పరిమితం అయ్యిందన్నారు. అదేవిధంగా నిజాంసాగర్ రిజర్వాయర్ లోనూ గతేడాది 17 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 9 టీ.ఎం.సీలు మాత్రమే ఉందన్నారు. ప్రతికూల పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టం సైతం వేగంగా పడిపోతోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని కోరారు. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీ.ఆర్.ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీకి మరో వాయు‘గండం’

అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి(జనంసాక్షి): అర్నబ్ తుపాను నష్టం నుంచి కోలుకోక ముందే ఆంధ్రప్రదేశ్‌కు మరో తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో ఇది కేంద్రీకృతమైంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశముంది. రేపు సాయంత్రానికి తుపానుగా మారి.. ఎల్లుండి సాయంత్రానికి తీర ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనావేస్తోంది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

పలు జిల్లాల్లో భారీ వర్షాలు...
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రస్తుతం శ్రీవిజయపురానికి 330 కి.మీ, నికోబార్‌కు 300 కి.మీ, చెన్నైకి తూర్పు- ఆగ్నేయ దిశలో 1140 కి.మీ, మచిలీపట్నానికి ఆగ్నేయ దిశలో 1200 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో వచ్చే మూడు రోజులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. ఆదివారం కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమవారం ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు, తూర్పుగోదావరి, కోనసీమ, నంద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. మంగళవారం.. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ అతిభారీ వర్షాలు, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు.

అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపటికి తుపానుగా బలపడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రంలో ఉన్నతాధికారులతో వాతావరణ పరిస్థితులు, ఆర్నబ్ తుపాను అనంతరం కొనసాగుతున్న పునరుద్ధరణ పనులపై సీఎం సమీక్షించారు. మరో తుపాను ప్రభావంతో గుంటూరు దిగువన ఉన్న దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. నవంబరు 2, 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమీక్షలో ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌తో పాటు విద్యుత్, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులు, వివిధ టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి,అక్టోబర్ 31(జనంసాక్షి) :
కాల్వ శ్రీరాంపూర్ మండలం మల్యాల గ్రామంలో మాజీ సర్పంచ్ జెక్కె రవీందర్ తల్లి మాజీ సర్పంచ్ జెక్కె చంద్రమ్మ మరణించగా విషయం తెలిసిన దాసరి ఉష వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తదనంతరం చంద్రమ్మ చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు.తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే ఓదెల మండలం కనగపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాళ్ల పల్లి లక్ష్మణ్ సోదరుడు తాళ్లపల్లి రమేష్ అనారోగ్యంతో మరణించగా ఈ విషయం తెలుసుకున్న దాసరి ఉష వారి నివాసానికి వెళ్లి భౌతికాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని నింపి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,అక్టోబర్ 31(జనంసాక్షి) :
విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, రెమిడియేషన్,ఖాన్ అకాడమీ, ఎఫ్.ఎల్.ఎన్. తరగతులను మండల విద్యాధికారులు (ఎం.ఈ.ఓలు), ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం.లు) నిరంతరం పర్యవేక్షించాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.శనివారం పెద్దపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడు మండలాల ఎం.ఈ.ఓలు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని, ఖాన్ అకాడమీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్, అభ్యసన ఫలితాలు, ఇతర పరిపాలనా అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాబోధనలో అనుసరించాల్సిన పద్ధతులను వివరిస్తూ, ఉపాధ్యాయులు తరగతి గదిలో ఫెసిలిటేటర్లుగా వ్యవహరించాలని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను వారే స్వయంగా మాట్లాడేలా ప్రోత్సహించాలని, కేవలం వినేవారిగా కాకుండా నేర్చుకున్న అంశాలను అర్థం చేసుకొని స్వయంగా వ్యక్తీకరించేలా బోధనా పద్ధతులు ఉం డాలని సూచించారు.విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలైన వినడం, మాట్లాడడం, చదవడం, సృజనాత్మకంగా రాయడం వంటి సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, అవసరమైన అదనపు బోధన అందించడం ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు.

రెమిడియేషన్ తరగతులపై ప్రత్యేక దృష్టి : తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతులు సమర్థవంతంగా కొనసాగాలని సూచించారు. గణితంలో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం అనే నాలుగు ప్రాథమిక ప్రక్రియల్లో విద్యార్థులు వంద శాతం నైపుణ్యం సాధించేలా బోధన చేపట్టాలని తెలిపారు. ఆయా తరగతుల ఫలితాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలని ఎం.ఈ.ఓలు, హెచ్.ఎం.లకు సూచించారు.

ఖాన్ అకాడమీ నమోదు, ఫలితాల పర్యవేక్షణ : ఖాన్ అకాడమీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు, విద్యార్థులు డిజిటల్ అభ్యసన ద్వారా సాధిస్తున్న ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల వినియోగం, అభ్యసన ఫలితాలను సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు.

– ఎఫ్.ఎల్.ఎన్. ప్రగతిపై ప్రత్యేక కార్యాచరణ : ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విధంగా, ఉన్నత పాఠశాలలు కూడా మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయుల తరగతి బోధనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ తమ పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధి, అభ్యసన ప్రగతికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమం పురోగతి, ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ అంశాలపై డి.ఆర్.పీలు అవగాహన కల్పించారుఏ.ఎం.ఓ. డా. పి.ఎం. షేక్, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేంద్ర కుమార్, సుల్తానాబాద్, శ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఆలోకిట్ ప్రతినిధులు ప్రమోద్, అంజద్, సమీద్, స్కూల్స్ ఇన్‌స్పెక్షన్ టీమ్ లీడర్ సి.హెచ్. ఆగయ్య, డి.ఆర్.పి.లు గడ్డం జగదీశ్వర్, కృష్ణమోహన్, జె. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్, రమేష్, మంజుల, జ్యోతి, కిరణ్, కృష్ణారెడ్డి, దేవేందర్, రవి, పుష్పలత, సి.ఆర్.పి.లు తదితరులు పాల్గొన్నారు.

చుక్క చుక్క ఒడిసిపట్టి..

ఎల్‌నినో సవాళ్లకు పెద్దపల్లి సిద్ధం.. ముందస్తు జాగ్రత్తలతో సమగ్ర కార్యాచరణ!

- కలెక్టర్ కోయ శ్రీహర్ష నేతృత్వంలో సమగ్ర ప్రణాళిక
- యాసంగిలో వరికి స్వస్తి.. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం
- తెలంగాణ జలసిరితో జల సంరక్షణ.. వీబీజీ రామ్‌జీ పథకంతో గ్రామాల్లో జలకళ
- ఖరీఫ్ పంటల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు.. తాగునీటికి ముందస్తు కార్యాచరణ
- ప్రజాప్రతినిధుల మార్గదర్శకత్వంలో శాఖల సమన్వయంతో ముందడుగు వేయాలి
- జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిణి తిరుమల

పెద్దపల్లి,అక్టోబర్ 31(జనంసాక్షి) :
వాతావరణ మార్పులు.. వర్షపాతంలో లోటు.. భూగర్భ జలాల తగ్గుదల.. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో పొడిబారే పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు! ఈ సవాళ్లను ముందుగానే గుర్తించిన పెద్దపల్లి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి.. గ్రామీణులకు ఉపాధి కల్పిస్తూనే శాశ్వత నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలి.. అనే లక్ష్యంతో సమగ్ర కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నాయకత్వంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, తాగునీరు, విద్యుత్ శాఖలను సమన్వయం చేస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారు.ఎల్‌నినో ప్రభావం పూర్తిస్థాయిలో కనిపించకముందే అప్రమత్తమై భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించేలా గ్రామీణ ప్రాంతాల్లో జల సంరక్షణ పనులు చేపట్టడం ఈ కార్యాచరణలో ప్రత్యేకత. రైతుల పంటలను కాపాడటం నుంచి తాగునీటి భద్రత వరకు.. ఉపాధి కల్పన నుంచి భూగర్భ జలాల పెంపు వరకు అన్ని అంశాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

వర్షపాతంలో 8 శాతం లోటు : జిల్లాలో జూన్ 1 నుంచి అక్టోబర్ 27 వరకు 863 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 940.9 మిల్లీమీటర్లు కాగా, 8 శాతం లోటు నమోదైంది. 14 మండలాల్లో 10 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, మంథని మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.జూలైలో సాధారణం కంటే 42 శాతం అధిక వర్షపాతం నమోదైనా, ఆగస్టులో 51 శాతం లోటు నమోదైంది. అక్టోబర్ 27 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం అత్యవసరంగా మారింది. రాబోయే వర్షపు నీరు వృథా కాకూడదు.. భూమిలోకి ఇంకాలి! రాబోయే వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ జలసిరి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామాల్లో ఫామ్ పాండ్లు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు,సామూహిక ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపడుతున్న ఈ పనులు గ్రామీణ ప్రాంతాలకు భవిష్యత్తులో ఎంతో ప్రయోజ నకరంగా మారనున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలో రోజువారీ కూలీల హాజరును పెంచి గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ నాయకత్వం, అధికారుల సమన్వయం, రైతులు మరియు గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో పెద్దపల్లి జిల్లా ఎల్‌నినో సవా ళ్లను ఎదుర్కొనేందుకు ముందస్తుగా అడుగులు వేస్తోంది.

డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టాలి

- మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- గంజాయి సాగు గుర్తిస్తే కఠిన చర్యలు
- చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలి : అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,అక్టోబర్ 31(జనంసాక్షి) :
మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం గంజాయి సాగుదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.డ్రగ్స్ విక్ర యం, కొనుగోలు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వ యంతో పనిచేయాలని అన్నారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాలతో పాటు డ్రగ్స్ దుష్పరి ణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృతం గా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిం చారు.పాఠశాలలు, కళాశాల లు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశా లు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు మాదకద్ర వ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు చికిత్స పొందేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు. డీ-అడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమారస్వామి, జిల్లా పోలీసు శాఖ,ఎక్సైజ్ శాఖ,వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ,వ్యవసాయ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. శనివారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా లిఅదనపు కలెక్టర్ బి.శ్రీరాములులి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ వల్లభాయ్ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, మాట్లాడుతూ, జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. దేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు అందిస్తామని, ఉద్యోగులతో అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది,తదితరులు, పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
1 నవంబర్ 2026

కరీంనగర్ కమిషనరేట్ ఇన్‌స్పెక్టర్ కాసర్ల శశిధర్‌కు ప్రతిష్ఠాత్మక "కేంద్ర హోంమంత్రి దక్షతా పథకం 2026"

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 31(జనంసాక్షి) : విచారణ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ కాసర్ల శశిధర్‌కు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు "కేంద్ర హోంమంత్రి దక్షతా పథకం 2026" లభించిందని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నం. 155/2019 హత్య కేసులో ఆయన అత్యుత్తమ దర్యాప్తు నిర్వహించారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో పకడ్బందీగా ఛార్జిషీట్ దాఖలు చేయడంతో, కరీంనగర్ ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టు మొత్తం 15 మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,500 జరిమానా విధించింది. ఈ కేసులో ఆయన కనబరిచిన వృత్తిపరమైన నైపుణ్యం, నిబద్ధతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారానికి ఎంపిక చేసిందని, ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఇన్‌స్పెక్టర్ కాసర్ల శశిధర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు లభించడం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన సాధించిన విజయం ఇతర పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అభినందించారు.

ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం

- అర్జీ-2 ఏరియాలో గనులు, డిపార్ట్‌మెంట్లలో జెండా ఆవిష్కరణలు
- కార్మిక హక్కుల సాధనలో సంఘం కీలక పాత్ర
- సింగరేణిలో హక్కుల సాధనకు పోరాటాలు
- కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు

యైటింక్లైన్ కాలనీ, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సింగరేణి అర్జీ-2 ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గనులు, కార్యాలయాల వద్ద సంఘం జెండాలను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుకూరి రాజారత్నం, అర్జీ-2 బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబైలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, సింగరేణిలో 1942లో సంఘం ఏర్పాటైందని తెలిపారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1925లోనే తీర్మానం చేసి పోరాటం ప్రారంభించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. కార్మికులకు సంబంధించిన పలు చట్టాల సాధనలో సంఘం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగ హక్కు, పెన్షన్, బోనస్, అదనపు ఇంక్రిమెంట్లు, బదిలీ కార్మికుల పర్మినెంట్ వంటి హక్కుల సాధనకు చేసిన పోరాటాలను వివరించారు. 2000 సంవత్సరంలో సింగరేణి సంస్థను బీఐఎఫ్ఆర్ నుంచి గట్టెక్కించడంలోనూ ఏఐటీయూసీ కృషి ఉందన్నారు.

కార్మికుల హక్కుల సాధనలో సంఘం చేసిన పోరాటాలను గుర్తించకుండా ఇటీవల ఏర్పడిన కొన్ని కార్మిక సంఘాలు అవాస్తవ ప్రచారం చేయడం సరికాదని నాయకులు అన్నారు. దీపావళి బోనస్ ఇప్పించామని చెప్పుకుంటున్న సంఘాలు, లాభాల బోనస్ సాధనలో తమ పాత్రను కార్మికులకు వివరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శులు శ్యాంసన్, ఆవుల రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ అన్నారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడి మహేందర్, కార్మిక కర్షక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి, వివిధ పిట్, మైన్స్, సెప్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

కొండగట్టులో హనుమాన్ చందనోత్సవ మహోత్సవం

- 60 సంవత్సరాల అనంతరం నిజరూప దర్శనం
- ఏర్పాట్లపై కలెక్టర్ సత్య ప్రసాద్ సమీక్ష

మల్యాల అక్టోబర్ 31 (జనం సాక్షి) : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామం లోని కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో 60 సంవత్సరాల అనంతరం కొండగట్టులో శ్రీ హనుమాన్ చందనోత్సవ మహోత్సవం నవంబర్ 15 నుంచి 20 వరకు చందనోత్సవ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు, నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు స్వామివారి నిజరూప దర్శనం కార్యక్రమాలపై శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్ ఐడీఓసీలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ నిజరూప దర్శనానికి రోజుకు సుమారు 50 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని ట్రాఫిక్,పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు,విద్యుత్,పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని,భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు,వైద్య శిబిరాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి, ప్రజాప్రతినిధులతో క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మరో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.ప్రస్తుతం నిర్వహించిన సమావేశం చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి ప్రాథమిక సమావేశం మాత్రమేనని కలెక్టర్ తెలిపారు.వచ్చే వారం ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన అనంతరం,క్షేత్రస్థాయిలో గుర్తించిన అవసరాలు, సమస్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై మరో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అరుదైన మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని,ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓ మధు సుధన్, డి.ఎస్.పి కె.పురుషోత్తం రెడ్డి,కొండగట్టు ఈవో ఎస్ అంజనారెడ్డి,డిపిఓ మదన్మోహన్,డిఎంహెచ్వో సుజాత,మిషన్ భగీరథ,ఫైర్ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ అండర్ -19 క్రీడా పోటీల్లో తేజస్ విద్యార్థుల ప్రతిభ

తేజస్ విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్ సతీష్ రావు

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్ -19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీల్లో తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారని తేజస్ జూనియర్ కళాశాల చైర్మన్ సిహెచ్ సతీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా తేజస్ జూనియర్ కళాశాల చైర్మన్ సిహెచ్ సతీష్ రావు మాట్లాడుతూ... ప్రాంతీయ క్రీడా పాఠశాల, ఎల్.ఎం.డి., కరీంనగర్ వేదికగా నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో తేజస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారని, మా తేజస్ విద్యార్థుల విజయాలు సిహెచ్. భీమేష్ జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం, హైజంప్‌లో ద్వితీయ స్థానం, జె. సాయి కృష్ణ డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం, బి. నాగరాజు షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, విద్యార్థుల అద్భుత విజయం పై తేజస్ జూనియర్ కళాశాల చైర్మన్ సిహెచ్. సతీష్ రావు, డైరెక్టర్ సిహెచ్. మౌనికా రావు, కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ రెడ్డి, కళాశాల పీఈటీలు విజేతలను అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో మరింత కృషి చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి తేజస్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. క్రీడా ప్రతిభకు తేజస్ ప్రోత్సాహం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు తేజస్ జూనియర్ కళాశాల నిరంతరం ప్రోత్సాహం అందిస్తోందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరిక

హుజూరాబాద్, అక్టోబర్ 31 (జనంసాక్షి) : ప్రజలకు వైద్య సేవలు అందించే బాధ్యతాయు తమైన వృత్తిలో ఉన్న అధికారులు, సిబ్బంది తమ విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరిం చారు. శనివారం హుజరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి, రోగులకు ఆసుపత్రిలో అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డుకు వెళ్లి అక్కడ ఉన్న సౌకర్యాల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు అసిస్టెంట్ కలెక్టర్ హరి ప్రసాద్, హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి, డిసి హెచ్ ఎస్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ హఫీయోద్దీన్ ఖాన్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రభుదాస్, తాసిల్దార్ జక్కని నరేందర్, కమిషనర్ బి కిషన్, కౌన్సిలర్ కోయల్ కార్ భారతి, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 31 (జనం సాక్షి) : కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట వద్ద ఆర్టీసీ బస్సు, గ్రానైట్ బండరాయిని తీసుకెళ్లేందుకు వెళ్తున్న కంటైనర్ ఢీకొన్న ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు బస్సులో ముందు సీట్లలో కూర్చున్న ఐదుగురు ప్రయాణికులు గాయపడగా, వారిని 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.
ప్రమాద విషయం తెలిసిన వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారుల బృందం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన వైద్య సహాయం అందించాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు వైద్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కరీంనగర్ ఆర్డిఓ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారనీ, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ పాపం ఎవరిది..? గూడుకు నోచుకోని వృద్ధురాలు

- ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా.. ప్రొసీడింగ్స్ అందక అవస్థలు
- తప్పుడు సమాచారంతోనే అన్యాయం జరిగిందని బాధితురాలి ఆవేదన
- అధికారుల నిర్లక్ష్యంపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఆగ్రహం
- సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 31 (జనం సాక్షి): ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం.. కొందరు అర్హులకు మాత్రం ఆవేదనను మిగులుస్తోంది. అర్హత ఉన్నప్పటికీ తప్పుడు సమాచారం కారణంగా ఇల్లు పొందలేకపోతున్నామని బాధితులు వాపోతున్నారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఓ వృద్ధురాలు తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది. సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రాగిపెల్లి విజయ అనే వృద్ధురాలు ప్రస్తుతం అద్దె ఇంట్లో నివసిస్తోంది. సొంతిల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంది. తనకు ఇల్లు మంజూరైనప్పటికీ, ఇందిరమ్మ కమిటీకి చెందిన ఓ వ్యక్తి ఇచ్చినట్లు చెబుతున్న తప్పుడు సమాచారం కారణంగా ప్రొసీడింగ్స్ పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తనకు మూడు ఇళ్లు ఉన్నాయంటూ అధికారులు సమాచారం అందుకున్నారని, అందువల్ల ఇందిరమ్మ ఇల్లు వర్తించదని చెప్పడంతో తాను తీవ్ర ఆందోళనకు గురయ్యానని విజయ తెలిపింది. వాస్తవ పరిస్థితులను పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరింది. తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై విచారణ జరిపి, తప్పు అని నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం!

తన సమస్యను పరిష్కరించాలంటూ కొంతకాలంగా మున్సిపల్ కార్యాలయం, సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదని బాధితురాలు వాపోయింది. అర్హత ఉన్నప్పటికీ తనకు మంజూరైన ఇంటికి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపింది. నిరుపేదలకు అండగా నిలవాల్సిన పథకంలో ఇలాంటి పరిస్థితులు ఎదురవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది.

చైర్‌పర్సన్ ఆగ్రహం.. అధికారుల నిలదీత.

వృద్ధురాలి సమస్య మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి దృష్టికి వెళ్లడంతో ఆమె స్పందించారు. మున్సిపల్ సమావేశానికి సిద్ధమవుతున్న సమయంలో ఈ అంశంపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల దృష్టికి ఇంతకాలం ఈ సమస్య ఎందుకు తీసుకురాలేదని, ఇది అధికారుల బాధ్యత కాదా? అని మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ఈ సమస్యను ప్రజాప్రతినిధులకు గానీ, కౌన్సిల్ దృష్టికి గానీ తీసుకురాలేదని కమిషనర్ వివరణ ఇచ్చారు. సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. అర్హురాలైన వృద్ధురాలికి న్యాయం జరిగేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే మరింత జటిలంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.

బాధితురాలికి న్యాయం జరిగేనా?

ప్రభుత్వ పథకాల అమలులో అర్హులైన పేదలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ముఖ్యంగా వృద్ధులు, నిరుపేదలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సమస్యలను సకాలంలో పరిష్కరించాల్సిన అవసరం ఉంది. రాగిపెల్లి విజయకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు, నిబంధనల ప్రకారం ఆమెకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.
ఇల్లు మంజూరైందని చెబుతున్న వృద్ధురాలికి ప్రొసీడింగ్స్ ఎందుకు అందడం లేదు? మూడు ఇళ్లు ఉన్నాయన్న సమాచారం వాస్తవమేనా? అసలు తప్పిదం ఎక్కడ జరిగింది? ఈ ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. నిరుపేద వృద్ధురాలి గోడు ఎప్పుడు తీరుతుందో వేచి చూడాలి.

మొయినాబాద్‌లో విషాదం

- విద్యుదాఘాతంతో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి
- పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పరుగులు
- పంట పొలంలో విద్యుత్ తీగలే మృత్యుపాశం

మొయినాబాద్, అక్టోబర్ 31 జనం సాక్షి : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మద్యం సేవించేందుకు బహిరంగ ప్రదేశానికి వెళ్లిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి భయంతో పరుగులు తీస్తున్న క్రమంలో పంట పొలానికి అడవి పందుల బెడద నుంచి రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలోని పద్మావతి ఫంక్షన్ హాల్ వెనుక ఉన్న బహిరంగ ప్రదేశానికి మద్యం సేవించేందుకు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా అటుగా పోలీస్ పెట్రోలింగ్ వాహనం వచ్చింది. పోలీసులను చూసిన విద్యార్థులు భయపడి అక్కడి నుంచి పరుగులు తీశారు.
ఈ క్రమంలో సమీపంలోని పంట పొలం చుట్టూ అడవి పందుల నుంచి పంటను కాపాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు ఇద్దరు విద్యార్థులు తగిలారు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతులను హైదరాబాద్‌లోని అత్తాపూర్‌కు చెందిన మోక్ష సాయి చరణ్ (20), బల్కంపేటకు చెందిన యశ్వంత్ (20)గా గుర్తించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పంట పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమా? వాటిని ఏర్పాటు చేసిన వ్యక్తి నిర్లక్ష్యం ఏమైనా ఉందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు యువ విద్యార్థుల మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారును ఢీకొట్టిన బైక్ ఒకరు మృతి

మోర్తాడ్ అక్టోబర్ 31 జనం సాక్షి : మోర్తాడ్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పరుస రాహుల్, దంతే జైపాల్ అనే ఇద్దరు వ్యక్తులు తమ బైకుపై మోర్తాడ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి వీక్లీ మార్కెట్ వైపు రాంగ్ రూట్లో వెళుతూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో బైక్ వెనకాల కూర్చున్న దంతే జైపాల్ ఎగిరిపోడి కింద పడడంతో తీవ్రమైన రక్తస్రావం అయ్యిందని హుటాహుటిన ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాము తెలిపారు. దంతే జైపాల్ తండ్రి దంతే మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొనీ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసు ఉద్యోగాల సాధనకు ఉచిత శిక్షణ

- 250 మంది అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ
- 60 రోజుల పాటు ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ
- నిపుణులచే పోటీ పరీక్షలకు మార్గదర్శనం
- క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (జనంసాక్షి): పోలీసు ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు పోలీసు శాఖ అండగా ఉంటుందని పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 60 రోజుల ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణలో భాగంగా శనివారం గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో 250 మంది అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ తదితర ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకున్న యువతకు నాణ్యమైన శిక్షణ, సరైన మార్గదర్శకత్వం అందించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్య కిరణ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీ పరీక్షల సరళి, సమయపాలన, ప్రశ్నలను వేగంగా, కచ్చితంగా పరిష్కరించే విధానాలపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. పరీక్షల పట్ల భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. బలహీనతలను గుర్తించి అధిగమిస్తూ క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్, సీటీసీ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, రాజశేఖర్, అధ్యాపకులు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

టీఎస్ ఆర్టిసి రిటైర్డ్ కార్మికుల ఆందోళన

- ఆర్టిసి డిపో ఎదుట నిరసన
- 10 సంవత్సరాలుగా ఎటువంటి ప్రయోజనాలు లేవు
- అరియర్స్.. పింఛన్లు.. అందక కార్మికుల ఇబ్బందులు
- 450 మంది రిటైర్డ్ కార్మికులు మృతి చెందారు
- రిటైర్డ్ కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- రాష్ట్రవ్యాప్తంగా రిటైర్డ్ కార్మికులు 18,600

గోదావరిఖని, జనంసాక్షి : టీఎస్ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల దీనస్థితిపై గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట నిరసన, ఆందోళన ఆందోళన చేపట్టారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ కార్మికులు వారికి రావలసిన వివిధ రకాల బకాయిలపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 18, 600 మంది రిటైర్డ్ కార్మికులు ఉన్నారని, గోదావరిఖని డిపో నుంచి 160 మంది రిటైర్డ్ కార్మికులు ఉన్నారన్నారు. రిటైర్డ్ కార్మికులు వివిధ రకాల బకాయిలు టిఎస్ఆర్టిసి, ప్రభుత్వము అందజేయకపోవడంతో 460 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన ఎలాంటి లాభం చేకూర్చకపోగా.. ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన చెందారు. అరియర్స్, పింఛన్లు రాక ఆర్టీసీ కార్మికులు దీనస్థితిని అనుభవిస్తు న్నారని వారు పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో 30 సంవత్సరాలు కష్టపడితే ఆర్టీసీ నుంచి వచ్చే ఫలితం ఇదేనా అని వారు ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ ఆర్టీసీలో రిటైర్మెంట్ కార్మికులు ఉద్యోగ విరమణ చేసి 10 సంవత్సరాలు అయినప్పటికీ, ఎటువంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నామని తెలిపారు. సరైన సదుపాయాలు, నిధులు అందక ఇప్పటివరకు దాదాపు 460 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.బకాయిలు, పింఛన్లు ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం నుండి ఎటువంటి నిధులు, ఏరియర్స్, బకాయిలు, పెన్షన్లు అందక కార్మికులు తీవ్ర దీనావస్థలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికుల హత్యలకు (మరణాలకు) ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రిటైర్డ్ కార్మికులను ఆదుకోవడానికి బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి వచ్చిన కార్మికులను ఎక్కడికక్కడ నిర్బంధించి, పోలీస్ స్టేషన్లలో పెట్టి వారి వయసును కూడా లెక్కచేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు.ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి, రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికులు బి.బెంజమన్, ఎం శంకర్, ఎస్.కె నబీసా, ఎండి రహమాన్, కే,మల్లేశం, సిహెచ్ జె రెడ్డి, సిహెచ్ పోచయ్య, ఎస్ .రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పేరిట కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు

- ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్‌పై అనవసర రాద్ధాంతం
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో ఎండగడతాం
- నవంబర్ 5న కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్ర



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి): రాజ్యాంగ పరిరక్షణ పేరిట కాంగ్రెస్ పార్టీ రాజకీయ డ్రామాలకు తెరతీస్తోందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి విమర్శించారు. ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నవంబర్ 5న కరీంనగర్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని అతిథి హోటల్‌లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మహిళా మోర్చా అధ్యక్షులు, మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తూ రాజ్యాంగం ప్రమాదంలో ఉందని కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న నిరసన కార్యక్రమం కాంగ్రెస్ రాజకీయ దురుద్దేశానికి నిదర్శనమన్నారు. పోలీసులకు, లాఠీలకు భయపడవద్దంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ వై.సునీల్‌రావు, మాజీ జడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దిగజార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చట్టబద్ధమైన అంశాలపై చట్టసభల్లో చర్చించకుండా వీధుల్లో నిరసనలు చేపట్టడం సరికాదన్నారు. పండుగల సమయంలో ఢిల్లీలో భారీ ర్యాలీతో వ్యాపారాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ విధానాలను ప్రజల్లో ఎండగట్టేందుకు నవంబర్ 5న కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో మహిళా కార్పొరేటర్లు, సర్పంచులు, వివిధ మండలాల మహిళా మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనం సాక్షి: రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు తదితరులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, అధికారులు, సిబ్బందిచే జిల్లా రెవెన్యూ అధికారిణి గీత ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకితభావంతో కృషి చేస్తానని, తోటి వారందరిలో ఈ భావనను పెంపొందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని, సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను పటిష్టపరిచేందుకు తోడ్పాటును అందిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వట్టినాగులపల్లిలో వెలుగు చూసిన భారీ పేకాట స్థావరం

- పట్టుబడ్డ ప్రముఖుల బంధువులు...! భారీగా సొమ్ము
- గుట్టుగా మూసేందుకు అప్పుడే ఊపందుకున్న గట్టి ప్రయత్నాలు...?

శేరిలింగంపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి వట్టినాగులపల్లి లో భారీగా వెలుగు చూసిన పేకాట స్థావరం ఉదాంతం శనివారం నగరాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. అక్రమ సంపాదననంతా అరిగిచ్చుకోలేని కొంతమంది ఇలా జల్సాల రూపంలోతాగి తందనాలాడుతూ పేకాటకు తగిలిస్తున్నారని ఇప్పటికే సామాజిక భావన బలంగా నాటుకున్న ఈ తరుణంలో చోటు చేసుకున్న పేకాట ఘటన ఉదాంతం నగర ప్రజలను తీవ్ర ఆత్మవలోకంలోకి నెట్టిందనడంలో సందేహం లేదు. అయితే పేకాట స్థావరంపై నిర్వహించిన దాడులకు సంబంధించిన వివరాలు గచ్చిబౌలి పోలీస్ ఇన్స్పెక్టర్ వెల్లడించిన ప్రకారం... సైబరాబాద్ కమిషనరేట్ పరిధి వట్టినాగులపల్లి పరిధిలోని 'ది స్కై బై విహారా ఫామ్' అనే ఫామ్‌హౌస్‌ను కేంద్రంగా చేసుకుని కొంతకాలంగా ఓ భారీ పేకాట స్థావరం గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఫామ్‌హౌస్‌లో ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా గుట్టుగా 'అందర్-బాహర్' విధానంలో పేకాటను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా సదరు స్థావరంపై అందిన విశ్వసనీయ సమాచారంమేరకు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం పక్కా వ్యూహంతో ది స్కై బై విహార ఫామ్ అనే ఫామ్‌హౌస్‌పై సాయంత్రం వేళల్లో మెరుపు దాడిని నిర్వహించడం జరిగింది. ఈ దాడి సమయంలో అక్కడ పేకాట ఆడుతున్నవారిని, ఆట నిర్వాహకులను కలిపి మొత్తం 27 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు10 లక్షల నగదును (అనధికారికంగా అక్కడ పెద్ద మొత్తంలో) స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో బి.ఎన్. రెడ్డి నగర్‌కు చెందిన చిన్న యాదవ్, సన్‌సిటీకి చెందిన సోను మరియు నవీన్ అనే వ్యక్తులు ఈ పేకాట స్థావరానికి ప్రధాన నిర్వాహకులుగా కొనసాగుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అయితే వీరు గత నాలుగు నెలలుగా ఈ ఫామ్‌హౌస్‌ను అద్దెకు తీసుకుని రహస్య ఒప్పందంతో అవగాహన కుదుర్చుకొని ఈ పేకాట కేంద్రాన్ని పోలీసులకు చిక్కకుండా నడిపిస్తున్నారు. ఈ స్థావరంలో కేవలం సాధారణ ఆటలే కాకుండా, రోజూ దాదాపు 20 లక్షల వరకు భారీస్థాయిలో నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఈ ఘటనకు సంబంధించి గచ్చిబౌలి పోలీసులు నిర్వాహకులు, పట్టుబడిన వ్యక్తులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఈ రాకెట్ వెనుక ఇంకా ఎవరి ప్రమేయం ఉందనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం.. అధికారులు స్పందించాలని రైతుల డిమాండ్

కొల్చారం, అక్టోబర్ 31 (జనం సాక్షి): శనివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే కరెంటు సమస్యలు, వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొని, బోరు మోటర్లకు మరమ్మతులు చేయించి పంటను సాగు చేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం తమను మరింత నష్టాల్లోకి నెట్టిందని వాపోయారు.

వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో నాణ్యత దెబ్బతిని, కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా నిబంధనల ప్రకారం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

డీడీ కట్టి సీఎంకు లేఖ రాయాలి : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి): మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శనివారం ప్రెస్ మీట్‌లో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా స్పందించారు. తన భార్య పట్టా భూమిని లాక్కోవాలని చూస్తున్నారని, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భూదందాలు చేసిన వారే ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారని అనిరుధ్ రెడ్డి మండిపడ్డారు. ఆసుపత్రికి రూ. 25 కోట్లు ఇస్తానంటున్న లక్ష్మారెడ్డి, ముందుగా డీడీ కట్టి సీఎంకు లేఖ రాయాలని, జీవో వచ్చాక ఒరిజినల్ డీడీ ఇవ్వాలని సవాల్ విసిరారు. ఆసుపత్రికి జీవో తెచ్చే బాధ్యత తనదేనని, కొద్దిపాటి వర్షం పడితే నీటితో నిండిపోయేలా ఆసుపత్రిని నిర్మించిన వారు, ఇప్పుడు ఆసుపత్రి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమది సేవా కుటుంబమని, పదవులు, డబ్బు కోసం రాజకీయాలు చేయమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే గజ్వేల్ వెళ్లానని, ఎంపీ ఎన్నికల్లో మల్లు రవి గెలుపుకు పనిచేశానని తెలిపారు. జెడ్పీ చైర్మన్ పదవి ఇస్తామన్నా పార్టీ మారలేదని, గత ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయమని చెప్పింది లక్ష్మారెడ్డి కాదా అని ప్రశ్నించారు. గంట సేపు మాట్లాడడం కాదు, ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మివి అంతర్జాతీయ బ్రాండ్లతో పోటీ పడుతుంది

- తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి కంపెనీలు
- రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది
- మివి వన్ 5 జీ స్మార్ట్ ఫోన్ విభాగంలో అడుగు పెట్టింది
- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

మహేశ్వరం, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ రంగంలో మివి కంపెనీ అంతర్జాతీయ బ్రాండ్లతో పోటీ పడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈసిటీలో 200 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసిన నూతన మివి తయారు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మివి నూతన ప్లాంట్ లో నెలకు 5 లక్షల ఇయర్ బర్డ్స్,75000 సౌండ్ బార్లను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. మివి కంపెనీలో 2500 మందికి స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారి రంగానికి అవసరమైన మానవ వనరులను మివి బలోపేతం చేస్తుందన్నారు. ఆడియో ఉత్పత్తుల పరిధిదాటి,స్మార్ట్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ మార్కెట్లోకి మివి విస్తరిస్తుందన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో మివి సొంతంగా ఉత్పత్తులను,సాంకేతికతను అభివృద్ధి చేసే స్థాయికి ఎదిగిందన్నారు. ఇటీవల కాలంలో మివి వన్ 5 జీ తో స్మార్ట్ ఫోన్ విభాగంలోకి అడుగుపెట్టిందన్నారు. అనంతరం మివి వ్యవస్థాపకులు మిథుల,విశ్వనాథ్ కందుల మాట్లాడుతూ...భారతీయ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాంకేతికతను, ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామన్నారు. ఎలక్ట్రానిక్స్ హబ్‌గా భారత్ ఎదుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, ఎఫ్సిడిఏ కమిషనర్ శశాంక, ఐటీ జాయింట్ సెక్రెటరీ అనుదీప్ దురిశెట్టి, మివి కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులతో కలిసి తల్లి ఆత్మహత్య

- చింతకుంటలో తీరని విషాదం.. వికారాబాద్ జిల్లాలో హృదయవిదారక ఘటన
- గ్రామంలో విషాదఛాయలు

ధారూర్,అక్టోబర్ 31(జనంసాక్షి) : వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం చింతకుంట గ్రామంలో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు కన్నబిడ్డలతో కలిసి ఓ తల్లి మృత్యువాత పడిన హృదయవిదారక ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన భూపతిరెడ్డి భార్య వాసవి తన ఇద్దరు చిన్నారులతో కలిసి మృతి చెందడం గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. స్థానికుల సమాచారం ప్రకారం వాసవి కుటుంబం వికారాబాద్ పట్టణంలో నివాసం ఉంటోంది. శనివారం చింతకుంట గ్రామానికి వచ్చిన కుటుంబంలో సాయంత్రం ఈ విషాద ఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది. వాసవి తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. వాసవి కొంతకాలంగా మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే ముగ్గురి మృతికి దారితీసిన అసలు కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి,ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. పోలీసుల విచారణ పూర్తయితేనే ఈ విషాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కన్నబిడ్డలతో సహా తల్లి మృతి చెందడంతో చింతకుంట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మరణవార్తతో గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో ఘనంగా ఏక్తా దివస్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (జనంసాక్షి): సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ విద్యార్థులు దేశభక్తి, మతసామరస్యం, సోదరభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో ఏక్తా దివస్ ర్యాలీతో పాటు వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ రూపకల్పన పోటీలు నిర్వహించారు. విజేతలకు రిజిస్ట్రార్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ భ్రమరాంబిక, డాక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరి, డాక్టర్ హలీమ్ ఖాన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ స్వామి, డాక్టర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేపై గంజాయి పట్టివేత

కోదాడ, (జనంసాక్షి): తెలంగాణ ఈగల్ ఫోర్స్, కోదాడ టౌన్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ తో కోదాడ హైవేపై 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు సమాచారం. కాకతీయ సేవా సమితి సమీపంలో హోండా సిటీ కారులో తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేసి కారులో 62 ప్యాకెట్లలో తరలిస్తున్న 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సుమారు 75 లక్షలు ఉంటుందని అంచనా, గంజాయి రవాణాకు ఉపయోగించిన హోండా సిటీ కారు సీజ్ చేశారు. కర్ణాటకకు చెందిన సెల్వ సూర్య (26), రాజా గౌండర్ మురుగన్ (42) అరెస్టు చేశారు. ఒడిశాలోని చిత్రకొండకు చెందిన రాజు నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడి.

మియాపూర్‌లో రూ.13.82 కోట్ల అభివృద్ధి పనులకు పిఏసి చైర్మన్ శంకుస్థాపన

- కొండాపూర్ లో 3.06 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అరికెపూడి

శేరిలింగంపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా, ఆచరణలో మార్గదర్శకంగా నిలబెట్టాలనదే తన లక్ష్యమని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలియజేశారు. ఈ మేరకు మియాపూర్ డివిజన్ పరిధి బికె ఎంక్లేవ్, మయూరి నగర్, నడిగడ్డ తాండ, ఎస్ఎంఆర్ హైలాండ్ అపార్ట్మెంట్, శ్రీల గార్డెన్ న్యూ కాలనీ, శ్రీ లక్ష్మీ నగర్ కాలనీల పరిధిలో 13.82 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణం పనులు, వరద నీటి కాలువ నిర్మాణం పనులకు స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్తో కలిసి అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శనివారం శంకుస్థాపన గావించారు. దీంతోపాటు కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బి బ్లాక్, మార్తాండ్ నగర్, గోల్డెన్ తులిప్, మాధవ హిల్స్ ఫేజ్ 1 కాలనీల పరిధిలో 3 కోట్ల 6 లక్షల రూపాయల అంచనావ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణం పనులకు, వరద నీటి కాలువ నిర్మాణం పనులకు కొండాపూర్ తాజామాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ తో కలిసి పిఏసి ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీల అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానన్నారు. శేరిలింగంపల్లి ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్దడం జరుగుతుందని అరికపూడి ధీమాను వ్యక్తంచేశారు. సంక్షేమం మరియు అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఒక గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతుందని, దీని కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక నిర్దిష్ట ప్రణాళికను అమలు చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతాప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజి పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యంకోసం శాయశక్తులా కృషి చేస్తానని అరికెపూడి గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సోదరీమణులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భారత పార్లమెంట్‌లో ప్రసంగించిన ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థిని శ్రీనిత్య

- తెలంగాణ నుంచి ఏకైక ప్రతినిధిగా వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రసంగం.. కళాశాలకు గర్వకారణం

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 31, (జనంసాక్షి) : భారత ఉక్కుమనిషి, జాతీయ సమైక్యతకు ప్రతీక సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని భారత పార్లమెంట్‌లో నిర్వహించిన ప్రత్యేక 'వికసిత్ భారత్' కార్యక్రమంలో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని ఎం. శ్రీనిత్య ప్రసంగించి అరుదైన గుర్తింపు సాధించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించే అవకాశం దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా ఆమె నిలవడం విశేషం. దేశ ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే భారత పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం రావడం శ్రీనిత్య ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. జాతీయ స్థాయి వేదికపై తెలంగాణ రాష్ట్రంతో పాటు తాను చదువుతున్న ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలకు ప్రాతినిధ్యం వహించడం విశేషంగా మారింది. ఈ ఘనతతో కళాశాల కీర్తి ప్రతిష్ఠలు జాతీయ స్థాయిలో మరోసారి వెలుగులోకి వచ్చాయి.

విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సామాజిక, జాతీయ అంశాలపై అవగాహన పెంపొందించుకుని వివిధ వేదికలపై తమ ప్రతిభను చాటుకోవాలనే లక్ష్యానికి శ్రీనిత్య సాధించిన విజయం నిదర్శనంగా నిలుస్తోంది. జాతీయ సమైక్యత, దేశాభివృద్ధి వంటి అంశాలపై యువతలో చైతన్యం కల్పించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమెకు లభించిన అవకాశం ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తోంది.

శ్రీనిత్య సాధించిన ఈ అరుదైన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు పి. నితిన్, టి. రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు, ఎన్ఎస్ఎస్ సలహా మండలి చైర్మన్ డాక్టర్ కె. సురేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు బి. ఎలిజబెత్ రాణి, డాక్టర్ కె. అర్జున్, డాక్టర్ పి. తిరుపతి, ఎం. వెంకటేశ్వర్లు, జి. రాజేందర్, అధ్యాపకులు ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఎం. సత్య ప్రకాష్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శ్రీనిత్యను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యారంగంతో పాటు జాతీయ స్థాయి కార్యక్రమాల్లోనూ పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీనిత్య సాధించిన విజయం కళాశాలకు గర్వకారణమని, ఆమెను ఆదర్శంగా తీసుకుని మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

నూనెగింజల సాగుకు ప్రోత్సాహం..ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

సిరికొండ, అక్టోబర్ 31 జనం సాక్షి: ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోయే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగయ్యే నూనెగింజలు, ఆరుతడి పంటలు, చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని నిజామాబాద్ రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) అంజి ప్రసాద్ సూచించారు. సిరికొండ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో రైతులకు ఆర్‌పీఎల్ ఆధారిత శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూనెగింజల సాగును ప్రోత్సహించడం, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, చిరుధాన్యాల సాగును విస్తరించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

ఈ సందర్భంగా ఏడీఏ అంజి ప్రసాద్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడకుండా జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను ఎంపిక చేసుకొని సాగు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. వ్యవసాయంలో అవసరానికి మించి ఎరువులు వినియోగించకుండా వాటి వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఉద్యానవన అధికారి రోహిత్ ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులకు తెలియజేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగు ప్రాధాన్యతను వివరించి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపాలని సూచించారు.

దేశ సమైక్యతకు కృషి చేద్దాం కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి): రాజనీతిజ్ఞుడు, ఉక్కు మనిషి అయిన సర్దార్ వల్ల భాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రత ను పెంచేందుకు అందరం కృషి చేద్దామని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అధి కారులు, సిబ్బంది చేత రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం భద్రతను కాపాడేందుకు అంకితమవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పటేల్ ముందు చూపు, కార్య దక్షతతో సంస్థానాలను దేశంలో విలీనం చేశారన్నారు. కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా

అలాంటి మహనీయులు చూపిన బాటలో నడుస్తూ దేశ అభివృద్ధిలో అందరం పాలు పంచుకుందామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

- కోర్టు స్టేటస్‌కో ఉన్నా పట్టించుకోవడం లేదంటూ బాధితుడి ఆవేదన
- 1974లో స్థలం కొనుగోలు.. 1980లో ఇంటి నిర్మాణం
- ముందుగా ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారించాలని డిమాండ్

ఉప్పల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్‌లో హైడ్రా కూల్చివేతలపై వివాదం నెలకొంది. కోర్టు స్టేటస్‌కో ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా చర్యలకు దిగుతున్నారని ఓ ఇంటి యజమాని ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ఇంటిని ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ కూల్చేందుకు ప్రయత్నించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడి వివరాల ప్రకారం.. 1974లో తన తల్లి స్థలం కొనుగోలు చేయగా, 1980లో అక్కడ ఇల్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇంటి పన్నులు, మున్సిపల్ బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. స్థలానికి సంబంధించిన పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, పన్నుల రసీదులు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా పన్నులు స్వీకరించిన అధికారులు ఇప్పుడు ఎఫ్‌టీఎల్ పరిధి పేరుతో కూల్చివేతలకు సిద్ధపడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

కోర్టు ఆదేశాలున్నా చర్యలా?

ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, ఎఫ్‌టీఎల్ పరిధి, సరిహద్దులను నిర్ధారించిన తర్వాతే చర్యలు చేపట్టాలని కోర్టు ఆదేశించినట్లు బాధితుడు చెబుతున్నారు. అయినప్పటికీ అధికారులు స్టేటస్‌కో ఉత్తర్వులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కోర్టు ఆదేశాల పరిధిని పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని కోరుతున్నారు.

ముందుగా ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారించాలి. చెరువుల పరిరక్షణకు తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారిక సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సరిహద్దులను స్పష్టంగా గుర్తించిన తర్వాతే చర్యలు చేపట్టాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నారు. పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి నంబరు, పన్నుల రసీదులు, ఇతర ఆధారాలను పరిశీలించి తమ వాదన వినాలని కోరుతున్నారు. 1974 నాటి స్థల కొనుగోలు పత్రాలు, 1980లో నిర్మించిన ఇంటి ఆధారాలు, పన్నుల రికార్డులు, కోర్టు ఉత్తర్వులను సమగ్రంగా పరిశీలించాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్ సరిహద్దులపై స్పష్టత ఇచ్చి, న్యాయస్థాన ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మాదకద్రవ్య రహిత యువతతోనే వికసిత్ భారత్

- యువత ఆరోగ్యమే దేశ ప్రగతికి పునాది
- వ్యసనాలకు దూరంగా ఉండాలి
- విద్యార్థులకు పోలీసుల అవగాహన
- నషా ముక్త్ భారత్ అభియాన్‌పై కార్యక్రమం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (జనంసాక్షి): మాదకద్రవ్యాల నుంచి యువతను పరిరక్షించి, ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజాన్ని నిర్మించినప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి అన్నారు. విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్'పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత డిచ్‌పల్లి ఎస్‌హెచ్ఓ ఆరిఫ్ విద్యార్థులతో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో యువశక్తి కీలకమని, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కుటుంబ వ్యవస్థ, సామాజిక శాంతికి హాని కలిగిస్తుందని పేర్కొన్నారు. డిచ్‌పల్లి ఎస్ఐ ఆరిఫ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన సమస్యలను వివరించారు. యువత ప్రలోభాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విశ్వవిద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ స్ఫూర్తితో యువతలో అవగాహన కల్పించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ హలీమ్ ఖాన్, డాక్టర్ స్వామిరావు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
01 నవంబర్ 2026

మృతి చెందిన తల్లీశిశువు

వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

- అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించిన నాలుగు రోజులకే ఘటన
- నలుగురు గైనకాలజిస్టుల్లో ఒక్కరూ విధుల్లో లేకపోవడమే మృతికి కారణం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వసుపత్రిలో ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణిస్త్రీ శిశువుతో పాటు మృతిచెందిన ఘటన షాద్ నగర్ కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రిలో చోటుచోటుచేసుకుంది కొందుర్గ్ మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన రాధ(29) డెలివరీ కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. శుక్రవారం నాడు ఉదయం11 గంటలకు ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రాధను సాయంత్రం 5 గంటల వరకు ఆసుపత్రిలో ఉన్న ఆయాలు, అటెండర్లు, స్టాఫ్ నర్స్, డ్యూటీ డాక్టర్లు మాత్రమే వైద్యం చెయ్యడంతో సాయంత్రం 5 గంటల ముప్పై నిమిషాలకు రాధతో పాటు శిశువు మృతి చెందింది. ఆసుపత్రిలో నలుగురు గైనకాలజిస్ట్ వైద్యులు ఉంటే డ్యూటీలో ఒక్కరు కూడా లేకపోవడంతో డెలివరీ కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రాధ ఆసుపత్రిలోనే కన్నుమూసింది. ఇదిలా ఉంటే పురిటి నొప్పులతో ఓవైపు రాధ బాధపడుతుంటే.. డెలివరీ సమయంలో అక్కడ అటెండర్లు, ఆయాలు మాత్రమే ఉన్నారు. వారితోపాటు ఉన్న డ్యూటీ డాక్టర్ సెల్ ఫోన్ చేతిలో పట్టుకొని పురిటి నొప్పులతో బాధపడుతున్న రాధను చూస్తూ ఉండిపోయింది.

అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించిన 4 రోజులకే..

రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కె.కిరణ్మయి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గత నాలుగు రోజుల క్రితం షాద్ నగర్ కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులు పరిశీలించి ప్రభుత్వసుపత్రికి వచ్చే రోగులకు సరైన సమయంలో వైద్య సేవలను అందించాలని ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించిన నాలుగు రోజులకే ఇదే ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో డెలివరీ కోసం వచ్చిన గర్భిణీ స్త్రీ తల్లితో పాటు శిశువు మరణించడం వైద్యుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.

నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

ఈ ప్రభుత్వాసుపత్రిలో ఇప్పటికే పలువురు గర్భిణీ స్త్రీలు డెలివరీ కోసం వచ్చి మృతిచెందిన ఘటనలు కొకోల్లోలు. గతంలో ఓ గిరిజన గర్భిణీ స్త్రీ ఆసుపత్రి మెట్లపైనే డెలివరీ అయిన ఘటన నుండి మొదలుకొని.. డెలివరీ కోసం వచ్చి గైనకాలజిస్ట్ వైద్యులు లేక ఆసుపత్రిలో కన్నుమూసిన రాధా వరకు ఎన్నో ఘటనలు చోటుచేసుకున్నా.. వైద్య సిబ్బంది తీరు మాత్రం మారడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వైద్యశాఖ ఉన్నతస్థాయి అధికారులు వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని షాద్ నగర్ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గుండె పగిలేలా చిన్నారులు...

షాద్ నగర్ ప్రభుత్వాసుపత్రిలో మృతిచెంది, పోస్ట్ మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రిలో రాధ మృతదేహం తరలించారు. రాధ భర్త రమేష్ మాత్రం శనివారం రాత్రివరకు కొత్తూరు మండల పోలీస్ స్టేషన్లో ఉండటం గమనార్హం. రాధ పిల్లలు శ్రీవల్లి (రెండో తరగతి) , ఒకటవ తరగతి చదివే పునర్విక మాత్రం తమ తల్లి చనిపోయిందని, తండ్రి పోలీస్ స్టేషన్లో ఉన్నాడని తెలియడంతో గుండె పగిలేలా రోదించడం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

రాధ పిల్లలు శ్రీవల్లి, పునర్విక

నాలుగు రోజుల క్రితం షాద్ నగర్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి (పక్కన.. ఆసుపత్రి సూపరింటెండెంట్ విష్ణు వర్ధన్)

ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లకు ప్రత్యేక నిధులు మంజూరు

సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాలకు రూ.120 కోట్లు..

- ఇతర జిల్లాలకు రూ.కోటి చొప్పున నిధులు
- ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాపై గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజనీర్లతో మంత్రి సీతక్క టెలీ కాన్ఫరెన్స్

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తెలిపారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు, ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. ఈ నిధులతో అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేసి, ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక వనరులను వినియోగించుకోవడంతో పాటు, అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు తదితర స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి, అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి సహా పలు ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఇప్పటికే నిర్మించిన ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలో నీరు ఇంకేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పురోగతిలో ఉన్న నిర్మాణాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ విభాగాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలి

డీజీపీ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్

హైదరాబాద్, అక్టోబర్ 31 (జనంసాక్షి) : సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) కార్యక్రమాన్ని శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ (పిఅండ్ఎల్) గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. మల్టీ జోన్ – × ఐజీ చంద్రశేఖర్ రెడ్డి దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్, మల్టీ జోన్–× ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తో పాటుగా ఏఐజీ (అడ్మిన్) అన్వోన్య, పలువురు పోలీసు అధికారులు, సీఏవోలు, ఏవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాదాద్రి లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు!

యాదాద్రి భువనగిరి (జనంసాక్షి) : యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల దంపతులు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేద పండితులు గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. గవర్నర్ పర్యటన సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఆలయ ఈవో భవానీ శంకర్, బోర్డు సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ఈవో గవర్నర్ దంపతులకు స్వామివారి జ్ఞాపికతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ శివప్రతాప్ శుక్ల ఆవిష్కరించారు. అనంతరం యాదగిరిగుట్టలో వేద విద్యను అభ్యసించి, పరీక్షల్లో ఉత్తీర్ణులై మెరిట్ సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వయంగా సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నగదు చెక్కులను పంపిణీ చేశారు. వేద విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. గవర్నర్ ఆలయ పర్యటనతో యాదాద్రి క్షేత్రంలో సందడి నెలకొంది. ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మినీ ట్యాంక్ బండ్‌గా ఫాక్స్ సాగర్

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ (జనం సాక్షి) : జీడిమెట్లలోని 129 ఏండ్ల చరిత్ర కలిగిన ఫాక్స్ సాగర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెరువును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 490 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో 150 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కలిసి ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. పట్టా భూములు ఉన్నవారికి చట్టప్రకారం టీడీఆర్ కల్పిస్తామన్నారు. చెరువులో 10 అడుగుల మేర పూడిక, పారిశ్రామిక వ్యర్థాలు పేరుకుపోయాయ ని కమిషనర్ తెలిపారు. వాటినిపూర్తిగా తొలగించి మంచినీటి సరస్సుగా మారు. స్తామని అన్నారు. మురుగు, పారిశ్రా మిక వ్యర్థాలు చెరువులో కలవకుండా కాలువలను మళ్లించడంతో పాటు ఎస్టీ పీల ద్వారా శుద్ధి చేసిన నీటిని చెరువులో కి మళ్లిస్తామని వివరించారు. తొలిదశ పనులను రూ.75 కోట్లతో చేపట్టను న్నట్లు వెల్లడించారు. హైడ్రా అదనపు కమిషనర్ ఆనంద్కుమార్, ఏసీపీ పి తిరుమల్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

ఇంట్లో శవాలుగా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ భార్య, పిల్లలు!

ధారూర్ (జనంసాక్షి) : వికారాబాద్ జిల్లా దారూర్ మండలం చింత కుంట గ్రామంలో విషాదం నెలకొంది. ఇద్దరు పిల్లల ను చంపి తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కల కలం సృష్టించింది. వాసవి (35) అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెప్తున్నారు. పిల్లలు.. సహర్స్ రెడ్డి 9, వేదర్శి రెడ్డి 8 సంవత్సరాలు. వాసవి భర్త భూపతిరెడ్డి తాండురులోని ఓ డిగ్రీ కళాశాల లో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన భార్య వాసవి గత 6 సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధ పడు తుందని, 6 సంవత్స రాలుగా మానసిక వైద్యం చేయిస్తున్నానని భర్త భూపతి రెడ్డి కన్నీరు మున్నీ రుగా విలపించాడు. వాస వి తన ఇద్దరు పిల్లల కు ఇంట్లో తాడుతో ఉరివేసి అనంతరం తాను కూడా ఉరివేసుకుని చని పోయిం దని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. సమాచారం అందుకున్న దారూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం కోసం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటికి సింగూరు జలాలు

- మూడు గేట్ల ద్వారా 11,310 క్యూసెక్కుల నీరు దిగువకు
- మొత్తం 0.15 టీఎంసీల నీటి విడుదల

పుల్కల్, అక్టోబర్ 31 (జనం సాక్షి): సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీరా నదికి త్రాగునీటి కోసం అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులోని 4, 6, 7వ నంబర్ గేట్లను 1.5 మీటర్ల మేర పైకి ఎత్తి నీటిని దిగువకు వదిలారు.మూడు గేట్ల ద్వారా మొత్తం 11,310 క్యూసెక్కుల నీరు మంజీరా నదిలోకి విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ డి ఈ మధుసూదన్ తెలిపారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో మంజీరా నది పరివాహక ప్రాంతాల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉంది.మొత్తం 0.15 టీఎంసీల నీటిని విడుదల చేసిన నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.నదీ పరివాహక ప్రాంతాల్లో పశువులను,వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రైతులను జాగ్రత్తగా ఉండాలని కోరారు. ప్రాజెక్టు నీటి నిల్వలు,దిగువ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు నీటి విడుదల చేపట్టినట్లు సమాచారం. అనంతరం ఎత్తిన మూడు గేట్లను అధికారులు సాయంత్రం 5:50 నిమిషాలకు మూసివేశారు.

బీసీ కులగణనపై అమిత్ షా స్పందించాలి..

- దేశవ్యాప్త ఉద్యమం ఆపేది లేదు: జాజుల

హైదరాబాద్ (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా బీసీ కులగణనపై నెలకొన్న అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. నవంబర్ 2న హైదరాబాద్ పర్యటనకు వస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. బీసీ సంఘాలతో సమావేశమై వారి సమస్యలను వినాలని కోరారు. జనగణనలో బీసీల కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ప్రస్తుతం నిర్వహిస్తున్న జనగణనలో ఎస్సీ, ఎస్టీల తరహాలో బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు.

రామంతాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు!

హైదరాబాద్ (జనంసాక్షి) : రామాంతపూర్ లో చెరువు ఎఫ్టీఎల్ ఆక్రమించి కట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. 2026 అక్టోబర్ 31న పోలీసుల సహకారంతో రామాంతపూర్ చెరువు ఆక్రమణలను తొలగించింది. ఈ క్రమంలో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. చెరువు ఎఫ్ టీ ఎల్ పరిధిలో నిర్మించిన మధురా బార్ షెడ్ ను హైడ్రా అధికారులు కూల్చివేశారు. బార్ తో పాటు రేకుల షెడ్డును కూడా జేసీబీతో కూల్చివేశారు. హైడ్రా కూల్చివేతలపై బార్ ఓనర్లు అభ్యంతరం తెలిపారు. గత 40 ఏండ్లుగా మున్సిపల్ బిల్, కరెంట్ బిల్లు, టాక్స్ లను చెల్లిస్తూ వస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు ఎఫ్టీఎల్ లో ఉందని హైడ్రా కూల్చివేతలకు పాల్పడటం సరికాదని ఓనర్లు నూకల గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ర్యాపిడోలో బంగారం పంపిస్తే.. ఆభరణాలతో ఉడాయించిన డ్రైవర్!

హైదరాబాద్ (జనంసాక్షి) : ర్యాపిడోలో బైక్ పార్సిల్ బుక్ చేసి బంగారు ఆభరణాలు పంపించాలనుకున్న ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. పార్సిల్‌ను గమ్యస్థానానికి చేర్చాల్సిన డెలివరీ డ్రైవర్.. అందులోని రూ.62,383 విలువైన బంగారు ఆభరణాలతోనే ఉడాయించాడు. దానికంటే ముందు పెట్రోల్ ఖర్చులకు డబ్బులు కావాలని అదనంగా రూ.100 వసూలు చేసి మరీ వెళ్లాడు. కానీ ఎంత సమయమైనా పార్సిల్ అందకపోవడంతో కంగారుపడి ఫోన్ చేయగా.. బాధితుడి నంబర్‌ను బ్లాక్ చేశాడు. ఈ వింత ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో వెలుగుచూసింది. దత్త ప్రసాద్ నల్లపాటి అనే వ్యక్తి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని వివో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. నాగోల్‌లోని తన బంధువుల ఇంటికి బంగారు ఆభరణాలు పంపించాలని అనుకున్నాడు. రూ.62,383 విలువైన బంగారపు ఉంగరాలు, గాజులను ఒక పార్సిల్‌లో ప్యాక్ చేశాడు. వాటిని పంపించేందుకు ర్యాపిడో పార్సిల్ సర్వీస్‌ను బుక్ చేశాడు. అనంతరం బంగారం ఉన్న పార్సిల్‌ను ర్యాపిడో డ్రైవర్‌కు ఇవ్వాలని సూచించాడు. ఇక కార్యాలయానికి వచ్చిన ర్యాపిడో డ్రైవర్ గీతిమెట్టు మురళికి సెక్యూరిటీ గార్డు పార్సిల్ అందజేశాడు. ర్యాపిడో డ్రైవర్ పార్సిల్ తీసుకుని అక్కడి నుంచి బయల్దేరాడు. కాసేపటికి డ్రైవర్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370